RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in



02 మార్చ్ 2025 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:233

## వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి బడ్జెట్ ప్రతిపాదనలను శీఘ్రగతిన అమలు

### ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు



న్యూఢిల్లీ మార్చి 1 వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలను శీఘ్రగతిన అమలు జరపాలని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం పిలుపు ఇచ్చారు. కొత్త బడ్జెట్‌పై చర్చించే బదులు 'కార్యాచరణ'పై దృష్టి కేంద్రీకరించాలని సంబంధిత వ్యక్తులు, సంస్థలకు మోడీ విజ్ఞప్తి చేశారు. 'వ్యవసాయం, గ్రామీణ సంపద'పై బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధాని ప్రసంగిస్తూ, తన మూడవ విడతలో నిరంతర విధానపరమైన దృక్పథంతో 'వికసిత్ భారత్' కోసం ప్రభుత్వ కొత్త లక్షం విస్తరణను బడ్జెట్ ప్రతిబింబిస్తోందని నొక్కిచెప్పారు. 'ఈ ఏడాది బడ్జెట్‌ను శీఘ్రగతిని అమలు పరచడం ప్రధానం. బడ్జెట్ రూపొందింది, మా మొత్తం దృష్టి కార్యాచరణపైనే' అని మోడీ తెలిపారు. బడ్జెట్ అమలులో 'ప్రతిబంధకాలను, లోటుపాట్లను' సంబంధిత వ్యక్తులు, సంస్థలు గుర్తించాలని ఆయన సూచించారు. బడ్జెట్‌కు ముందు సంబంధిత వ్యక్తులు, సంస్థల నుంచి సమీకరించిన వివరాలు, సూచనలు దాని రూపకల్పనలో తోడ్పడ్డాయని మోడీ తెలిపారు. 'ఇప్పుడు ఈ బడ్జెట్‌ను మరింత సమర్థంగా అమలు చేయవలసిన అగత్యం ఉంది. మెరుగైన ఫలితం కోసం సంబంధిత వ్యక్తులు, సంస్థల పాత్ర కూడా మరింత కీలకం' అని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయాన్ని వృద్ధికి తొలి ఇంజన్‌గా పరిగణిస్తున్నారని, వ్యవసాయ వృద్ధి, గ్రామీణ సౌభాగ్యం సాధించాలనే జంట లక్షాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ప్రభుత్వం 'వికసిత్ భారత్' లక్షం సాధించేందుకు నిబద్ధమై ఉందని, ఏ రైతూ వెనుకబడి ఉండకుండా , ప్రతి రైతూ పురోగమించేలా చూసేందుకు కృషి చేస్తున్నామని మోడీ చెప్పారు. 'మనం దేశ వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకుని మరిన్ని లక్షాలు సాధించవలసిన అవసరం ఉంది' అని ప్రధాని ఉద్బోధించారు. వ్యవసాయ రంగంలో సాధించిన రికార్డు విజయాల గురించి ప్రధాని ప్రధానంగా ప్రస్తావించారు. ఆహారధాన్యాల ఉత్పత్తి ఒక దశాబ్దం క్రితనాటి 265 మిలియన్ టన్నుల నుంచి ప్రస్తుతం 330 మిలియన్ టన్నులకు పెరిగిందని, అదేవిధంగా ఉద్యాన పంటల ఉత్పత్తి 350 మిలియన్ టన్నులు దాటిందని ఆయన తెలియజేశారు. మోడీ ప్రత్యేకంగా పిఎం ధన్ ధాన్య కృషి యోజన గురించి ప్రస్తావించారు. అది తనకు 'ఎంతో ముఖ్యమైన పథకం' అని ఆయన అభివర్ణించారు. ఆ పథకం తక్కువ పంట ఉత్పత్తులు ఉన్న 100 జిల్లాలపై దృష్టి కేంద్రీకరిస్తుందని ఆయన తెలిపారు. ఐసిఎఆర్ కృషిని కూడా ప్రధాని ప్రస్తావించారు. 2014, 2024 మధ్య 2900 పైచిలుకు కొత్త ఆహారధాన్యాలు, పప్పుధాన్యాలు, చెరకు, తదితర పంటల వంగడాలను ఆధునిక సాధనాలను ఉపయోగించి అభివృద్ధి చేసినట్లు మోడీ తెలియజేశారు. ఆ కొత్త వంగడాలు రైతులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా చూడవలసి ఉంటుందని మోడీ చెప్పారు. ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభించినప్పటి నుంచి పిఎంకిసాన్ పథకం కింద 11 కోట్ల మంది రైతులకు సుమారు రూ. 3.75 లక్షల కోట్లను నేరుగా బదలీ చేసినట్లు ప్రధాని వెల్లడించారు. రూ. 6000 వార్షిక ఆర్థిక సహాయం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నదని మోడీ తెలిపారు.

## కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలం సీఎం రేవంత్‌రెడ్డి



సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమని చెప్పారు.

గనుల శాఖపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిన విధానాన్ని, పెరిగిన ఆదాయాన్ని అధికారులు సీఎం కి వివరించారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

ప్రభుత్వంలోని నీటి పారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు, పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టే సంస్థలకు అవసరమైన ఇసుకను తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ నుంచే సరఫరా చేసేలా చూడాలన్నారు.

సరైన ధరలకు ప్రభుత్వమే ఇసుక సరఫరా చేస్తే వినియోగదారులు అక్రమంగా సరఫరా చేసే వారిపై ఆధారపడరని అన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక ఎక్కువగా వినియోగం జరుగుతోందన్నారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా సీఎం అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయం త్వరగా తీసుకొని సమస్యను పరిష్కరించాలని చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నఖనిజాల మైనర్ బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , టీజీఎండీసీ ఛైర్మన్ ఈరవత్రి అనీల్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బ్యాగులు మోయవద్దని కాంగ్రెస్ ఇంఛార్జ్ అనడం పెద్ద జోక్ - కేటీఆర్

వార్తా 2 లో

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ బ్రోచర్, వెబ్ సైట్ ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి.



స్కూల్ యూనిఫార్మ్స నమూనాలను పరిశీలించిన సీఎం.సైనిక్ స్కూల్ తరహాలో పోలీస్ స్కూల్ కూడా దేశానికే రోల్ మోడల్ గా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించిన సీఎం.విద్యా విధానంలో కొత్త ఒరవడిని అవలంభించాలన్న సీఎం రేవంత్ రెడ్డి.స్పోర్ట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించిన సీఎం.పోలీస్ అమరుల కుటుంబాల పిల్లలకు అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించిన సీఎం.

## ఈ నెల 8 నుంచి మణిపూర్‌లో అన్ని మార్గాల్లో ప్రజలు స్వేచ్ఛగా సంచరించేలా చూడాలి

### భద్రతా దళాలకు కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఆదేశం



న్యూఢిల్లీ మార్చి 1 మణిపూర్‌లో ఈ నెల 8 నుంచి అన్ని మార్గాల్లో ప్రజలు స్వేచ్ఛగా సంచరించేలా చూడాలని భద్రతా దళాలను కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా శనివారం ఆదేశించారు. అవరోధాలు సృష్టించేవారిపై కఠిన చర్య తీసుకోవాలని కూడా కేంద్ర మంత్రి కోరారు. మణిపూర్‌లో భద్రత పరిస్థితిపై ఢిల్లీలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి అమిత్ షా అధ్యక్షత వహిస్తూ, ఆ రాష్ట్రంలో చిరకాల ప్రశాంతత పునరుద్ధరణకు కేంద్రం పూర్తిగా కట్టుబడి ఉందని, ఈ విషయమై అవసరమైన సహాయాన్ని అందజేస్తున్నదని తెలియజేశారు. ఆ ఈశాన్య రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించిన తరువాత నిర్వహించిన తొలి సమీక్షా సమావేశం అది. 2023 మే నుంచి మణిపూర్‌లో జాతుల మధ్య హింసాత్మక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. హింసాకాండలో 250 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు, ఈ నెల 8 నుంచి మణిపూర్‌లో అన్ని రోడ్లపై ప్రజలు స్వేచ్ఛగా సంచరించేలా చూడాలని హోమ్ శాఖ మంత్రి ఆదేశించినట్లు అధికార ప్రకటన వెల్లడించింది.

రోడ్లపై అవరోధాలు సృష్టించేవారిపై కఠిన చర్య తీసుకోవాలని కూడా ఆయన ఆదేశించారు. మణిపూర్‌లో భద్రత పరిస్థితిపై అమిత్ షా సమీక్ష నిర్వహించినట్లు, రాష్ట్రంలో మొత్తంమీద శాంతి భద్రతల పరిస్థితిపై సమగ్ర వివరణ ఇచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మణిపూర్ అంతర్జాతీయ సరిహద్దు పొడుగునా నిర్దేశిత ప్రవేశ ప్రదేశాలకు రెండు వైపుల కంచె వేసే పనిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అమిత్ షా ఆదేశించారు

మణిపూర్‌ను మాదకద్రవ్యాల రహితం చేసేందుకు మాదకద్రవ్యాల వాణిజ్యంలో పాత్ర ఉన్న మొత్తం నెట్‌వర్క్‌ను నిర్మూలించాలని హోమ్ శాఖ మంత్రి కోరారు. మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, కేంద్ర హోమ్ శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డెకా, సైనిక దళాల డిప్యూటీ చీఫ్, ఆర్మీ ఈస్టర్న్ కమాండ్ కమాండర్ కూడా సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బిరేన్ సింగ్ రాజీనామా చేసిన తరువాత ఫిబ్రవరి 13న రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించిన విషయం విదితమే, 2027 వరకు కాలపరిమితి ఉన్న రాష్ట్ర శాసనసభను సుప్త చేతనావస్థలో ఉంచారు. ప్రతి ఒక్కరూ అక్రమ, చోరీ ఆయుధాలను అప్పగించాలని గవర్నర్ ఫిబ్రవరి 20న అల్టిమేటమ్ జారీ చేసిన తరువాత భద్రత పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

## వరంగల్ మామునూరు విమానాశ్రయం

### పనులు వేగవంతం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశం



వరంగల్ ప్రజాబలం ప్రతినిధి:వరంగల్ మామునూరు విమానాశ్రయం కేరళ కొచ్చి విమానాశ్రయం తరహాలో ఉండాలని, ప్రతి నిత్యం రాకపోకలతో విమానాశ్రయంలో కార్యకలాపాలు జరిగేలా డిజైన్ రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వరంగల్ నగరానికి విమానాశ్రయం ఎక అసెట్ గా ప్రతిష్టాత్మకంగా నిర్మాణం ఉండాలని చెప్పారు.

వరంగల్ మామునూరు విమానాశ్రయానికి సంబంధించిన పనులన్నీ వేగంగా జరగాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ నివాసంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ, పెండింగ్ అంశాల వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైన తొందరగా భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసి డిజైనింగ్ కు పంపించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ ప్రతి నెల తనకు ప్రగతి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. మామునూరు విమానాశ్రయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా కృషి చేసిన ముఖ్యమంత్రి కి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు మరోసారి ధన్యవాదాలు తెలిపారు.



ఈ సమావేశంలో మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి , కొండా సురేఖ , ధనసరి అనసూయ సీతక్క , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు కావ్య చామల కిరణ్ కుమార్ రెడ్డి , ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి , రేవూరి ప్రకాష్ రెడ్డి , నాగరాజు , వరంగల్ మేయర్ గుండు సుధారాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాబలం

02 మార్చ్ 2025 ఆదివారం

# యుఎస్ ఎయిడ్ ఉద్దేశం!

అంతర్జాతీయ అభివృద్ధికి సహాయం అందించేందుకు సంబంధించిన తమ సంస్థ (యు.ఎస్.ఎయిడ్)ను మూసేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని రెండు ప్రధాన పాలక పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య ఇది ఒక ముష్టి యుద్ధానికి దారితీసింది. ఈ మూసివేత నిర్ణయంతో పాటు యు.ఎస్.ఎయిడ్ నిధుల గ్రహీతలుగా వున్న వారి జాబితా కూడా ప్రకటితమైంది. ఈ జాబితా ఆధారంగా భారతదేశంలో ఓటింగ్ శాతం పెంపుదల కోసం 2.1 కోట్ల డాలర్ల నిధులు అందినట్టు ట్రంప్ చెబుతున్నారు. ఆయన ఎవరో ఒకరిని ఎన్నికయ్యేలా చేసేందుకోసం ఈ నిధులు ఉద్దేశించాయంటూ ట్రంప్ ఈ వాదనను మరింత ముందుకు తీసుకువెళ్లారు. దీని కొనసాగింపుగా మరో ముఖాముఖిలో 'ఓటింగ్ శాతం పెంపుదల కోసం ఈ నిధి భారతదేశంలోని తన స్నేహితుడు మోడీకి చేరింద'ని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రకటనలను తీవ్రంగా పరిశీలించవలసిన అవసరముంది. వీటిపై లోతుగా దర్యాప్తు చేయాలి. నిజమని తేలేట్టయితే గనక ఇది మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో విదేశీ శక్తుల ప్రత్యక్ష జోక్యం తప్ప మరొకటి కాబోదు. కనుక ఈ డబ్బు నిజంగా ఏ ప్రయోజనాల కోసం ఎవరికి చేరింది, తెలుసుకునే హక్కు మనకుంది. యు.ఎస్.ఎయిడ్ అనేది ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా అవసరమైన దేశాలకు, సమాజాలకు సహాయం అందజేసే అమాయకమైన సంస్థ ఏమీ కాదు. అమెరికా విదేశాంగ శాఖ వ్యవహారాల కొనసాగింపుగానే అది పనిచేస్తుంది. దాని దుందుడుకు విదేశాంగ విధాన ప్రయోజనాలను ముందుకు తీసుకుపోవడానికే పనిచేస్తుంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో నాటి సోవియట్ యూనియన్ ప్రభావాన్ని వెనక్కు కొట్టడానికే జాన్ ఎఫ్ కెనడీ యు.ఎస్.ఎయిడ్ నెలకొల్పారు. అప్పటి నుంచి ఆ యా దేశాలలో ప్రభుత్వాల మార్పులోనూ అమెరికా కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడి సోషలిస్టు ఉద్యమాలను అణచివేయడంలోనూ అది ముఖ్య పాత్రవహించింది. ఇటీవల అంటే 2023లో కూడా మెక్సికో మాజీ అధ్యక్షుడు ఆండ్రూ మాన్యుయేల్ లోపెజ్ ఒబ్రడార్ తన దేశ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యాన్ని ఖండించారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకమై గ్రూపులకు యు.ఎస్.ఎయిడ్ నిధులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. 2014లో యు.ఎస్.ఎయిడ్ క్యూబన్ ట్విటర్ వేదికగా జున్‌జునే అన్న ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసి సోషలిస్టు క్యూబాలో అశాంతి, అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నించింది. అమెరికా ప్రయోజనలకు ముప్పుగా పరిగణించే ప్రభుత్వాలను మార్చివేయడానికి తామిచ్చే సహాయాన్ని సాధనంగా వాడటమనేది కొత్త లక్షణమేమీ కాదు. భారత దేశానికి ఈ విషయంలో మినహాయింపు కూడా లేదు. కేరళలో ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ సహాయాన్ని ఎలా వినియోగించిందో సాక్ష్యాధారాలతో సహా బయటపడింది. 1957-59 మధ్య అంటే కేరళలో ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ నాయకత్వాన కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన సమయంలో భారతదేశంలో పనిచేసిన అమెరికా మాజీ రాయబారి ఎల్స్‌వర్త్ బంకర్ ఒక ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు. "మేము కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయం చేశామన్నది వాస్తవం' అని ఆయన చెప్పారు. ఆ ప్రభుత్వాన్ని తర్వాత రద్దు చేసిన సంగతి కూడా తెలిసిందే. బంకర్ వాస్తవాలు బయటపెట్టిన సంచలన ఈ ఇంటర్వ్యూ పాఠం రికార్డులు కొలంబియా విశ్వవిద్యాలయం మౌఖిక చరిత్ర విభాగం ఆర్కైవ్స్‌లో అందుబాటులో వున్నాయి. అదే విధంగా 1973-75 మధ్య భారత దేశంలో పనిచేసిన అమెరికా రాయబారి డేనియల్ పాట్రిక్ మొయిన్‌హాన్ ఇలాంటి మరో ఒప్పుకోలు ప్రకటన చేశారు. ప్రమాదకర శాంతి (డేంజరస్ పీస్) అనే తన పుస్తకంలో మోయిన్‌హాన్ కమ్యూనిస్టుల పట్టును ఎదుర్కోవడం కోసం కాంగ్రెస్ పార్టీకి అమెరికా రెండు సందర్భాల్లో ఒకసారి కేరళలో మరోసారి పశ్చిమ బెంగాల్‌లో నిధులు సమకూర్చిందని వెల్లడించారు. భారత దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో అమెరికా చాలా చురుకైన పాత్ర పోషించిందనీ, గట్టిగా జోక్యం చేసుకుందనీ అమెరికా రాయబారులు స్వయంగా ఒప్పుకున్న ఈ రెండు సందర్భాలు సుస్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామికంగా ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాలను కూలదోసేందుకు ఆ విధంగా అమెరికా జోక్యం చేసుకుందని అర్థమవుతుంది.

కనుక కాంగ్రెస్, బిజెపి (లేదా దాని పూర్వ రూపమైన జనసంఘ్)లకు విదేశీ జోక్యాన్ని ఆహ్వానించే విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదనే వాస్తవాన్ని బట్టి చూస్తే దేశ సార్వభౌమత్వం పట్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల వారి నిబద్ధత ఏపాటిదో లేక నిబద్ధతా లేమి ఎంతటిదో కళ్లకు కడుతుంది. ఈ నేపథ్యంలో చూసినప్పుడు భారత దేశంలో ఓటింగు శాతం పెంపు కోసం 2.1 కోట్ల డాలర్ల చెల్లింపులు చేసినట్టు అమెరికా అధ్యక్షుడు వెల్లడించిన అంశం చాలా తీవ్రంగా తీసుకోవలసి వుంటుంది. దీన్ని విస్మరించడం లేదా తోసిపారేయడం కుదిరేది కాదు. అసలు అది దేనిగురించోనన్నట్లు మాట్లాడుతూ బిజెపి లేదా కాంగ్రెస్‌లు దాన్ని కప్పిపుచ్చడం జరగనివ్వకూడదు. ట్రంప్ ప్రభుత్వ వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయనీ ప్రభుత్వం దానిపై పరిశీలన జరుపుతున్నదనీ విదేశాంగ మంత్రి ప్రకటించారు. అంతకు మించి అసలు ఈ చెబుతున్న వాటిలో ఏమైనా నిజముందా లేదా అనేదానిపై మంత్రి పూర్తి మౌనమే వహించారు. కొన్ని మీడియా సంస్థలైతే ఈ నిధులు ఇండియా కోసం కాదనీ బంగ్లాదేశ్ కోసం ఉద్దేశించినవనీ వార్తలు ఇచ్చాయి. ట్రంప్ ఢాకాను ఢిల్లీ అని పొరబడి వుండొచ్చని చెప్పాయి. ఈ రకమైన వివరణ ఆశ్చర్యకరంగా వుండొచ్చు. ఏమైనా భారత దేశ వ్యవహారాల్లో యు.ఎస్.ఎయిడ్ జోక్యందారీ కార్యకలాపాలేమిటన్న దానిపై స్పష్టమైన పారదర్శకమైన వివరాలు సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపైనే వుంటుంది. ట్రంప్ చెప్పిన విషయాలపై ఆర్థిక శాఖ కూడా మౌన ముద్ర దాల్చింది. 2023-24లో ఏడు ప్రాజెక్టులకు గాను యు.ఎస్.ఎయిడ్ ద్వారా 75 కోట్ల డాలర్లు (సుమారు 6,501 కోట్ల రూపాయలు) చేరినట్టు ఆ శాఖ వార్షిక నివేదిక పేర్కొంది. నీటి సరఫరా, పారిశుధ్యం వంటి పథకాలు వీటిలో వున్నాయి. అయితే ఈ 2.1 కోట్ల డాలర్ల గురించి మాత్రం ఆ నివేదిక ప్రస్తావించలేదు. ప్రభుత్వ నివేదికలు చెప్పే ప్రకారం యు.ఎస్.ఎయిడ్ ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకూ భారత దేశంలోని వివిధ రంగాలలో 555 ప్రాజెక్టులకు లక్షన్నర కోట్ల రూపాయల నిధులు సమకూర్చింది. వరసుగా వచ్చిన అన్ని ప్రభుత్వాలు ఏ పార్టీకి చెందినవనే దాంతో నిమిత్తం లేకుండా యు.ఎస్.ఎయిడ్ నిధులను ఉపయోగించుకున్నాయి. ఇదిలా వుంటే బిజెపి ప్రభుత్వం విదేశీ నిధుల (నియంత్రణ) చట్టాన్ని ఆయుధంగా మార్చుకుని వివిధ పరిశోధనా సంస్థలకూ, స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జివో)లకూ నిధులు రాకుండా అడ్డుకున్నది. అదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ దాని భావజాలంతో ముడిపడిన ఇతర సంస్థలు మాత్రం నిరాటంకంగా నిధులు తెచ్చుకోవడానికి అనుమతినిచ్చింది. ఈ పచ్చి ద్వంద్వ ప్రమాణాలు బిజెపి బూటకత్వాన్ని బట్టబయలు చేశాయి. మెజారిటీ మతతత్వ భావజాల ఎజెండాను ముందకు తీసుకుపోవడానికిగాను విదేశీ నిధులు వినియోగించే విషయంలో దానికి పెద్ద పట్టింపు లేదని కూడా తేటతెల్లం చేస్తున్నాయి. యు.ఎస్.ఎయిడ్ నిధుల పూర్తి వివరాలు, ఆ ప్రాజెక్టుల స్వభావం, భారతదేశ అంతర్గత వ్యవహారాలలో దాని చొరబాటు తప్పక బయటికి తేవాలి. తన వ్యాపార ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం ప్రభుత్వ విధానాలను అమెరికా ఏ విధంగా ప్రభావితం చేసిందో తెలుసుకోవలసిన హక్కు భారతీయులకు ఉంది. అంతకన్నా ముఖ్యంగా యు.ఎస్.ఎయిడ్ ద్వారా అమెరికా రాజకీయ ప్రభావం ఏ మేరకు నడించిందో తెలుసుకోవలసిన హక్కు మనకుంది. దేశ సమైక్యత, సార్వభౌమత్వాల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వం తన స్వచ్ఛతను నిరూపించుకోవడం అవసరం.

# బ్యాగులు మోయవద్దని కాంగ్రెస్ ఇంఛార్జ్ అనడం పెద్ద జోక్ - కేటీఆర్

కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ చరిత్ర అంతా బ్యాగులు మోయడమే

కేసీఆర్ అప్పు చేసి సంపద సృష్టించి ప్రజలకు పంచారు

ఒక్క ఏడాదిలోనే లక్షా 50 వేల కోట్ల రూపాయల అప్పు చేసి రేవంత్ ఏం చేసిండు?

తెలంగాణను దోచుకుని రాహుల్ గాంధీ అకౌంట్ లో డబ్బులు వేస్తున్నారు.

కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ నిలుస్తుంది. గెలుస్తుంది




హైదరాబాద్ ‾ ప్రజాబలం ప్రతినిధి చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఎంపిపి గోవర్ధన్ రెడ్డితో సహా పలువరు సర్పంచ్ లు 500 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరారు. వారిని మాజీ మంత్రి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. కేటీఆర్ మాట్లాడుతూ బ్యాగులు మోసి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డిని పక్కన పెట్టుకొని బ్యాగులు మోయొద్దని కాంగ్రెస్ కొత్త ఇన్చార్జ్ మినాక్షి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అప్పట్లో చంద్రబాబుకు బ్యాగులు మోస్తే ,ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్ రెడ్డి బ్యాగులు మోస్తున్నాడని ఆరోపించారు. మంచి మైక్ లో చెప్పాలి చెడు చెవిలో చెప్పాలంటున్న రేవంత్ ఒక్క మంచి పని చేయలేదు కాబట్టే ఎవరూ మైక్ లో చెప్పడం లేదన్నారు. హైడ్రా విధ్వంసం, ఆర్ఆర్ టాక్స్, భూకబ్జాలు, అంతులేని అవినీతితో కుప్పకూలిన ఎస్ఎల్బీసీ టన్నెల్, మొన్ననే కొట్టుకపోయిన పెద్దవాగు, మునిగిన వట్టెం పంప్ హౌస్ ఇలా చెప్పడం మొదలుపెడితే రేవంత్ చెవుల నుంచి రక్తం కారుతుందన్నారు. జనవరి 26న ఖాతాల్లో డబ్బులు పడతాయని హామీ ఇచ్చి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు. రుణమాఫీ జరగలేదు, పెన్షన్లు పెరగలేదు, రైతు భరోసా లేదు, ఆడబిడ్డలకు తులం బంగారం లేదు, కళ్యాణ లక్ష్మి నిలిపివేశారు" అని ఆరోపించారు.

"హైడ్రా, మూసి కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని దెబ్బతీశారు. మేడ్చల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య చేయడం దురదృష్టకరయని అన్నారు రాబోయే పంచాయతీ, ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయాన్ని సాధిస్తుందని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. "తెలంగాణ ప్రయోజనాల కోసం కేసీఆర్ గారే శ్రీరామరక్ష అన్న కేటీఆర్, గులాబీ జెండా ఎగిరితేనే తెలంగాణ గెలుస్తుంది నిలుస్తుందని అన్నారు.

# సౌత్ హైదరాబాద్ పరుగులు

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 1, రైజింగ్ తెలంగాణ పేరుతో రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. మరో భారీ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

ప్రస్తుత రింగ్ రోడ్డు నుంచి త్వరలోనే నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డుకు అనుసందానంగా దాదాపు.. 41.5 కిమీ మేర నిర్మించనున్నారు.

దీనికి దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా పేరును పెట్టాలని నిర్ణయించారు.

ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా రూ.4.030 కోట్ల మేర ఖర్చు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అంచనాలు రూపొందించగా.. హైదరాబాద్ నగరాన్ని దక్షిణం వైపు విస్తరించాలన్న రేవంత్ ఆలోచనలకు ఈ ప్రాజెక్టు కీలకంగా పని చేస్తుందని అంటున్నారు.హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా రూపొందించాలనే ప్రణాళికల్లో నుంచి పుట్టుకు వచ్చిన ఫూచర్ సిటీ నిర్మాణంతో పాటుగా మహానగరాన్ని అన్ని వైపులా విస్తరించాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళిక. అందుకు తగ్గట్టుగానే.. ఓవైపే నెలకొన్న పరిశ్రమలు, ఐటీ సెక్టార్ వంటి రంగాలను నగరం చుట్టూరా విస్తరించేందుకు.. ఫ్యూఛర్ సిటీని శంషాబాద్ వైపు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఆలోచనలకు కొనసాగింపుగా.. మరో భారీ గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపారు. ఇందులో భాగంగా.. ప్రస్తుతం నగరం చుట్టూ ఉన్న రీజినల్ రింగ్ రోడ్డు రావిర్యాల ఇంటర్ ఛేంజ్ నుంచి ఆమన్ గల్ దగ్గర ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు వరకు దాదాపు 41.05 కి.మీ మేర నిర్మించనున్నారు. ఓఆర్ఆర్ ? ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానంగా ఈ నూతన హైవే ఉండాలన్నది సర్కార్ ఆలోచనగా కనిపిస్తోందిప్రస్తుత మహానగరానికి ఓఆర్ఆర్ బాటలు వేస్తే.. భవిష్యత్ విశ్వనగర ఆవిష్కరణలో ఆర్ఆర్ఆర్ కీలక పాత్ర పోషిస్తుందన్నది తెలంగాణ ప్రభుత్వ ఆలోచన. అందులో భాగంగానే.. నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీ, ఆదిభట్ల వంటి కీలక ప్రాంతాల నుంచి ఆమన్ గల్, దాని సమీప ప్రాంతాలకు రవాణాను సులభతరం చేయొచ్చని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన ఫ్యూచర్ సిటీకి సకల సౌకర్యాలు, అన్ని వైపుల నుంచి ప్రయాణ మార్గాల్ని అనుసంధానించేందుకు.. ఈ రహదారి నిర్మించాలని ఆలోచిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతల్ని రేవంత్ సర్కార్.. హైదరాబాదా మెట్రో డెవలప్ మెంట్ అథారిటీ , హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ లకు అప్పగించారు.రేవంత్ సర్కార్ యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని తలపెడుతున్న ఈ ప్రాజెక్టు కోసం ఫిబ్రవరి 28 నుంచి ఈఓఐం బిడ్లు ఆహ్వానించనున్నట్లు తెలిపింది. ఈ భారీ ప్రాజెక్టు నిర్మించేందుకు అర్హులైన బిడ్డర్లు, ఏజెన్సీలు కొటేషన్లు సమర్పించాలని కోరారు. కాగా.. ఈ రతన్ టాటా రేడియల్ రహదారిని రెండు ఫేజ్ లలో నిర్మించనున్నారు. ఇందులో మొదటి భాగాన్ని ఓఆర్ఆర్ దగ్గరి రావిర్యాల నుంచి మీర్ ఖాన్ పేట్ వరకు 19.2 కి.మీ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.1,665 కోట్ల అంచనా వ్యయాన్ని ఖర్చు చేయనున్నారు.రెండో దశలో మీర్ ఖాన్ పేట నుంచి ఆమన్ గల్ దగ్గరి ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ రోడ్డు వరకు 22.30 కి.మీ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ. 2,365 కోట్లను వెచ్చించనున్నట్లు సమాచారం. రేవంత్ సర్కార్ తలపెట్టిన ఈ ప్రతిపాదత రహదారిని 6లేన్లతో నిర్మించనుండగా..ఇది ఇబ్రహీంపట్నం,మహేశ్వరం,కందుకూరర్, యాచా రం, కడ్తాల్, అమన్ గల్ మండలాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని 14 గ్రామాల నుంచి వెళ్లనుంది.

## అనుమతులు లేని భవన నిర్మాణాలను ఉపేక్షించొద్దు. కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి, నగరంలో అనుమతులు లేని భవనాల నిర్మాణాలు జరగకుండా చూడాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని 19 వ వార్డు కార్పొరేటర్ ఆరణి సంధ్య, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి న్యూ బాలాజి కాలని, టిటిడి ప్లాట్స్, ఎస్.కే.డి. నగర్, వైకుంఠపురం పార్కు, రాస్ బిల్డింగ్, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, భవన నిర్మాణాల అనుమతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నాయనే పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయం కార్యదర్శులు నిత్యం ఆయా వార్డుల్లో పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఏవైనా కొత్తగా నిర్మాణాలు జరుగుతుంటే అనుమతులు పరిశీలించాలని అన్నారు. భవన నిర్మాణాల్లో ప్లాన్ లోని నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువల్లో చెత్త తొలగించాలని, మరమ్మత్తులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ.లు మహేష్, లలిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## శ్రీ పరాసరేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా మహా అన్నసంతర్పణ...

తిరుపతిఅన్ని దానాలలో కన్నా అన్నదానం మహా గొప్పదని ఆంధ్ర ప్రదేశ్ వన్నేయకుల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ సి ఆర్ రాజన్ అన్నారు.

తిరుచానూరు వద్దగల యోగిమల్లవరంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి అంబా సమేత పరాసరేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకొని మహా అన్నసంతర్పణ కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సి.ఆర్ రాజన్ కు ఆలయ చైర్మన్ నీలకంఠం ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ముందుగా శ్రీ పరాసరేశ్వర స్వామి వారిని దర్శించుకున్న డాక్టర్ సి.ఆర్ రాజన్ అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని తన వంతు సేవలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శివరాత్రికి క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం చేపడుతున్న డిస్కో శివాను ప్రత్యేకంగా అభినందించారు. అన్ని దానాల్లో కన్నా అన్నదానం చాలా గొప్పదని చెప్పారు. మహాశివరాత్రి సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు కూటమి నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

## సనత్ నగర్ లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి వేలాది మందికి ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలు చేయడం ద్వారా శంకర నేత్రాలయం అధినేత డా రవీందర్ గౌడ్ పేదల జీవితాల్లో వెలుగునిస్తున్నారని ఎస్సార్ నగర్ ఏసీపీ వెంకటరమణ అభినందించారు. శంకర నేత్రాలయం, సంకేత్ స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ సనత్నగర్ల సంయుక్త ఆధ్వర్యంలో సనత్నగర్లో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 3లక్షల మందికి ఉచితంగా కంటి అద్దాలలను ఇవ్వడం గొప్పవిషయమని కొనియాడారు. శిబిరం నిర్వాహకులు, శంకర నేత్రాలయం అధినేత డా. రవీందర్ గౌడ్ మాట్లాడుతూ సనత్నగర్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకున్నామని, నియోజకవర్గంలో అంధత్వం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉచిత నేత్ర శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శిబిరం ద్వారా సనత్నగర్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసులుతో కలిసి ఏసీపీ వెంకటరమణ ఎంపిక చేసిన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. అంతకుముందు పెద్ద సంఖ్యలో హాజరైన స్థానికులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సంకేత్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మురళి ఫణికుమార్ మాట్లాడుతూ శనివారం నిర్వహించిన శిబిరం ద్వారా 700 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించామని, 550 మందికి ఉచితంగా కంటి అద్దాలను, ఔషధాలను అందజేశామని, 30 మందిని నేత్ర శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశామని తెలిపారు కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఓబుల్రెడ్డి, అధ్యక్షులు రామశాస్త్రి, సంకేత్ ప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులపై దాడి ఘటనలో బాధితులను బెదిరించిన కోడేరు ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలి: మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్‾ ప్రజాబలం ప్రతినిధిబీఆర్ఎస్ నాయకులపై దాడి ఘటనలో బాధితులను బెదిరించిన కోడేరు ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేసారు. కోడేరు మండలం నర్యానాయక్ తండాలో బీఆర్ఎస్ నాయకులపై దాడి జరిగింది. చికిత్స కోసం కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే అక్కడ కూడా కత్తులు,గొడ్డళ్లతో దాడి చేసారు. కారు ధ్వంసం అయింది. ప్రభత్వ ఆస్పత్రిలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే దాడి చేసిన వారి వివరాలు బయటకు వస్తాయి ..అ సీసీ కెమెరాలు స్థానిక పోలీస్ స్టేషన్ కు అనుసంధానంగా ఉన్నాయి. ఉదయం దాడి జరిగిన వెంటనే కోడేరు ఎస్సైకి కి ఫిర్యాదు చేస్తే తిరిగి బాధితుడినే బెదిరించారని అన్నారు.

కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మారణాయుధాలతో దాడి చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వాటిని వెంటనే బయట పెట్టాలి. లేకుంటే వాటిని తొలగించే ప్రయత్నం చేస్తారు.. బాధితులను బెదిరించిన కోడేరు ఎస్సై ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో చెరగని సిరా చుక్క కథ

ప్రపంచానికే చెరగని ముద్ర వేసిన భారత అతి పెద్ద ప్రజాస్వామ్య సౌధానికి ఒక పిల్లర్‌గా నిలుస్తూ "చెరగని సిరా" లేదా "ఇండెలిబుల్ ఇంక్" మార్కు అమూల్య సేవలను అందిస్తున్నది. ఓటు వేసిన వెంటనే ఎడమ చేతి చూపుడు వేలుకు పడిన సిరా ముద్రతో మనం సెల్ఫీ తీసి సామాజిక మాధ్యమాల పెట్టడాన్ని సగర్వంగా తీసుకుంటాం. దొంగ ఓట్లను చెక్ పెట్టే రసాయన ఆయుధం, నకిలీ ఓట్లకు అడ్డుకట్ట వేసే ద్రావణంగా ఇండెలిబుల్ ఇంక్‌కు ప్రాధాన్యం ఉన్నది. ప్రజాస్వామ్యానికి పునాదులు ఎన్నికలు. ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగితేనే ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించబడతాయి. ఎన్నికల్లో అక్రమంగా ఒక్కరు రెండు లేదా అంతకన్న ఎక్కువ ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయడాన్ని నిరోధించడానికి పలు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఓటు వేసే ముందు పోలింగ్ బూత్ సిబ్బంది ఎడమ చేతి చూపుడు వేలు గోరు–పైపొరకు (క్యూటికిల్) "ఇండెలిబుల్ ఇంక్ లేదా చెరగని సిరా మార్కు" చుక్కను పెట్టడంతో ఒక్కరు ఒక్క ఓటు మాత్రమే వేయడం, మోసాలకు తావు ఇవ్వడానికి ఆస్కారం లేకపోవడం జరుగుతున్నది. ఇలా ఒక చెరగని సిరా చుక్క ప్రజాస్వామ్య పరిరక్షణలో ముల్ల కంచెలా స్వతంత్ర భారతాన్ని కాపాడుకుంటూ వస్తున్నది. మనం ఓటు వేసామని సగర్వంగా సిరా చుక్కను మాత్రమే చూపిస్తాం. 1962లో స్వతంత్ర భారత 3వ సాధారణ ఎన్నికల నుంచి నేడు జరుగుతున్న ఎన్నికల వరకు ఈ ఇండెలిబుల్ ఇంక్‌కు మెరుగైన ప్రత్యామ్నాయ రసాయనం లేదా మార్గం లేకపోవటంతో దీనిని వాడడం కొనసాగుతున్నది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో 97 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును పొందడం, అందులో దాదాపు 70 శాతం వరకు పోలింగ్ జరగడంతో రూ: 58 కోట్లు వెచ్చించి 5 మిలియన్ల 10 ఎంఎల్ బాటిల్స్ ఇండెలిబుల్ ఇంక్ తయారు చేసి వాడడం జరుగుతున్నది. 1962లో తొలిసారి నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో వినియోగించిన ఇండెలిబుల్ ఇంక్‌ను "కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియన్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్)–నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ (ఎన్‌పిఎల్)" సంయుక్తంగా రూపొందించడం జరిగింది. ఈ ఎన్నికల్లో రూ: 1.84 లక్షలు వెచ్చించి 3 లక్షల లీటర్లు తయారు చేసి 3.16 లక్షల చిన్న సీసాల్లో సరఫరా చేయడంతో చెరగని సిరా చరిత్ర భారత ప్రజాస్వామ్యంతో విడదీయరానా సంబంధాన్ని పెనవేసుకుంది. ఈ చెరగని ఇంకును తయారు చేయడానికి "మైసూర్ పేయింట్స్ అండ్ వార్నిషెస్ లిమిటెడ్" ప్రభుత్వ సంస్థకు అప్పగించడం జరిగింది. ఈ ఇండెలిబుల్ ఇంక్ మార్కును ఓటరుకు పెట్టిన వెంటనే చెరగని మార్కు ఏర్పడడం, కనీసం 72 – 96 గంటలు లేదా 2 నుంచి 4 వారాల వరకు ఈ మార్కు మరే రకంగా తొలగకుండా ఉండడంతో ఓటింగ్ ప్రక్రియలో కొంత పారదర్శకత కనిపిస్తున్నది. ఇండెలిబుల్ ఇంక్‌ను రసాయనంగా "సిల్వర్ నైట్రేట్" ద్రావణంగా పిలుస్తాం. ఈ 10 – 18 శాతం సిల్వర్ నైట్రేట్ జల ద్రావణాన్ని (ఇండెలిబుల్ ఇంక్) వేలు–పైపొరకు అంటించిన వెంటనే అతినీలలోహిత కిరణాలు సోకడంతో చర్మంలోకి లవణంతో చర్య జరిగి "సిల్వర్ క్లోరైడ్"ఏర్పడుతుంది. ఇలా ఏర్పడిన సిల్వర్ క్లోరైడ్ వల్ల చెరగని సిరా చుక్క కొన్ని రోజుల పాటు మనతోనే చెరగకుండా ఉంటుంది. వాయిలెట్ కలర్ ఇండెలిబుల్ ఇంక్‌ను అంటించిన తర్వాత బ్రౌన్ లేదా బ్లాక్ రంగు మార్కుగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో ఇండెలిబుల్ ఇంక్ చుక్క మార్కు పెట్టడంతో కొంత ప్రతికూల ప్రభావాలు లేదా సైడ్ ఎఫెక్ట్స్ కూడా బయట పడ్డాయి. మనం తయారు చేసి వాడుతున్న ఇండెలిబుల్ ఇంక్‌ను దాదాపు 35కి పైగా దేశాలకు ఎగుమతి చేయడం, వారు కూడా దీనిని తమ ఎన్నికల్లో వాడడం జరుగుతున్నది. ఇండెలిబుల్ ఇంక్ మార్కును నీరు, డిటర్జెంట్, సబ్బు, ఇతర ద్రావణాలతో చెరపటం వీలు కాదు. ప్రజాస్వామ్య సౌధానికి పట్టుకొమ్మలుగా ఉన్న వివిధ అంశాల్లో ఇండెలిబుల్ ఇంక్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. చెరగని సిరా చుక్కతో అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, ఎన్నికలను సజావుగా నిర్వహించడం జరుగుతున్నది. ఇంత ముఖ్యమైన ఎన్నికల్లో వాడుతున్న ఇండెలిబుల్ ఇంక్ సేవలను గుర్తిద్దాం, ప్రజాస్వామ్య విలువలకు పట్టాభిషేకం చేద్దాం.

## తెలుగు నాటక సాహిత్యంలో చెరగని సంతకం వడ్డాది సుబ్బరాయుడు

వడ్డాది సుబ్బరాయుడు (జూలై 30, 1854 – మార్చి 2, 1938) తెలుగు నాటక సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందిన గొప్ప నాటక రచయిత. ఆయన "వసురాయకవి"గా ప్రసిద్ధి చెందారు. తెలుగులో నాటక రంగానికి ప్రాథమిక రూపుదిద్దించిన వ్యక్తులలో ఒకరుగా, ఆయన నాటక రచన సంస్కృత నాటక సంప్రదాయాన్ని అనుసరించినప్పటికీ, తెలుగు భాషలో సహజంగా ప్రవహించేలా తన రచనలను తీర్చిదిద్దారు. వడ్డాది సుబ్బరాయుడు 1854 జూలై 30న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని పాసర్లపూడి గ్రామంలో జన్మించారు. ఆయనకు అనధికారిక విద్య మాత్రమే లభించినప్పటికీ, స్వయంకృషితో గొప్ప పండితుడిగా ఎదిగారు.

బాల్యంలోనే నాటకాలు, సాహిత్యంపై మక్కువ కలిగి, స్వయంగా అధ్యయనం చేసి పాండిత్యం సంపాదించారు.సుబ్బరాయుడు తన విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన తరువాత, రాజమండ్రిలోని ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేశారు. అనంతరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడిగా నియమితులయ్యారు. ఈ పదవుల్లో ఉండే సమయంలో తెలుగు సాహిత్యాన్ని మరింతగా అభ్యసించి, నాటక రచనలో తనదైన ముద్ర వేశారు. వడ్డాది సుబ్బరాయుడు చాటు పద్యాలు చెప్పడంలో అపారమైన నైపుణ్యం కలిగినవారు. ఆయన కవితా వ్యాసంగం 1875లో ప్రారంభమై, మరణించే వరకు కొనసాగింది. ఆయన రచనల్లో ప్రధానంగా...వసురాయ చాటు ముక్తావళి, వసురాయ చాటు ప్రబంధం, నామనందన శతకం (1877), భక్త చింతామణి శతకం (1883), ఆర్త రక్తమణి శతకం (1933)తో పాటు, సుబ్బరాయుడు మొత్తం 7 నాటకాలు రచించారు. అన్నీ సంస్కృత నాటకాల తెలుగు అనువాదాలు. వేణి సంహారం (1883, ప్రచురణ: 1886), విక్రమోర్వశీయం (1884, ప్రచురణ: 1889), ప్రబోధ చంద్రోదయం (1891, ప్రచురణ: 1893), చండ కౌశికము (1900), అభిజ్ఞాన శాకుంతలము (1906), మల్లికామారుత ప్రకరణము (1903, ప్రచురణ: 1929), ఆంధ్ర కుందమాల (1931, ప్రచురణ: 1932). ఆయన నాటకాలు భాషా సౌందర్యంతో పాటు, సంస్కృత నాటక శైలిలో నిర్మితమై, తెలుగులో చదవడానికి, ప్రదర్శించడానికి అనువుగా ఉండేవి. వాటిని పాఠ్య గ్రంథాలుగా గుర్తించారు, తద్వారా అనేక మంది విద్యార్థులు, నాటకకారులు ఈ నాటకాల ద్వారా ప్రేరణ పొందారు. ఆయన నాటకాలు నాటకీయత, హాస్యం, భావావేశం, పాత్రల లోతైన చిత్రణను కలిగి ఉంటాయి. ఆయన సంస్కృత నాటకాలను తెలుగులోకి అనువదించి, తెలుగు నాటక రంగానికి గొప్ప మదుపరులుగా నిలిచారు.

ఆయన రచనలు తెలుగు నాటక రంగానికి ప్రేరణగా మారాయి. నాటక రంగంలో సంస్కృత నాటకాల అనువాదాలను మాత్రమే కాకుండా, స్వతంత్రంగా తెలుగు నాటక రచనకు మార్గ దర్శకత్వాన్ని అందించారు. ఆయన ప్రతిభను గుర్తించి, రాజమండ్రి పురప్రముఖులు గండపెండేరం తొడిగి "సూక్తి సుధానిధి" అనే బిరుదునిచ్చి సత్కరించారు. ఆయన నాటకాలు పాఠ్యగ్రంథాలుగా చేరి, విద్యార్థులకు ప్రాముఖ్యత కలిగాయి.

సుబ్బరాయుడు 1938 మార్చి 2న కన్నుమూశారు. అయినప్పటికీ, ఆయన రచనలు తెలుగు నాటకరంగంలో ఇప్పటికీ ప్రాముఖ్యత కలిగినవే. ఆయన అనువాదాలు, రచనలు నాటక కళాకారులు, విద్యార్థులు, సాహిత్యాభిమానుల కోసం మిగిలిపోయాయి. వడ్డాది సుబ్బరాయుడు తెలుగు నాటకరంగానికి గొప్ప సేవ చేశారు. ఆయన రచనలు సాంస్కృతిక, సాహిత్య, నాటక ప్రస్థానాలకు మార్గదర్శకంగా నిలిచాయి. ఆయన రాసిన నాటకాలు నేడు కూడా ప్రదర్శించబడుతూనే ఉన్నాయి. సంస్కృత నాటకాలను తెలుగులో అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా ఆయన చేసిన కృషి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తుంది.

# రాష్ట్ర తొలి మహిళా మంత్రి మాసూమా బేగం

కాలం ఏదైనా సమాజంలో, మిగతా మతాల కన్నా ముస్లిం సమాజంలో ఇస్లాం మతంలో స్త్రీల పరిస్థితి పూర్తి భిన్నమైంది. మతాలన్నీ స్త్రీని, పురుషుని తర్వాతనే రెండవ స్థానంలో పరిగణిస్తున్నప్పటికీ, ఇస్లాం మతం స్త్రీని పరదా చాటు వ్యక్తిగా చూసింది. పరాయి పురుషు ల కంటపడటమే నేరంగా కట్టడి విధించింది. పరదా అంటే కొన్ని వర్గాలలో మహిళలు వారి దేహాన్ని కనపడకుండా కప్పుకొనే సాంప్ర దాయ ఆచారం. కొన్ని ప్రాంతాలలో స్వచ్ఛందంగా, మరి కొన్ని ప్రాంతాలలో ఆంక్షల నేపద్యంలో మహిళలు స్వేచ్ఛగా మసలే హక్కును కోల్పోయారు. బురఖా అనేది ఇస్లాం మత ఆచారాలకు చిహ్నంగా మతపరమైన ఆంక్షలను విధిస్తుంది. అలా పరదా చాటు ముస్లిం స్త్రీలు సమాజంలో మిగతా వర్గాల స్త్రీల కన్నా ఎక్కువగా మత ఆచారాలు, పురుషాధిపత్యం విధించిన ఆచారాలు, ఆంక్షల వల్ల అణచి వేతకు, నిర్బంధానికి గురి కావలసి వచ్చింది. మహిళలను మతపరమైన కార్యక్రమాలకు అనుమతించినప్పటికీ, శతాబ్దాలుగా ఎక్కువగా నిర్బంధాన్ని, ఆంక్షలనూ ఎదుర్కొన్నారు.ముస్లిం మహిళల విద్య విషయంలో...మదరసాల్లో విద్యా భ్యాసం కేవలం మగవారికే అందుబాటులో ఉన్నా, పట్టణాలు, నగరాల్లో ప్రాముఖ్యత కలిగిన కుటుంబాల స్త్రీలకు ఇళ్ళు, ఆంతరంగిక ప్రదేశాల్లో విద్య నేర్పేవారు, మహిళలు మత గ్రంథాలను, వ్యవహారికంగా పనికి వచ్చే నైపుణ్యాలను పెద్దల నుంచి, ఒకరి నుంచి ఒకరూ నేర్చుకునే వారు. అలా పరదా ధరించే సంప్రదాయం మాటున... సమాజంలో స్వేచ్ఛగా తిరిగే అవకాశాలు మృగ్యమైన కాలంలో, ఇంటి బయటకు రాని సాంఘిక కట్టుబాట్ల ఆంక్షల నేపద్యంలో ఉన్నత చదువులు చదివే సాహసం చేయడమే కాకుండా ప్రజా సంబంధాలు అధికంగా ఉండే రాజకీయాల్లోనూ ముందుకు సాగడం సామాన్యమైన విషయమేమీ కాదు. అలా విద్యా వేత్త కావడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్టంలో తొలి మహిళా మంత్రిగా చరిత్ర పుటల్లోకి ఎక్కారు మాసూమా బేగం. దేశంలో మంత్రి పదవిని అధిష్టించిన తొలి ముస్లిం మహిళ కూడా ఆమెనే కావడం విశేషం. మాసూమా బేగం (అక్టోబరు 7, 1901 – మార్చి 2, 1990) సంఘ సేవకురాలు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్టంలో తొలి మహిళా మంత్రి. దేశంలో మంత్రి పదవిని అధిష్టిం చిన తొలి ముస్లిం మహిళ కూడా ఆమెనే. హైదరాబాదీ అయిన మాసూమా బేగం చిన్నప్పట్నుంచే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. మసూమా బేగం 1901, అక్టోబరు 7 న హైదరాబాదులో విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. ఆమెకు చిన్నతనం నుండి సంఘ సేవలో ఆసక్తి మెండుగా ఉండేది. మసూమా విద్యాభ్యాసం మహబూ బీయా బాలికల పాఠశాలలో జరిగింది. ఆమె 20 సంవత్సరాల వయసులో 1921లో తల్లి తయ్యబా బేగం మరణించడంతో, తల్లిచే స్థాపించబడిన "అంజుమన్ –ఏ – ఖవాతీన్" అనే జాతీయ మహిళా సంస్థకు అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.1922లో ఆమె ఆక్స్‌ఫర్డులో విద్యను అభ్యసించి స్వదేశానికి తిరిగి వచ్చిన తమ కజిన్ హుసేన్ అలీఖాన్‌ను పెళ్ళి చేసు కున్నారు. అమె భర్త డాక్టర్ హుసేన్ ఆలీ ఖాన్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆంగ్ల శాఖా ధిపతిగా పనిచేశారు. 1927లో హైదరా బాదులో ఏర్పడిన అఖిల భారత మహిళా సంస్థ యొక్క ఆంధ్ర శాఖ కార్యదర్శిగా తరువాత అధ్యక్షురాలిగా పనిచేశారు. తల్లి ద్వారా సరోజినీ నాయుడుతో పరిచయం కలిగిన పరిచయం చిరకాలం నిలిచి పోగా, ఆమె సాహచర్యంతో, 1928లో బొంబాయిలో తొలిసారిగా నిర్వహిం చిన అఖిల భారత మహిళా సదస్సులో ఆమె పాల్గొనడం జరిగింది. హైదరాబాద్ రాష్టంలో 1952లో జరిగిన ఎన్నికల్లో శాలిబండ నియోజకవర్గం నుంచి పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెట్టారు. బూర్గుల రామకృష్ణారావు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పని చేశారు. ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాలు విలీనం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్టంలో 1957లో జరిగిన తొలి ఎన్నికల్లో పత్తర్‌గట్టి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిగా విధులు నిర్వర్తించారు. 1960 జనవరిలో రాష్ట్ర మలి ముఖ్య మంత్రి దామోదరం సంజీవ య్య ప్రభుత్వంలో మంత్రిగా చేరారు. 1962లో తిరిగి పత్తర్‌ఘట్టి నియోజకవర్గం నుండి పోటీచేసి స్వతంత్ర అభ్యర్థి సలావుద్దీన్ ఒవైసీ చేతిలో ఓటమి చవి చూశారు. ప్రపంచంలో ద్వేషం, అసూయ నిర్మూలించేందుకు ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన సంఘంలో ఆమె సభ్యురాలుగా ఉన్నారు. మసూమా బేగం 1990, మార్చి 2 న హైదరాబాదులో మరణించారు.

## ప్రజల మనిషి శ్రీపాదరావు

దుద్దిళ్ళ శ్రీపాదరావు (మార్చి 2, 1935 – ఏప్రిల్ 13, 1999) సీనియర్ కాంగ్రెస్ శాసనసభ్యులు, శాసనసభ స్పీకరుగా పని చేశారు. 1935 సంవత్సరములో మార్చి 2న కాటారం మండల ధన్వాడ గ్రామానికి చెందిన మౌళి పటేల్ రాధా కిష్టయ్య, కమలా బాయి దంపతులకు జన్మించారు. అమ్మమ్మ వారు నివాసముండే నాగపూర్ లో పుట్టిన అయన ప్రాథమిక విద్య ధన్వాడ గ్రామంలో చేసి, ఎస్ఎస్‌సి వరకు మంథనిలోని బావ సువర్ణ చంటయ్య ఇంట్లో ఉండి పూర్తిచేశారు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్ లో చేసిన తరువాత ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతి ఇన్స్పెక్టర్‌గా ఉద్యోగం కొన్ని రోజులు చేశారు. ఆ తరువాత నాగపూర్ లో న్యాయవాదిగా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో ఎల్. ఎల్.బి.పూర్తి చేసి ప్రాక్టీసు పెట్టారు. తండ్రి మరణాంతరం స్వంత ఊరికి వచ్చిన శ్రీపాద వ్యవసాయమే వృత్తిగా చేసుకొని, గ్రామంలోనే ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామం నుండి సర్పంచ్ గా పోటీ చేయాలని ప్రజలు ఒత్తిడి చేశారు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాద రాజకీయాల్లోకి అడుగిడాలని స్నేహితులు, హితులు ప్రోత్సాహించారు. ఆ దిశగా అడుగులు వేస్తూ పోటి చేసి మొదటిసారి సర్పంచ్ గా ఎన్నుకో బడ్డారు. వరుసగా మరో మారు ఆయనకే ప్రజలు మద్దతు పలకడంతో రెండవ సారి ఎన్నికయ్యారు. మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ఎల్ ఎం బి ఛైర్మన్ పదవికి మంథని నుండి గెలిచారు. ఆయన రాజకీయ ఎదుగుదలకు ఎల్ ఎం బి బ్యాంకు ఛైర్మన్ ఎన్నిక ఎంతో సహకరించింది. దీంతో పూర్తిగా నియోజకవర్గానికే ఆయన సుపరిచితమైనారు. పదవివస్తే ముఖం చాటు చేసుకునే నాయకులకు భిన్నంగా అయన ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్ట, నష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగారు. 1984 ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుండి ఏమ్మేల్లెగా పోటి చేసే అవకాశం లభించింది. అప్పుడే పురుడు పోసుకున్న తెలుగు దేశం పార్టీ ప్రభావం, ఎన్టిఆర్ ప్రభంజనం ముందు శ్రీపాదరావు విజయం సాదించగలుగుతారా? అనే అంశం పై స్వ, విపక్షాలలో చర్చ జరిగింది. తెలుగుదేశం, సంజయ్ విచార మంచ్ మధ్య ఎన్నికల ఒప్పందం కారణంగా మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటిగా సంజయ్ విచార మంచ్ నుండి చంద్రుపట్ల రాజి రెడ్డి పోటీ పడ్డారు. వీరిద్దరి మధ్య గట్టి పోటి నెలకొనగా చివరకు శ్రీపాదరావు విజయం సాధించారు. కరీంనగర్ జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ తరపున మంథని ప్రాంత ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు పి. సి.సి. సభ్యునిగా స్థానం కల్పించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు శాసన సభ్యులుగా ఎన్నికైన ఆయనకు శాసనసభ స్పీకర్ గా అన్ని పార్టీల మద్దతుతో పదవి అలంకరించారు ఆ పదివికి వన్నె తెచ్చారని ఎంతో మంది ప్రముఖుల, రాజకీయ విశ్లేషకుల ప్రశంశలు పొందారు. ఒకవైపు స్పీకర్ పదవి బాధ్యతతో నిర్వహిస్తునే మరోవైపు తన స్వంత నియోజకవర్గ ప్రజలను మాత్రం మరిచిపోకుండా, మరింత దగ్గరయ్యారు. విమర్శలకు వెరవకుండా, పొగడ్తలను లెక్క చేయకుండా, అభివృద్ధిపై దృష్టి సారిస్తూ ముందుకు కదిలారు. ఒక సామాన్య కుటుంబం నుండి ఎదిగిన రాజకీయ నాయకుడు కావడంతో ప్రజల కష్ట, సుఖాలు తెలిసిన మహా మేధావి కనుక ప్రభుత్వ విధి – విధానాలపై అసెంబ్లీలో చురుకైన పాత్ర పోషించి, ఆ పదవికే వన్నె తెచ్చారని ఎంతో రాజకీయ విశ్లేషకులు కితాబిచ్చారు. 1994 ఎన్నికల ముందు నక్సల్స్, పోలీసుల మధ్య జరిగిన ప్రత్యక్ష పోరు తీవ్రంగా ప్రభావం చూపింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో శ్రీపాదరావు పరాజయం పాలయ్యారు. అయిన ఓటమి పాలయిన ప్రజలకు మాత్రం దూరం కాలేదు. వారి మధ్యలోనే ఉంటూ వారికి తన శక్తి మేరకు సేవ చేస్తూనే ఉంటూ వచ్చారు. తన ఓటమికి విమర్శ కూడా చేయకుండా హుందాగా వ్యవహరించి, తన ప్రజాభిమాన్ని మరింత చూరగొన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి బాగాగులను ఎల్లవేళలా యోచించే ఆయనను మృత్యువు నక్సల్స్ రూపంలో కబళించింది.1999 ఏప్రిల్ 13న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రమంతటా విషాద ఛాయలు అలుము కున్నాయి. మంథని ప్రాంతమంత శోక సాగరంలో మునిగి పోయింది. మహాదేవపూర్ మండలం అన్నారం కు తన అనుచర వర్గంతో వెళ్లి వస్తున్న క్రమంలో మార్గమధ్య లోని అడవుల్లో శ్రీపాదరావు వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలి తీసుకెళ్ళి తుపాకి తూటాలతో విగత జీవున్ని చేశారనే వార్త తెలవగానే ప్రజలలో నక్సల్స్‌పై ఆక్రోశం ఒక్కసారిగా ఉప్పెనల బయటికి వచ్చింది. ప్రజా నాడి అయిన శ్రీపాదరావును హత మార్చిన విషయం తెల్సుకున్న ప్రజలు నక్సల్స్ ను ఎవరిపైన మీ యుద్ధం ప్రజల పైననా? ప్రజా హృదయం పైననా?" అంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఎన్నడు అపకారాన్ని తలపెట్టని నాయకున్ని నిష్కారణంగా హత మార్చిన నక్సల్స్ పై విమర్శలు వెల్లు వెత్తాయి. రాజకీయంగా అనిశ్చిత పరిస్థితి నెలకొంది. ప్రజల కోసం తుపాకులు పతి పోరు బాట పట్టినట్లు చెప్పుకొనే నక్సల్స్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం ప్రతి ఒక్కరు ప్రత్యక్షంగా విమర్శించారు. అప్పటి రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు సైతం హుటా హుటిన మార్చురీలో ఉన్న మృత దేహాన్ని చూసేందుకు తరలి వచ్చారు. నక్సల్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, వేల మందికి పైగా కన్నీటి పర్యంతమై శ్రీపాదరావు అంత్య క్రియల్లో పాల్గొన్నారు. అనంతరం పీపుల్స్ వార్ అగ్రనాయకత్వం, కేంద్ర కమిటీ సభ్యుడు సంతోష్, శ్రీపాదరావును హతమార్చడం నక్సల్స్ యొక్క చారిత్రాత్మక తప్పిదం అని పేర్కొన్నాడు. ఒక ప్రజా నాయకున్ని అన్యాయంగా చంపామంటూ తప్పు ను ఒప్పుకునారు.

## వచ్చే ఫస్ట్ నుంచి పురుష పొదుపు సంఘాలు

ఏలూరు, మార్చి 1, మహిళా సంక్షేమం కోసం తెలంగాణ, ఏపీతో పాటు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రారంభించింది. వారికి స్వయం ఉపాధి కల్పించడంతో పాటు.. ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో పొదుపు సంఘాలకు రుణాలను మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళలకు డ్వాక్రా గ్రూపులు ఉన్నట్లుగానే ఏపీలో పురుష కార్మికులకు కూడా పొదుపు సంఘాలు ఏర్పాటు కానున్నాయి. వీరికి కూడా రుణాలను మంజూరు చేయనున్నారు.1982లో ప్రారంభించిన డ్వాక్రా పథకం గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో తోడ్పాటును అందిస్తోంది. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే కాకుండా.. స్వయం ఉపాధి అవకాశాలను ఈ పథకం కల్పిస్తుంది. ఈ పథకంలో మహిళలకు చాలా తక్కువ వడ్డీతో రుణాలను మంజూరు చేస్తారు.దీని మాదిరిగానే పట్టణాల్లో అసంఘటిత రంగంలో పనిచేసే పురుషుల కోసం స్వయం శక్తి బృందాలు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం రుణాలను అందించనుంది. దీనిలో భాగంగానే పురుషుల కోసం ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది.దేశవ్యాప్తంగా ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ కింద 2,841 గ్రూపులను ఏర్పాటు చేసినట్లు మెప్మా అధికారులు పేర్కొన్నారు. ఔజఒఓ (నేషనల్ అర్బన్ లైవ్‌లీవుడ్ మిషన్) 2.0 కొత్త గైడ్‌లైన్స్ ప్రకారం.. మహిళలు ఎలాగైతే స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పడి రుణాలు పొందుతున్నారో.. అలానే పురుషులకు కూడా రుణాలను అందించేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఈ పథకం రూపొందించినట్లు మెప్మా అధికారులు తెలిపారు.డ్వాక్రా సంఘంలోని మహిళలు గ్రూపుగా ఏర్పడిన విధంగా.. పురుషులు కూడా కనీసం 5 మందితో గ్రూప్ ఏర్పాటు చేసుకోవచ్చు. గరిష్టంగా ఎంత మందైనా ఈ గ్రూపులో చేరవచ్చు. ఇలా ఒక గ్రూపుగా ఏర్పడిన వారికి మాత్రమే బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తాయి. దీనిని వాయిదాల రూపంలో బ్యాంకులకు తిరిగి చెల్లించవచ్చు. ప్రతి ఒక్కరూ కనీసం రూ.100 పొదుపు చేయాల్సి ఉంటుంది.ఉదాహరణకు ఐదుగురు సభ్యులున్న గ్రూపులో రూ.500 పొదుపుతో మూడు నెలల పాటు క్రమం తప్పకుండా పొదుపు చేస్తే, రివాల్వింగ్ ఫండ్ కింద రూ. 25 వేలు మంజూరు చేస్తారు. వీటిని ఆరు నెలల పాటు క్రమంతో తప్పకుండా పొదుపు చేస్తే, ఫస్ట్ లింకేజీ కింద బ్యాంకులు ఆరు రెట్లు రుణం అందిస్తాయి. రుణాలు అందుకున్న పురుషులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీని మాఫీ చేస్తాయి.వీటికి భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులతో పాటు.. రిక్షా కూలీలు, తోపుడు బండ్లు నడిపే వారు, గిగ్ వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, కేర్ వర్కర్స్ అర్హులుగా ఉంటారు.

## 25 లక్షల ఇన్సూరెన్స్...

గుంటూరు, మార్చి 1, రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా ఏపీ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుత బడ్జెట్ 2025లో ప్రజా సంక్షేమానికే పెద్ద పీట వేసింది. రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి కొండంత అండగా నిలుస్తోంది. ఏపీ ప్రజల కోసం సరికొత్త ఇన్సూరెన్స్ స్కీమ్ తీసుకొస్తోంది. నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు ఈ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. రాష్ట్రంలో ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల బీమా సౌకర్యాన్ని తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాదు.. ఈ ఆరోగ్య బీమా పథకం ఈ ఏడాది నుంచి అమలులోకి రానుందని వెల్లడించారు. ఇందుకోసం ఆరోగ్యశాఖకు రూ.19,264 కోట్లను బడ్జెట్లో కేటాయించారు.మధ్యతరగతి, పేద ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా కార్పోరేట్ వైద్యం అందేలా హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేయనున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో ఆయన పేర్కొన్నారు. రూ. 25 లక్షలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమాను అందించనున్నట్టు తెలిపారు.ఎన్టీఆర్ వైద్య సేవను కొనసాగిస్తూనే.. ఆరోగ్య బీమా పథకం అమలు చేయనున్నట్టు మంత్రి పయ్యావుల స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉండగా.. అంతకన్నా మెరుగైనా వైద్య సేవలను అందించనుందా? అనేది తెలియాల్సి ఉంది. ఈ కొత్త ఇన్సూరెన్స్ స్కీమ్ అమలుకు సంబంధించి నియమ నిబంధనలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దాంతో ఎవరెవరు ఇందుకు అర్హులు అనేది స్పష్టత లేదు.ప్రస్తుత రోజుల్లో ఆస్పత్రుల ఖర్చులు భారంగా మారిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ఇన్సూరెన్స్ సామాన్య, మధ్యతరగతి వారిలో వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించనుంది. మెరుగైన ఇన్సూరెన్స్ కవరేజ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అత్యంత ప్రయోజనకరంగా ఉంటుందని నిలుస్తుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే దీనికి సంబంధించి కొత్త నిబంధనలు విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు

# గుంటూరు, కృష్ణా... ఇప్పుడు చిత్తూరు

తిరుపతి, మార్చి 1, ఆంధ్రప్రదేశ్ లో వరస అరెస్ట్ లు వైసీపీ నేతలను భయపెడుతున్నాయి. ఇప్పటికే అనేక మంది అరెస్టయ్యారు. కొందరు జైలుకు వెళ్లి బెయిల్ పై బయటకు వచ్చారు. మరికొందరు ఇంకా జైలులోనే రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఇప్పటికే మాచర్లమాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ లు జైలుకు వెళ్లి బెయిల్ పై బయటకు వచ్చారు. తర్వాత కొన్ని రోజుల క్రితం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా సినీ నటుడు పోసాని కృష్ణమురళికి రైల్వే కోడూరు కోర్టు పధ్నాలుగు రోజులు రిమాండ్ విధించింది. దీంతో పోసాని తర్వాత ఎవరు అరెస్ట్ అవుతారన్న దానిపై వైసీపీలో జోరుగా చర్చ జరుగుతుంది.ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన నాటి నుంచి టీడీపీ, జనసేన క్యాడర్ నుంచి ఒకటే డిమాండ్ వినపడుతుంది. తమ అధినేతలను,వారి కుటుంబాలను కించపర్చే విధంగా మాట్లాడిన వారిని ఇంకా ఎందుకు లోపలెయ్యలేదంటూ తెలుగు తమ్ముళ్లు ఆవేశంగా ప్రశ్నిస్తున్నారు. అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని చంద్రబాబు చెబుతూ వస్తున్నారు. కానీ తొమ్మిది నెలలవుతున్నా తమ అధినేతలను, కుటుంబ సభ్యలను కించపర్చిన వారిని అరెస్ట్ చేయకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అరెస్ట్ చేయాలంటూ నిలదీస్తున్నారు. నిజంగా ఇది అధికారంలో ఉన్న నేతలపై కొంత ఒత్తిడి పెరిగిందనే చెప్పాలి. కానీ ఇప్పుడు పోసాని తర్వాత ఎవరు అరెస్ట్ అవుతారన్న దానిపై పెద్దయెత్తున ఊహాగానాలు చెలరేగుతున్నాయి. మాజీ మంత్రి కొడాలి నాని ఇందులో ఫస్ట్ ప్లేస్ లో ఉన్నారని చెబుతున్నప్పటికీ, ఈసారి మాత్రం చిత్తూరు జిల్లాకు చెందిన ఒక నేతను అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. అనంతపురం జిల్లాకు చెందిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మార్చి 5వ తేదీన విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే గోరంట్ల మాధవ్ కంటే ముందుగా రెడ్డి సామాజికవర్గం నేత ఒకరిని అరెస్ట్ చేసే అవకాశముందని టీడీపీ క్యాడర్ పెద్దయెత్తున చర్చ జరుగుతుంది.ఇప్పటికే సదరు నేతపై అనేక కేసులు నమోదయి ఉండటంతో పాటు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయన్న నిర్ధారణకు రావడంతో త్వరలోనే అరెస్ట్ కు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అదే జరిగితే వైసీపీలో ఒక కుదుపు కుదిపినట్లే అవుతుంది. ఎందుకంటే బడా నేతను అరెస్ట్ చేయడంతో టీడీపీ నేతలతో సుదీర్ఘకాలం వైరం ఉన్న ఆ నేత పనిపట్టాలని చిత్తూరు జిల్లా టీడీపీ నేతలు కూడా పట్టుబడుతున్నారు. దీంతో త్వరలోనే ఆ నేతను అరెస్ట్ చేసే అవకాశముంది. ప్రస్తుతం కృష్ణా, గుంటూరు జిల్లాలకే పరిమితమయిన అరెస్ట్ ల పర్వం చిత్తూ రు జిల్లాకు పాకే అవకాశముందని తేలడంతో ఫ్యాన్ పార్టీలో కొంత అలజడి రేగిందనే చెప్పాలి. మొత్తం మీద వరస అరెస్ట్ లతో వైసీపీ నేతలు భయపడిపోతున్నారు.

# నిధుల లేకుండానే నిర్మాణం

విజయవాడ, మార్చి 1, అసంబద్ధ రాష్ట్ర విభజన కారణంగా రాజధానిని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ తమకంటూ అమరావతిని ప్రజా రాజధానిగా ఏర్పాటు చేసుకుందన్నారు పయ్యావుల కేశవ్. దీనికి ఆనాడు ఆమోదం తెలిపి.. అధికారంలోకి రాగానే మాట మార్చారని వైసీపీపై విమర్శలు చేశారు. మాట మార్చడమే కాకుండా.. అమరావతి విధ్వంసానికి కూడా నడుం బిగించారని ధ్వజమెత్తారు. నాటి ప్రభుత్వ అరాచక విధానాలపై అమరావతి రైతులు పోరుబాట పట్టి తమను తాము కాపాడుకుంటూ రాజధానిని కూడా కాపాడుకున్నారని కితాబు ఇచ్చారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా. రాజధాని పనులు పెద్ద ఎత్తున చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పయ్యావుల ప్రకటించారు. రాజధాని అనేది ఓ ప్రాంతం కోసం కాదు... రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేసే గ్రోత్ ఇంజిన్‌గా అమరావతిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.మహారాష్ట్ర అభివృద్ధికి ముంబై ఎంత కీలకమో, తెలంగాణ వృద్ధికి హైదరాబాద్ ఎంత ముఖ్యమో, మనరాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి అమరావతి నిర్మాణం అంతే అవసరమన్నారు పయ్యావుల. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ప్రపంచ స్థాయి మౌలిక నదుపాయాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా అమరావతిని ముంబై, హైదరాబాద్‌తో నరితూగే ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ చేసిన కామెంట్స్ గుర్తు చేశారు. రాజధాని నిర్మాణం కోసం అంత డబ్బులు ఇవ్వలేం... కాబట్టే మూడు రాజధానుల ఏర్పాటు అన్నారన్ని తెలిపారు. రాజధాని వనుల నిర్మాణం కోసం బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదని వివరించారు.కానీ రాజధాని పనులు ప్రారంభం కాబోతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా అమరావతి సెల్ఫ్ సస్టైనబుల్ ప్రాజెక్టు అని మరోసారి పునరుద్ఘాటించారు. తనకు తానే ఆర్థిక వనరులు సంపాదించుకునే ప్రాజెక్టు అమరావతి అని పేర్కొన్నారు. అది నిజమని ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంక్, హడ్కో వంటి ఆర్థిక సంస్థల సహకారంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమరావతికి నిధులు నమకూర్చే ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. దీనితో రాష్ట్ర బడ్జెట్ సహాయం లేకుండానే స్వీయ పెట్టుబడి వనరులు కలిగిన రాజధాని నగర ప్రాజెక్టుగా 'అమరావతి' మారిందన్నారు.

# కోనసీమ మొనాలిసా

కాకినాడ, మార్చి 1, మహా కుంభమేళా మొత్తానికి సోషల్ మీడియా వేదికగా సెంట్రాఫ్ అట్రాక్షన్ ఏమైనా ఉందంటే అది పూసలమ్ముకునే మోనాలిసానే... మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ అమ్మాయి ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పూసలు అమ్ముకుంటుండగా ఆమె కళ్లకు, ఆమె అందానికి ఫిదా అయిన ఓ వ్యక్తి ఆమె వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు... ఇక ఆ వీడియో ఎవ్వరూ ఊహించలేనంతగా వైరల్ అయ్యి దేశవ్యాప్తంగా ట్రెండ్ అయ్యింది. అంతే కాదు భాషతో సంబంధం లేకుండా మోనాలీసా వీడియోలు సోషల్ మీడియా వేదికలపై చక్కర్లు కొట్టాయి. దీంతో మెయిన్ స్ట్రీమ్ మీడియా నుంచి యూట్యూబ్ ఛానెళ్లు సైతం మోనాలీసా ఇంటర్వ్యూ కోసం ఎగబడ్డారు. వీరే కాదు సాధారణ జనం కూడా ఆమెతో ఫోటోలు దిగేందుకు ఆమెను పోలీసులు దాచాల్సిన పరిస్థితి ఏర్పడిరది.ఆమె చివరకు ట్రైన్ ఎక్కి తమ సొంతూరుకు వెళ్లాల్సి వచ్చింది.. ఆ తరువాత ఆమెను బాలివుడ్ దర్శక నిర్మాత కలిసి చివరకు సినిమాలోకూడా తీసుకున్నారు.. అయితే అలాగే అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓ తీర్ధమహోత్సవంలో పూసలు అమ్ముకుంటున్న ఓ బాలికను వీడియో తీసి కోనసీమ మోనాలిసా అంటూ పోస్ట్ చేశాడో యువకుడు.. అయితే ఇప్పుడు ఆయువకుడు కేసుల్లో ఇరుక్కోవాల్సిన పరిస్థితి తలెత్తింది.కోనసీమ ప్రాంతంలో కాట్రేనికోన మండలం చెయ్యేరులో సత్తెమ్మతల్లి తీర్ధమహోత్సవం మూడు రోజుల పాటు ఘనంగా జరిగింది. ఈ తీర్ధమహోత్సవంలో ముమ్మిడివరానికి చెందిన ఓ బాలిక తల్లితండ్రులకు బాసటగా ఉండేందుకు పూసల దండలు, ఇతర అలంకరణ వస్తువులు అమ్ముతుండగా ముమ్మిడివరంకు చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడు కోనసీమ మోనాలీసా అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్ట్ చేశాడు. అది బాగా వైరల్ అయ్యింది.. దీంతో కేవలం ఇన్‌స్టాలోనే కాకుండా సోషల్‌మీడియా ఇతర వేదికల్లోనూ ఈ వీడియో గిర్రున తిరగడంతో ఈ అమ్మాయిని గుర్తుపట్టిన వారు ఆమెను ఆటపట్టించడం మొదలు పెట్టారు.ఈ బాలిక ఓ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతుండడంతో తోటి విద్యార్థులు కూడా ఆటపట్టించడం మొదలుపెట్టారు.. దీంతో ఆ అమ్మాయి వాళ్ల అమ్మకు చెప్పడంతో కుటుంబీకుల సలహాతో ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది.. పోలీసుల దర్యాప్తులో ముమ్మిడివరానికి చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడు ఈ వీడియో తీసి ఇన్‌స్టాలో పోస్ట్ చేసినట్లు గుర్తించారు పోలీసులు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## స్వాతంత్ర్య సమరయోధురాలు "నైటింగేల్ ఆఫ్ ఇండియా" సరోజినీ నాయుడు

### -నేడు ఆమె వర్ధంతి

స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహిళల కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేసిన వారిలో సరోజినీనాయుడు ప్రముఖ రాలు. కవిత్వంతో మాధుర్యన్ని కురిపించి ' నైటింగేల్ ఆఫ్ ఇండియా' గా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచారు. భారత జాతీయ కాంగ్రెస్ తొలి మహిళా అధ్యక్షురాలిగా, స్వతంత్ర భారతదేశపు మొదటి మహిళా గవర్నరుగా పనిచేసిన ఆమె రాజకీయాల్లో మహిళలకు అత్యున్నతస్థానం సాధ్యమే అని నిరూపించారు.ఫిబ్రవరి 13, 1897న హైదరాబాద్ లోని బెంగాలీ బ్రాహ్మణ కుంటుంబంలో ఆమె జన్మించారు. తల్లిదండ్రులు అఘోరనాథ చటోపాధ్యాయ, వరద సుందరీ దేవి. శాస్త్రవేత్త,తత్వవేత్త అయిన అఘోరనాథ చటోపాధ్యాయ హైదరాబాద్‌లో నిజాం కాలేజీ ని స్థాపించి, ప్రిన్స్‌పాల్‌గా చాలా కాలం పనిచేశారు. తల్లి వరద సుందరీ దేవి కవయిత్రి. అమ్మనాన్నల అక్షరజ్ఞానాన్ని, సాహిత్యా భిరుచిని పుణికిపుచ్చుకున్న సరోజిని నాయుడు చిన్నతనం లోనే ఉర్దూ, తెలుగు, ఆంగ్లం, పర్షియన్, బెంగాలీ భాషలు అనర్గళంగా మాట్లాడేది. పిబిషెల్లీ కవిత్వాన్ని ఆమె చాలా ఇష్టపడేవారు.మహిళల విద్యపై అనేక ఆంక్షలు ఉన్న ఆ రోజుల్లోనే తల్లిదండ్రుల ప్రోత్సహంతో సరోజిని ఉన్నతవిద్యను అభ్యసించింది. 1891లో జరిగిన మెట్రిక పరీక్షలో రాష్ట్రం లోనే ప్రథమస్థానం లో ఉత్తీర్ణత పొందిన ఆమె అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆమె తెలివితేటలకు ఆశ్చర్య పడిన నిజాం నవాబు ఆమెను విదేశాలకు పంపించాడు. 1898 వరకు ఇటలీ,స్విట్జర్లాండ్ లో ఉండి అపారమైన విజ్ఞానాన్ని సంపాదించిన ఆమె ఎందరో ప్రపంచప్రఖ్యాతి గాంచిన రచయితల కవిత్వాలు, గ్రంధాలు చదివారు. ఎన్నో కవితలను రాసి విదేశీయుల ప్రసంశలను అందుకున్నారు. స్వదేశానికి తిరిగివచ్చిన తరువాత డిసెంబర్ 2, 1898లో డాక్టర్ గోవిందరాజులు నాయుడును ప్రేమవివాహము చేసుకున్నారు. వారి విహహాన్ని సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించాడు. సమాజంలో కులాంతర వివాహలను వ్యతిరేకిస్తున్నరోజుల్లో ఆమె తీసుకున్న సాహసోపేత చర్య ఎందరో ఆగ్రహానికి గురి చేసినా సరోజిని వాటిని లెక్కచేయకుండా ధైర్యంగా నిలిచారు. సాహిత్యంలోనూ విశేషకృషి చేశారు. 1905 గోల్డెన్ థ్రెషోల్డ్, 1912లో దబర్డ్ ఆఫ్ టైమ్, 1917లో ది బ్రోకెన్ వింగ్, ద పోయెమ్స్ ఆఫ్ లైఫ్ అండ్ డెత్ తదితర కవితాసంపుటాలు ప్రచురించ బడ్డాయి.ప్రముఖపోరాటయోధుడు గోపాలకృష్ణాగోఖలేతో 1912 సంవత్సరంలో జరిగిన పరిచయం ఆమెలో నూతనఉత్తేజాన్ని తీసుకువచ్చింది. హిందూ ముస్లింల సఖ్యత గురించి ప్రజలకు వివరించాలని ఆమె నిర్ణయించుకున్నారు. మార్చి 22, 1912 లో లక్నో నగరంలో జరిగిన ముస్లింలీగ్ మహాసభలో హిందూ ముస్లీం భాయిభాయి అంటూ అనర్గళంగా ఆమె చేసిన ప్రసంగం ఎందరినో ప్రభావితం చేసింది. ఆమె వాగ్ధాటికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు చేసిన నినాదాలు మిన్నంటాయి. హిందూ ముస్లీంలు ఐక్యపోరాటం ద్వారా ఆంగ్లేయులను తరిమికొట్టాలన్న ఆమె సందేశం ఎందరిలోనూ మార్పు తీసుకువచ్చింది. జాతిపిత మహ్మాతగాంధీని 1914 లో కలిసిన సరోజిని ఆయనకు ముఖ్యఅనుచరురాలిగా మారారు. 1916లో లక్నోలో జరిగిన ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పాల్గొ నడంతో ఆమె రాజకీయ జీవితం ప్రారంభం అయ్యింది. 1930లో దండయాత్ర, ఉప్పుసత్యాగ్రహాలలో పాల్గొనందుకు గాను ఆమె కారాగార శిక్షను అనుభవించారు. 1931లో లండన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో గాంధీజితో పాటుగా పాల్గొన్నారు. రాయల్ సొసైటీకి సభ్యురాలిగా ఎన్నికైయ్యారు. ఆమె కవితకు కెయిజర ఇ హింద్ స్వర్ణ పతకం లభించింది. భారతజాతీయ కాంగ్రెస్‌కు మొదటి మహిళా అధ్యక్షురాలు గా ఆమె పేరు చిరస్మరణీయం. స్వతంత్ర్యభారతంలో ఆమె 1949 వరకు యునైటెడ్ ప్రావిన్సెస్‌కు గవర్నర్‌గా పనిచేసి మహిళలు రాజకీయ రంగంలోనూ రాణించగలరని నిరూపించారు. కవికోకిలగా ప్రసిద్ది పొందిన ఆమె మార్చి 2, 1949 న లక్నోలో మరణించారు.

# తల్లికి వందనం పథకంలో వడపోత

నెల్లూరు, మార్చి 1, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్ లో అయితే నిధులు కేటాయించారు. అయితే ఈ పథకాలకు సంబంధించి నిధులు సరిపోతాయా? లేవా? అన్నదానిపై చర్చ జరుగుతుంది. ఈ ఏడాది రెండు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని ప్రకటించడంతో బడ్జెట్ లో ఎంత మేరకు నిధులు కేటాయిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే రెండు పథకాలకు అరకొరగా నిధులు కేటాయించారని, ఇది దేనికి సంకేతమని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను ఈ ఏడాది అమలు చేస్తామని ప్రకటించింది. అన్నదాత సుఖీభవ పథకానికి 6,300 కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ పథకం అమలు చేయాలంటే దాదాపు పదివేల కోట్ల రూపాయలు అవసరం కాగా, 6,300 కోట్ల రూపాయలను కేటాయించడం చర్చనీయాంశమైంది. ఇక ఈ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ చెప్పలేదు. ఈ ఏడాది మాత్రం అమలు చేస్తామని చెప్పారు. అంటే వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి అమలు చేస్తారని భావించాలి. కేంద్ర ప్రభుత్వం జూన్ లేదా జులై నెలలో విడుదల చేసే పీఎం కిసాన్ పథకం నిధులతో పాటు అన్నదాత సుఖీ భవ పథకాన్ని కూడా అమలు చేసే అవకాశాలున్నాయి. రైతులు ఇందుకోసం మరో మూడు నెలలు వెయిట్ చేయాల్సి ఉంటుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇక తల్లికి వందనం కార్యక్రమం ఈ ఏడాది ప్రభుత్వం అమలు చేయనుంది. మే నెల నుంచి అమలు చేస్తామని స్పష్టంగా బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అయితే ఈ పథకం కింద 9,407 కోట్ల రూపాయల నిధులను మాత్రమే కేటాయించిందంటున్నారు. దాదాపు పదమూడు నుంచి పధ్నాలుగు వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని చెబుతున్నారు. చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి పదిహేను వేల రూపాయలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత తక్కువ స్థాయిలో నిధులు కేటాయించడం పై పలు అనుమానాలు కలుగుతున్నాయని విపక్ష నేతలు అంటున్నారు.. ఈ రెండు పథకాలను ప్రస్తుతం బడ్జెట్ లో కేటాయించిన నిధులతో అమలు చేయాలంటే ప్రభుత్వం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందంటున్నారు. ప్రధానంగా లబ్దిదారుల ఎంపికలోనే జల్లెడ పట్టే అవకాశముంది. స్పష్టమైన అర్హతలతో పాటు దారిద్య్ర రేఖకు దిగువన ఉండటమే కాకుండా విద్యార్థుల హాజరు కూడా తల్లికి వందనం పథకంలో తీసుకునే అవకాశముంది. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద కూడా పీఎం కిసాన్ పథకం పొందే రైతులకు మాత్రమే చెల్లించే అవకాశలున్నాయి. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే జమ చేస్తామని చెబుతుంది కాబట్టి ఆ రకమైన నిర్ణయం తీసుకునే అవకాశముందని చెబుతున్నారు. ఇక కౌలు రైతులకు కూడా ఏడాదికి ఇరవై వేల రూపాయలు ఇస్తామని ప్రకటించడం శుభపరిణామంగానే చూడాలి.

**మే నెల నుంచి**

మే నెల నుంచి... వచ్చే ఏడాది పాఠశాలలు ప్రారంభం కాగానే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి తల్లికి వందనం పథకాన్ని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అమ్మవొడి పథకం కింద తల్లి ఖాతాలోనే నిధులను జమ చేసేవారు. అయితే చంద్రబాబు నాయుడు తన ఎన్నికల ప్రచారంలో భాగంగా తల్లికి వందనం పేరిట ప్రతి విద్యార్థికి పదిహేను వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులున్నా వారికి ఈ పథకం వస్తుందని కూడా చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పారు. గత ప్రభుత్వం మాత్రం అమ్మఒడి ఇంటికి ఒక్కరికే ఈ పథకాన్ని అందించింది.. దీంతో పాఠశాలలు జూన్ నెల నుంచి ప్రారంభం కానున్నాయి. మే నెల నుంచి తల్లికి వందనం కింద నిధులు జమ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రతి వాళ్ల రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు ఉండాల్సి ఉంటుంది. చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి పదిహేను వేల రూపాయలు ఇస్తామని చెప్పడంతో ఇప్పటికే దీనిపై అధికారులు కసరత్తులు ప్రారంభించారు. హాజరు శాతం కూడా 75 శాతం పైన ఉంటేనే గత ప్రభుత్వం అమ్మఒడి పథకం నిధులు విడుదల చేసేది. దానిని ఈ ప్రభుత్వం అలాగే కొనసాగించే వీలుంది. దీంతో పాటు దారిద్య్ర రేఖకు దిగువ ఉన్న వారికే ఈ పథకం వర్తింప చేయనున్నారు. తెలుపు రంగు రేషన్ కార్డు తప్పనిసరి. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా ఈ పథకం వర్తించదని అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అయితే త్వరలోనే దీనికి సంబంధించి విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించనుంది

**కేంద్ర నిధులతో కలిపి...**

న్నదాత సుఖీభవ పథకం కింద రైతుల కు పెట్టుబడి సాయం కింద ఏడాదికి ఇరవై వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. మ్యానిఫేస్టోలో కూడా ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. మూడు విడతలుగా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. అంటే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆరువేల రూపాయల నిధులకు మరో పధ్నాలుగు వేల రూపాయలు జత చేసి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆరు వేల రూపాయలను మూడు విడతలుగా విడతకు రెండు వేల రూపాయల చొప్పున అందచేస్తుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకం కింద విడతకు నాలుగు వేల రూపాయలు జత చేసి ఇవ్వనుంది. అంటే కేంద్ర ప్రభుత్వం నిధులతో కలిపి ఒక విడతకు ఆరువేల, చివరి విడతకు ఎనిమిది వేల రూపాయల చొప్పున అందనున్నాయి. అయితే వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈసారి విడుదల చేసే నిధులతో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వేల రూపాయలు జత చేసి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. దీంతో మరో సూపర్ సిక్స్ హామీని అమలు పర్చేందుకు సిద్ధమయిందని స్పష్టమయింది

# ప్రజాభిమానాన్ని చూరగోన్న మహానేత స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు

### -పదవికి వన్నెతెచ్చిన గొప్ప నాయకుడు

### -నేడు ఆయన జయంతి -శ్రీపాద జయంతిని అధికారికంగా చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

ప్రజాభిమానాన్ని చూరగోన్న మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు. ఈయన మార్చి 2, 1935న అప్పటి కరీంనగర్ జిల్లా ధన్వాడ గ్రామంలో (ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా) జన్మించారు. న్యాయవిద్య అభ్యసించిన శ్రీపాదరావు ప్రారంభంలో పంచాయతి కార్యాలయంలో క్రిందిస్థాయి ఉద్యోగిగా జీవనం ఆరంభించి, రాజకీయాలలో ప్రవేశించి సర్పంచిగా, సమితి అధ్యక్షుడిగా, భూ తనఖా బ్యాంకు చైర్మెన్‌గా, మూడుసార్లు మంథని శాసనసభ్యుడిగా, శాసనసభ స్పీకరుగా అంచెలంచెలుగా ఎదిగారు. 1935 సంవత్సరమలో మార్చి 2 న కాటారం మండల ధన్వాడ గ్రామానికి చెందినా మౌళి పటేల్ రాధాకిష్టయ్య, కమలా బాయి దంపతులకు జన్మించాడు. అమ్మమ్మ వారు నివాసముండే నాగపూర్ లో పుట్టిన అయన ప్రాధమికవిద్య ధన్వాడ గ్రామంలో చేసి, ఎస్ ఎస్ సి వరకు మంథనిలోని బావ సువర్ణ చంటయ్య ఇంట్లో ఉండి పూర్తిచేశాడు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్ లో చేసిన తరువాత ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతి ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం కొన్ని రోజులు చేశారు. ఆ తరువాత నాగపూర్ లో న్యాయవాదిగా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో ఎల్. ఎల్. బి. పూర్తి చేసి ప్రాక్టీసు పెట్టారు. తండ్రి మరణాంతరం స్వంత ఊరికి వచ్చిన శ్రీపాద వ్యవసాయమే వృత్తిగా చేసుకొని, గ్రామంలోనే ఉన్నాడు. కొన్ని రోజుల తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామం నుండి సర్పంచ్ గా పోటీ చేయాలని ప్రజలు ఒత్తిడిచేశారు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాద రాజకీయాల్లోకి అడుగిడాలని స్నేహితులు, హితులు ప్రోత్సాహించారు. ఆ దిశగా అడుగులు వేస్తూ పోటి చేసి మొదటిసారి సర్పంచ్ గా ఎన్నుకోబడ్డారు. వరుసగా మరో మారు ఆయనకే ప్రజలు మద్దతు పలకడంతో రెండవ సారి ఎన్నికయ్యారు. మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ఎల్ ఎం బి చైర్మన్ పదవికి మంథని నుండి గెలిచాడు. ఆయన రాజకీయ ఎదుగుదలకు ఎల్ ఎం బి బ్యాంకు చైర్మన్ ఎన్నిక ఎంతో సహకరించింది. దీంతో పూర్తిగా నియోజకవర్గానికే ఆయన సుపరిచితమైనాడు. పదవివస్తే ముఖంచాటు చేసుకునే నాయకులకు భిన్నంగా అయన ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్ట, నష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగాడు. 1984 ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుండి ఏమ్మెల్లెగా పోటి చేసే అవకాశం లభించింది. అప్పుడే పురుడు పోసుకున్న తెలుగు దేశం పార్టీ ప్రభావం, ఎన్టిఆర్ ప్రభంజనం ముందు శ్రీపాదరావు విజయం సాదించగలుగుతాడా అనే అంశం పై స్వపార్టీ, విపక్షాలలో చర్చ జరిగింది. తెలుగుదేశం, సంజయ్ విచార మంచ్ మధ్య ఎన్నికల ఒప్పందం కారణంగా మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటిగా విచార మంచ్ నుండి చంద్రుపట్ల రాజి రెడ్డి దిగారు. వీరిద్దరి మధ్య గట్టి పోటి నెలకొనగా చివరకు శ్రీపాదరావు విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు శాసన సభ్యులుగాఎన్నికైన ఆయనకు శాసనసభ స్పీకర్ గా అన్ని పార్టీల మద్దతుతో పదవి నదిష్టించారు. ఆ పదవికి వన్నె తెచ్చారని ఎంతోమంది ప్రముఖులు, రాజకీయా విశ్లేసకులతో ప్రశంశలు పొందారు. ఒకవైపు స్పీకర్ పదవి బాధ్యతతో నిర్వహిస్తునే మరోవైపు తన స్వంత నియోజకవర్గ ప్రజలను మాత్రం మరిచిపోకుండా, మరింత దగ్గరయ్యారు. విమర్శలకు వెరవకుండా, పొగడ్తలను లెక్క చేయకుండా, అభివృదిపై దృష్టి సారిస్తూ ముందుకు కదిలారు. 1994 ఎన్నికల ముందు నక్సల్స్, పోలీసుల మధ్య జరిగిన ప్రత్యేక్ష పోరు తీవ్రంగా ప్రభావం చూపింది. తీవ్రఉద్రిక్త పరిస్థితుల్లో ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో శ్రీపాదరావు పరాజయం పాలయ్యాడు. అయిన ఓటమి పాలయిన ప్రజలకు మాత్రం దూరం కాలేదు. వారి మధ్య లోనే ఉంటూ వారికి తన శక్తి మేరకు సేవ చేస్తూనే ఉంటూ వచ్చాడు. పాలకపక్షం, ప్రాతినిధ్యం వహిస్తున్న అప్పటి శాసన సభ్యులు రామ్ రెడ్డి పై కనీసం పల్లెత్తు మాట, విమర్శ కూడా చేయకుండా హుందాగా వ్యవహరించి, తన ప్రజాభిమాన్ని మరింత చూరగొన్నారు.ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులను పట్టించుకునే పరిస్థితుల్లోనే ఆయనను మృత్యువు నక్సల్స్ రూపంలో కబళించింది. 1999 ఏప్రిల్ 13 న మహాదేవపూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో వెళ్లివస్తున్న క్రమంలో మార్గ మధ్యంలోని అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలి తీసుకెళ్ళి కరుకు తుపాకి తూటాలతో విగత జీవున్ని చేశారు. ఈ సంఘటన రాష్టాన్ని కుదిపివేసింది. ఎన్నడు అపకారాన్ని తలపెట్టని నాయకుణ్ణి నిష్కారణంగా హతమార్చిన నక్సల్స్ పై విమర్శలు గుప్పు మన్నాయి. రాజకీయంగా అనిశ్చిత పరిస్థితి నెలకొంది. ప్రజల కోసం తుపాకులు పట్టినట్లు చెప్పుకొనే నక్సల్స్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం ప్రతి ఒక్కరు ప్రత్యేక్షంగా విమర్శించారు. అప్పటి రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సైతం హుటాహుటిన మర్తురీలో ఉన్న మృత దేహాన్ని చూసేందుకు తరలివచ్చారు. నక్సల్స్ కు వెతిరేఖంగా నినాదాలు చేస్తూ, కన్నీటి పర్యంతమై అయన అంత్య క్రియల్లో పాల్గొన్నారు. అయన మరణించిన ఇప్పటికి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు. అజాత శత్రువుగా పేరొందిన శ్రీపాదరావును బుచ్చి పంతులు అని పిలిచేవారు. ఆయన మరణానంతరం వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంథని నుండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం ఆయన ఐటి, పరిశ్రమల శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్లో కీలక భూమిక పోషిస్తున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం శ్రీపాదరావు జయంతిని అధికారికంగా చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేయడంతో అరుదైన గుర్తింపునిచ్చినట్టయింది.

# పాపం.. పోసాని

# నోరు ఎత్తని సినీ ప్రముఖులు



విజయవాడ, హైదరాబాద్, మార్చి 1, దక్షిణాదిన రాజకీయాలు సినిమాలు ఒకటిగా కలిసిపోయి చాలా దశాబ్దాలే దాటింది. సినిమాల నుండి వచ్చిన ఎంజీఆర్ ఎన్టీఆర్ జయలలిత పవన్ కళ్యాణ్ వంటి వారు ఉన్నత పదవులు అధిరోహించారు. ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రులైన వాళ్ళు అయితే చాలామందే ఉన్నారు. జనాల్లో సినిమా వాళ్ళకు ఉండే క్రేజ్ వాళ్ళ ఫ్యాన్ ఫాలోయింగ్ రాజకీయంగా తమకు ఉపయోగపడుతుందని పార్టీలు సినీ రంగంతో వీలైనంత దగ్గరగా ఉండే ప్రయత్నం చేస్తాయి. కాంగ్రెస్ బిజెపి లాంటి జాతీయ పార్టీల నుండి ప్రాంతీయ పార్టీల వరకు ఎవరు దీనికి అతీతులు కాదు. అయితే ఈ విషయంలో వైసిపి పూర్తిగా వెనకబడిందనే చెప్పాలి. వైసిపి మద్దతుదారుడుగా ఉన్న పోసాని కృష్ణ మురళి అరెస్టు అయితే కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా టాలీవుడ్ నుంచి స్పందించలేదు. నిన్న మొన్నటి వరకు అధికారం లో పార్టీకి ఇలాంటి దుస్థితి ఏర్పడడం వెనక స్వయంకృతాపరాధాలే ఉన్న ఎక్కువ ఉన్నాయనే చర్చ నడుస్తుంది. ముఖ్యంగా టాలీవుడ్ కోణం లో వైసిపి ఒంటరి అయిపోయిందన్న వాదన బలపడుతోంది స్వయంగా సినిమా నుండి వచ్చిన ఎన్టీఆర్ పెట్టిన పార్టీ కావడం టాలీవుడ్ తో ఆద్యంతం మంచి రిలేషన్ మెయింటైన్ చేయడం టిడిపికి స్వతహాగా కలిసివచ్చే బలాలు. సామాజిక వర్గం పరంగా టిడిపి అప్రోచ్ పరంగా టాలీవుడ్ లో టిడిపి కి సానుభూతిపరులు చాలామంది ఉన్నారు. ఎంత ఎలా అంటే 2019 ఎన్నికల తర్వాత పూర్తిగా కుదలైపోయింది టిడిపి అనే ప్రచారం జరుగుతున్న సమయంలోనూ కొంతమంది టాలీవుడ్ పెద్దలు స్టార్లు టిడిపి వెంటే ఉన్నారు. అశ్విని దత్ మురళీమోహన్ లాంటి బడా ప్రొడ్యూసర్లు స్వయంగా టిడిపి పార్టీ సభ్యులు. రాఘవేంద్రరావు, బోయపాటి లాంటి వాళ్ళు అయితే టిడిపి కోసం పని చేసిన చరిత్ర కలిగిన వాళ్లు. జగన్ ప్రభుత్వం చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు చాలామంది ఆయనకు మద్దతుగా మాట్లాడిన వాళ్లే ఉన్నారు. ఎన్టీఆర్ తనయుడు టాలీవుడ్ టాప్ స్టార్ లలో ఒకరైన నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం టిడిపి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు టాలీవుడ్ లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న మెగా ఫ్యామిలీ నుండి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. చిరంజీవి మొదలుకొని మొత్తం మెగా ఫ్యామిలీ లో హీరోలు అందరూ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కు నైతిక మద్దతు ఇస్తున్నారు. పవన్ పిలిస్తే జనసేన వైపు రావడానికి టాలీవుడ్ లో కొంతమంది రెడీగా ఉన్నట్టు ఇంటర్వ్యూలో చెబుతూ ఉంటారు. టాలీవుడ్ నిర్మాత పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు ప్రస్తుతం జనసేనలో చాలా యాక్టివ్ గా ఉన్నారు. అల్లు అర్జున్ తో ఫ్యామిలీకి విభేదాలు ఉన్నాయంటూ ప్రచారం జరుగుతున్న బహిరంగంగా రెండు కుటుంబాల హీరోలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న సంఘటనలు ఎప్పుడు ఎదురు కాలేదు. రాజీవ్ గాంధీ రిక్వెస్ట్ రాజకీయాల్లోకి వచ్చిన సూపర్ స్టార్ కృష్ణ అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్కు బలమైన సపోర్టుగా నిలిచారు. ఇప్పటికీ పాతకాలం ఆర్టిస్టుల్లో కాంగ్రెస్ సానుభూతిపరులు ఉన్నారు. వైయస్సార్ బతికున్నప్పుడు జయసుధ ప్రజారాజ్యం విలీనమైన తర్వాత చిరంజీవి కాంగ్రెస్ లోనే కొంతకాలం కొనసాగారు. బిజెపిలోనూ సినిమా స్టార్లు బాగానే ఉన్నారు. అయితే ఈ సంఖ్య నార్తులో ఎక్కువ. తెలుగు రాజకీయాల్లోనూ గతంలో కోట శ్రీనివాసరావు లాంటివాళ్లు బిజెపి తరపున ఎమ్మెల్యేలు కూడా అయ్యారు. ప్రస్తుత ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధ్రీశ్వరి సైతం సినీ కుటుంబం నుంచి వచ్చినవారే. డైరెక్ట్ గా బీజేపీలో చేరకపోయినా సైదాంతిక పరంగా ఆ పార్టీకి మద్దతు ఇచ్చే సినీ ప్రముఖులు సినీ రంగంలో బాగానే ఉన్నారు.మొదటినుంచి వైసిపి సినీ ప్రముఖులనాకట్టుకోవడంలో విఫలం అవుతూనే వచ్చింది. రాజశేఖర్ జీవిత లాంటి వాళ్ళు మొదట్లో వైసీపీలో చేరినా చాలా తొందరగానే బయటికి వచ్చేసారు. అక్కడి వ్యవహారాలు తమకు సూట్ కావని బహిరంగంగానే ప్రకటన ఇచ్చారు. 2019 ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన మంచు మోహన్ బాబు కూడా కొద్ది కాలానికి దూరం అయిపోయారు. ఇక సినిమా ఇండస్ట్రీ పై జగన్ ప్రభుత్వం అధికారం చెలాయించాలని చూసిందనే విమర్శలు టాలీవుడ్ నుంచి వినబడతాయి. చిరంజీవి, ప్రభాస్, మహేష్ బాబు లాంటి టాప్ స్టార్లను తన ఇంటి ముందు నడిపించి అవమానించారని ఒక వర్గం ఆరోపిస్తూ ఉంటుంది. సినీ నటుడు పృథ్వి కి ఎస్వీబీసీ చైర్మన్గా పదవి ఇచ్చినా ఆయన ఆరోపణలు ఎదుర్కొని బయటకు వచ్చేసారు. తనపై వైసీపీలో కుట్ర జరిగిందనేది ఆయన వెర్షన్. ప్రస్తుతం జనసేనలో ఆయన కొనసాగుతున్నారు. ఎన్నికల ముందు వైసీపీలో చేరిన ఆలీ 2024 ఫలితాలు తర్వాత జగన్ కి బై బై చెప్పేశారు. పార్టీలో చేరకపోయినా మద్దతు దారుడు గా కొనసాగిన పోసాని కూడా ప్రత్యక్ష రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్టు ఎన్నికల తర్వాత ప్రకటించారు. అప్పట్లో పవన్ కళ్యాణ్ చంద్రబాబు లోకేషన్ లపై తీవ్రమైన పదజాలంతో ఆయన చేసిన ఆరోపణలు ఇప్పుడు ఆయన అరెస్టు అయ్యేలా చేశాయి. కానీ విచిత్రంగా టాలీవుడ్ నుంచి ఆయనకు మద్దతుగా ఒక్కరంటే ఒక్కరు కూడా బయటకు వచ్చి మాట్లాడింది లేదు. పోసాని మాట ఎలా ఉన్నా అసలు వైసీపీ పార్టీనే టాలీవుడ్ నుంచి మద్దతు కోల్పోయిందనేది విశ్లేషకులు చెబుతున్న మాట. జగన్ ఫోటో తోటే ఎన్నికల్లో గెలుస్తాం తప్ప వేరే ఎట్రాక్షన్ స్టార్ పవర్ అవసరం లేదంటూ గతంలో వైసీపీ కీలక నేతలు చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీని టాలీవుడ్కు దూరం చేశాయని సినీ రంగ ప్రముఖులు చెబుతూ ఉంటారు. ప్రస్తుతం యాంకర్ శ్యామల లాంటి ఒకరిద్దరు మాత్రం వైసీపీతో ఉన్నా ముందు వరుసలో ఉండే స్టార్లెవరూ వైసిపి లో లేరు. నందమూరి, మెగా ఫ్యామిలీ లకు సొంత పార్టీలు ఉన్నాయనుకున్నా ప్రభాస్ మహేష్ బాబు లాంటి టాప్ స్టార్లైతే రాజకీయాల వాసనే దగ్గరకు రానివ్వరు. స్టార్ల విషయం పక్కన పెట్టి ఇతర ప్రముఖులు వైసిపి వైపు రావడానికి అక్కడి ఉన్న పరిస్థితులు అడ్డుపడుతున్నాయి అన్నది అంతర్గత సమాచారం. సినిమా వాళ్ళతో కలిసి ముందుకు వెళ్లడానికి అనువుగా ఉండాల్సిన సమన్వయం వైసీపీలో లేదనేది ఎక్కువగా వినబడుతున్న మాట. మరి వైసీపీ పెద్దలు ఈ విషయాన్ని పట్టించుకుంటారు లేదో చూడాలి.

# అంతులేని ఆన్ లైన్ మోసాలు

ఆన్లైన్ మోసాలు భయానకంగా పెరిగాయి. వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్ వంటివాటిని స్కామర్లు దుర్వినియోగం చేస్తూ, నకిలీ ఖాతాలు, హానికరమైన లింకులు, ఏఐ ఆధారిత సాంకేతికతలతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఫలితంగా భారీ ఆర్థిక నష్టాలు నమోదవుతున్నాయి. 2024 తొలి భాగంలోనే భారత్లో రూ. 11,000 కోట్లకు పైగా నష్టం సంభవించినట్టు అంచనా.రోజు కు 6,000 ఫిర్యాదులు 'నేషనల్ సైబర్ క్రైమ్' పోర్టల్లో నమోదవుతుండగా, అంతర్జాతీయంగా ఈ న ష్టం రూ. 85.49 లక్షల కోట్లకు చేరుకుంది. ఏఐ ఆధారిత మోసాల పెరుగుదలతో డీప్ఫేక్ టెక్నాలజీ, ఆటోమేటెడ్ ఫిషింగ్ పద్ధతులు వాళ్ల దుర్మార్గాలను మరింత ప్రమాదకరంగా మార్చాయి. సోషల్ మీడి యా వేదికలు స్కామర్లకు ప్రధాన కేంద్రాలుగా మా రాయి.పెట్టుబడి మోసాలు, ఉద్యోగ మోసాలు, డిజిటల్ లోన్ యాప్ మోసాలు వంటివి బలహీన వర్గా లను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. గూగుల్ యాడ్స్, ఫేస్బుక్ మార్కెట్ ప్లేస్ వంటి వేదికలు సైబ ర్ నేరగాళ్లకు అవకాశంగా మారాయి. దీనిని ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం గూగుల్, మెటా వం టి టెక్ దిగ్గజాలతో కలిసి కఠిన చర్యలు చేపడుతున్న ది.'నేషనల్ సైబర్ క్రైమ్' థ్రెట్ అనలిటికల్ యూని ట్ వారు బ్యాంకులు, పోలీసులతో కలిసి ఆర్థిక మోసాలను అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు. సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్స్ రిపోర్టింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా 5.75 లక్షలమంది బాధితులకు రూ. 16 బిలియన్ల మేర నష్టపరిహారం అందినట్టు సమాచారం.సైబర్ మోసాల బారినపడకుండా ఉండేం దుకు అనుమానాస్పద లావాదేవీలను ధృవీకరించడం, నకిలీ సందేశాలను క్రాస్చెక్ చేయడం, సోష ల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పంచుకోకూడదనే జా గ్రత్తలు తీసుకోవడం ప్రజలకు అవసరం. మోసానికి గురైతే వెంటనే బ్యాంకులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రభుత్వ నియంత్రణ, టెక్ సంస్థల చర్యలు, ప్రజల అప్రమత్తత కీలకం అని అందరం గుర్తించాలి.ఇటువంటి మోసాలను వాట్సాప్ నంబర్ ట్రేస్ చేయడం ద్వారా కనిపెట్టవచ్చని పేరు వెల్లడి చేయడానికి ఇష్టపడని ఒక పోలీసు అధికారి వివరించారు. ఆయన గతంలో సీఐడీ సైబర్ క్రైమ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా పని చేశారు.ఇలాంటి కేసుల్లో సంబంధిత సర్వీస్ ప్రొవైడర్కు ఒక నోటీసు ఇచ్చి వివరాలను సేకరించవచ్చని చెప్పారు. అయితే, బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రూ.50,000 ఉంటే దానిని కనిపెట్టేందుకు పోలీసులకయ్యే ఖర్చు సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని చెప్పారు.తోడు, నేరాలు చోటు చేసుకుంటున్న స్థాయిలో సిబ్బంది ఉండరు. దాంతో, తక్కువ మొత్తం ఉన్న కేసుల పై దృష్టి సారించి విచారణ చేసేందుకు జాప్యం జరగడం లేదా అలసత్వం చోటు చేసుకోవడమో జరుగుతుంది" అని వివరించారు.ఈ వెబ్ సైట్లు నిర్వహిస్తున్న వారు ప్రధానంగా నేరం చోటు చేసుకున్న ఊర్లోనో, రాష్ట్రంలోనో ఉండరు. పక్క రాష్ట్రాలు, లేదా కొన్నిసార్లు విదేశాల నుంచి కూడా తమ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉంటారు. వారిని ట్రేస్ చేసిన తర్వాత చివరకు వారు ఎవరో నియమించిన సిబ్బంది అని తేలుతుంది. అసలు నేరస్తులను కనిపెట్టి పట్టుకోవడానికి చాలా సమయం పడుతుంది" అని చెప్పారు.సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని సూచించారు. ఆన్లైన్లో అపరిచితులు డబ్బు అడిగినప్పుడు ట్రాన్స్ఫర్ చేయకుండా ఉంటే మోసానికి గురికాకుండా ఉండవచ్చని చెప్పారు.ఇటీవల హైదరాబాద్లో "మీ కంపెనీ నుంచి డబ్బును దొంగిలించింది నేనే, నాకు సహకరించిన వారిని విడుదల చేస్తే మీ డబ్బును వాపసు చేస్తా" అంటూ హైదరాబాద్ కు చెందిన ఒక సంస్థకు ఒక సైబర్ నేరస్తుడు మెయిల్ పంపారు. భువనేశ్వర్ కేంద్రంగా ఈ నేరం జరిగినట్లు పోలీసులు తెలిపినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.ఇలాంటి రక రకాల పర్సనల్, బిజినెస్, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వ్యాపార అవకాశాలు కల్పిస్తామని చెబుతూ జరిగే ఫ్రాడ్లు వార్తల్లో కనిపిస్తూనే ఉంది.కోవిడ్ లాక్డౌన్ తర్వాత టెక్నాలజీ వాడకం పెరిగింది. నిత్యావసర వస్తువుల నుంచి ఇళ్ల కొనుగోలు వరకూ అన్నీ ఆన్ లైన్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయి. మొబైల్ యాప్స్ వాడకం పెరిగింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అందించిన డేటా ప్రకారం భారతదేశంలో 2020లో 50,035 సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఇది 2019 కంటే, 12 శాతం ఎక్కువ.టెక్నాలజీ వాడకంతో పాటు మోసాల సంఖ్య కూడా పెరిగిందని ఆంధ్ర యూనివర్సిటీలో డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వి. వల్లీ కుమారి చెప్పారు.సోషల్ మీడియా వేదికలైన ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ ద్వారా మెసేజీలు లేదా లింక్ పంపించి ఆ లింక్ క్లిక్ చేయమని అడుగుతారు. లింక్ పై క్లిక్ చేసిన తర్వాత రిజిస్టర్ చేయమని అడుగుతుంది. కొన్నిసార్లు లింక్ క్లిక్ చేసిన తర్వాత ఓటీపీ ఎంటర్ చేయమని అడిగి దాని ద్వారా అకౌంట్లో డబ్బులను దొంగిలిస్తారని చెప్పారు.మొబైల్ ఎస్ఎంఎస్ల ద్వారా అపరిచితుల నుంచి వచ్చే లింక్లను క్లిక్ చేయకూడదని ప్రొఫెసర్ వల్లీ కుమారి సూచించారు. సాధారణంగా ప్రముఖుల అకౌంట్లను టార్గెట్ చేసి ఇలాంటి పనులకు పాల్పడుతూ ఉంటారని ఆమె చెప్పారు.ఒకామెకు ఒక సంస్థలో ప్రాజెక్ట్ లీడ్గా ఉద్యోగం వచ్చిందని చెబుతూ, అందు కోసం నౌకరీ.కామ్ వెబ్ సైటు ద్వారా రిజిస్టర్ చేసుకుని వివరాలను పొందుపరచాలని కోరారు. అయితే, ఈ వెబ్సైటులో లాగ్ ఇన్ అయినప్పుడు హెచ్టీటీపీఎస్ తో ఉండటంతో ఆ వెబ్ సైట్ నమ్మశక్యమైందేనని ఆమె అనుకున్నారు. కానీ, అందులోంచి వేరే లింక్ క్లిక్ చేసినప్పుడు వెళ్లిన వెబ్ సైటు హెచ్టీటీపీఎస్ లేకపోవడంతో, అక్కడ ఆమెను ఓటీపీ అడగడం, ఎంటర్ చేయడంతో అకౌంట్లో డబ్బులన్నీ పోగొట్టుకున్నారు.ఇలాంటి వెబ్ సైట్లు చూసినప్పుడు లో వెబ్సైట్ పేరు, యూఆరెల్ బాక్స్లో లాక్ సింబల్ తో పాటు హెచ్టీటీపీఎస్ అని ఉంటే ఆ వెబ్సైట్ వెరిఫై అయిందని అర్థం" అని ప్రొఫెసర్ వల్లీ కుమార్ వివరించారు.ఈ మెయిల్ ద్వారా, వాయిస్ కాల్స్ ద్వారా రక రకాల మోసాలు చోటు చేసుకుంటాయి. ఈ తరహాలో తెలిసిన వారి పేరుతో ఉన్నట్లుగానే డబ్బులు కావాలని అభ్యర్థిస్తూ మెయిల్ పంపిస్తారు. అందులో అర్జెంట్ గా డబ్బు అవసరముంది అని చెబుతూ అకౌంట్ కు డబ్బులు బదిలీ చేయమని అడుగుతారు. నేరుగా అడిగేందుకు మొహమాట పడి ఈ-మెయిల్ పంపారేమో అనుకుని చాలా మంది డబ్బు ట్రాన్స్ఫర్ చేస్తూ ఉంటారు. ఇందులో వారి పరిచితుల పేర్లతోనే ఈ మెయిల్ పంపిస్తూ ఉంటారు.ఆ ఈ మెయిల్ ను జాగ్రత్తగా గమనిస్తే ఒక అక్షరం, లేదా ఒక సింబల్ తేడా ఉంటుంది.ఈ-మెయిల్ ద్వారా డబ్బు పంపమని ఎవరు అడిగినా సదరు వ్యక్తులను అడిగి తెలుసుకోవడం ముఖ్యమని వల్లీ కుమారి సూచించారు.

వాయిస్ కాల్ ద్వారా పెన్షన్ ప్లాన్, ఇన్సూరెన్సు, లాటరీలు, లేదా రిసార్ట్ లో ఫ్రీ స్టే వచ్చిందని చెబుతూ పరిచయం లేని వారు కాల్ చేస్తారు. మీకొక ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ పంపించండి అని అడుగుతారు. నిజంగానే డబ్బులు వచ్చాయేమో అనుకుని ఆ ఓటీపీ పంపగానే వాళ్ళ అకౌంట్లలో డబ్బును తీసేస్తారు. ఆ వెంటనే మొబైల్ సిమ్ ను కూడా మార్చేస్తారని వల్లీ చెప్పారు.ఏ పరిష్కారమూ ఫూల్ ప్రూఫ్ అని చెప్పలేమని అంటూ, మాల్ వేర్స్ నుంచి తప్పించుకోవడానికి మొబైల్స్, ల్యాప్టాప్స్లో యాంటీ వైరస్ సాఫ్ట్వేర్ ఉండటం మంచిదని వల్లీ కుమారి చెప్పారు.ఆన్లైన్ మోసాల నుంచి తప్పించుకోవాలంటే ఓటీపీలు షేర్ చేయకుండా ఉండటం, అపరిచితులు పంపిన క్యూఆర్ కోడ్లు స్కాన్ చేయకుండా ఉండటం, యుపీఐ షేర్ చేయకుండా ఉండటం లాంటివి చేయాలని పోలీస్ అధికారి సూచించారు.అత్యాశ కూడా మోసాలకు దారి తీస్తుందని, అకస్మాత్తుగా వచ్చే డబ్బు కోసం ఆశ పడకుండా ఉండటం ముఖ్యమని అన్నారు.

# ఎమ్మెల్సీ సీటు కోసం... పోటా పోటీ...

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** మార్చి 1, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వచ్చేసింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు ఇప్పుడు ఖాళీ అవుతున్నాయి. అయినా ఇప్పుడున్న సంఖ్య ప్రకారం బిఆర్ఎస్ పార్టీకి వచ్చేది ఒక ఎమ్మెల్సీ స్థానం మాత్రమే. ప్రతిపక్ష పార్టీకి పదవులు రావడం చాలా రేర్. అలాంటప్పుడు వచ్చిన అవకాశాల్ని పట్టుకోవాలని పార్టీలో ప్రతి నేత ఆలోచిస్తారు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలోనూ అదే జరుగుతోంది. 38 మంది గెలిచినా.. పదిమంది కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో 28 మంది ఎమ్మెల్యేలు ప్రస్తుతం పార్టీలో ఉన్నారు. ఈ లెక్క ప్రకారం ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ గెలుచుకునే అవకాశం స్పష్టంగా ఉంది. ఖాళీ అవుతున్న నలుగురు మాజీ డిప్యూటీ సీఎం మహమ్మద్ అలీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కేసీఆర్ అనుచరుడు సుభాష్ రెడ్డి, కాంగ్రెస్లోకి వెళ్లిన ఎగే మల్లేశం. సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ ఇద్దరు తమకు మరోసారి అవకాశం ఇస్తారని గట్టిగా నమ్ముతున్నారు.ఇక పార్టీలో గతంలో ఎమ్మెల్సీ స్థానం ఇచ్చిన గవర్నర్ దగ్గర పెండింగ్లో ఉండి ప్రభుత్వ మారాక ఎమ్మెల్సీ రాని దాసోజు శ్రవణ్ కూడా ఈ అవకాశాన్ని ఆశిస్తున్నారు. ఎన్నికల తర్వాత పార్టీలో చేరి ఇప్పుడు పార్టీలో కీలకంగా ఉన్న మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా పోటీలో ఉన్నారు.ఇక దీంతో పాటు మాజీ మంత్రులు, మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన ఎమ్మెల్సీలు ఇదే సీటు కోసం ఆశలు పెట్టుకున్నారు. మరో ఆసక్తికర విషయమేంటంటే మొన్న తెలంగాణ భవన్లో జరిగిన సమావేశంలో కేసీఆర్ పిలిచి మరీ సీనియర్ జర్నలిస్టు తంకశాల అశోక్ను పక్కన కూర్చోబెట్టుకున్నారు. దీంతో పార్టీలో ఆయన పేరు కూడా వినిపిస్తుంది. అయితే వీటన్నిటికంటే కొద్దిరోజుల క్రితమే సత్యవతి రాథోడ్కు కౌన్సిల్లో పార్టీ విప్ పదవిని కట్టబెట్టారు కేసీఆర్. దీంతో మరోసారి సత్యవతి రాథోడ్కు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తారని గట్టిగా టాక్ వినిపిస్తుంది. ఎమ్మెల్సీ పదవి ముగుస్తుండటంగా ఇప్పుడు విప్ పదవి ఇవ్వడం అందుకు సంకేతంగా అనుకుంటున్నారు. మొత్తంగా ఒక్క ఎమ్మెల్సీ పదవి కోసం టిఆర్ఎస్ పార్టీలో 30 మంది దాకా పోటీ పడడం

# నడ్డా వారసుడి కోసం రంగం సిద్ధం...

న్యూఢిల్లీ, మార్చి 1,వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం సాధించి, దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీకి నెక్స్ట్ బాస్ ఎవరనే ప్రశ్న ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. జేపీ నడ్డా తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎవరు వస్తారని ఆ పార్టీతో పాటు దేశ రాజకీయ వర్గాలన్ని ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 15 లోపు బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. బీజేపీ అధ్యక్షుడి ఎన్నికకు, 50 శాతం రాష్ట్రాలలో సంస్థాగత ఎన్నికలు తప్పనిసరి. దానికి ముందు, బూత్, మండల్, జిల్లా స్థాయిలకు ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం 36 రాష్ట్రాలలో 12 రాష్ట్రాలలో మాత్రమే ఎన్నికలు పూర్తయ్యాయి. కాబట్టి కనీసం ఆరు రాష్ట్రాలలో యూనిట్ చీఫ్ల ఎన్నికలు అవసరం.వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాంచ, గుజరాత్ రాష్ట్రాలలో బీజేపీ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి ఎన్నికలు జరగనున్న బీహార్లో ఎటువంటి మార్పు ఉండదు. అత్యున్నత పదవికి ప్రతిపాదిత పేర్లను సమర్పించాలని రాష్ట్ర ఇన్చార్జ్లను ఇప్పటికే పార్టీ అధిష్టానం కోరింది. ప్రస్తుతానికైతే ఏ ఒక్కరి పేరు కూడా బీజేపీ జాతీయ అధ్యక్షుడి రేసులో వినిపించడం లేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమించబడాలంటే.. కచ్చితంగా ఆ వ్యక్తికి ఆర్ఎస్ఎస్ ఆమోదం ఉండాల్సిందే. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం గురించి తెలిసి, ఆ సిద్ధాంతాన్ని నమ్మి, పాటించే వ్యక్తికే బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి దక్కనుంది.2019లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా జేపీ నడ్డా పార్టీ బాధ్యతలను స్వీకరించారు. జనవరి 2020లో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన కంటే ముందు ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన నుంచి నడ్డా ఆ బాధ్యతలు స్వీకరించారు. లోక్సభ ఎన్నికల దృష్ట్యా నడ్డా పదవీకాలాన్ని జూన్ 2024 వరకు పొడిగించారు. ఆ తర్వాత ఆయన ప్రభుత్వంలోకి ప్రవేశించడంతో, పార్టీ ఆయన తర్వాత ఎన్నికయ్యే అభ్యర్థుల కోసం చూస్తోంది. కానీ ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. పార్టీలోని అగ్రనేతలు ఈ అంశంపై ఏకాభిప్రాయం సాధించాలని ఆశిస్తున్నారు. మరి చూడాలి ఎంతో పవర్ ఫుల్ పొజిషన్గా భావిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎవరు వస్తారో. బీజేపీ జాతీయ అధ్యక్ష రేసులో పలువురి పేర్లు ఉన్నాయి. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, పార్టీ జనరల్ సెకెటరీ సునీల్ బన్సల్, అగ్రనేతలు ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్, వినోద్ తావ్డే వంటి ప్రముఖులు ఉన్నారు. అయితే, అధికారిక ప్రకటన వచ్చే వరకు ఎవరనేది నిర్ధారణ కాదు.

# రానున్న రోజుల్లో ఎండలు మండిపోతాయి

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 1** ఈ ఏడాది ఫిబ్రవరిలోనే భానుడు తన ప్రతాపం చూపించడం ప్రారంభించాడు. అయితే రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఎండలు మండిపోతాయి అంటూ.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయని, ఇక ఏప్రిల్, మేలలో 44 నుంచి 46 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని అంచనా వేసింది.1901 నుంచి 2025 వరకు సరాసరి సగటు తీసుకుంటే.. ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దక్షిణ, మధ్య తెలంగాణలతో పాటు.. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో భానుడి భగభగలు తీవ్రంగా నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి. దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

# పురాతన సనాతన ధర్మమే లోకానికి రక్ష

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హిందూ ధర్మ రక్షణ మనందరి కర్తవ్యం. పురాతన సనాతన ధర్మమే లోకానికి రక్ష' అని ద్వారక శారద పీఠాధిపతి శ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య స్వామి సదానంద్ సరస్వత్ జీ అన్నారు. స్వామీజీ హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 49లోని 'విజయక్రాంతి', 'మెట్రో ఇండియా' దినపత్రికల చైర్మన్, ఎండీ చిలప్పగారి లక్ష్మీరాజం, విజయ దంపతుల నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా చిలప్పగారి లక్ష్మీరాజం, విజయ దంపతులు, డైరెక్టర్ సౌమ్య, కుటుంబ సభ్యులు స్వామీజీకీ పాదుకా పూజ నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ప్రయాగ్రాజ్ కుంభమేళా గంగానది కోట్లాది మందిని ఒక చోట చేర్చిందన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. సనాతన ధర్మం శాశ్వతమైందని, వేదాలే అందుకు నిదర్శనమని కొనియాడారు. వేదాలు చదివి హిందూ ధర్మాన్ని తెలుసుకోవచ్చన్నారు. సనాతన ధర్మ వైదిక ధర్మమని, అనుసరణీయమన్నారు. మన సంస్కృతిలో అనాదిగా గురు సంప్రదాయం ఉందన్నారు. నేటికాలంలో కొందరు దుష్టులు హిందూ మతాన్ని నాశనం చేసేందుకు చూస్తున్నారన్నారు. వారి నుంచి సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. హిందూ ధర్మాన్ని రక్షించేందుకే ఆదిశంకరాచార్యులు అవతరించారని గుర్తుచేశారు.

# కృష్ణమ్మ చుట్టూ అన్నీ రాజకీయ రభసలే..!

**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 1,** కృష్ణా నదిలో నీళ్లు తక్కువ, దానిమీద కట్టిన ప్రాజెక్టులు ఎక్కువ. గోదావరి నదిలో నీళ్లు ఎక్కువ.. ప్రాజెక్టులు తక్కువ. అందుకే జల వివాదాలూ తక్కువే. గోదావరి విషయంలో తెలంగాణకు ఆంధ్రప్రదేశ్‌తో పెద్దగా నీళ్ల పంచాయతీ లేనే లేదు. కానీ.. కృష్ణానదితోనే వచ్చింది గొడవంతా. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కల్పించుకున్నా.. కృష్ణవేణి చెంత రాజకీయ మంటలు మాత్రం చల్లారలేదు. నీటి జాడ లేక బావులన్నీ ఎండమావులౌతుంటే బతుకులన్నీ ఎండిపోతుంటే.. వేసవి సీజన్ ముంచుకొచ్చి నడినెత్తిన కూర్చుంటానంటుంటే.. సాగు-తాగు నీళ్ల అవసరాలు గుర్తుకొచ్చి నదీజలాల వాటాలపై సీరియస్‌గా దృష్టి పెట్టాయి రెండు తెలుగు ప్రభుత్వాలు.రెండురాష్ట్రాల మీదుగా సాగుతున్న కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్ల వాటాలు తేలక.. తెలుగురాష్ట్రాల మధ్య నిప్పులు కురుస్తూనే ఉన్నాయి. వివాదాల పరిష్కారం కోసం కెఆర్ఎంబీ, జీఆర్ఎంబీ పేర్లతో మేనేజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేసినా.. అవన్నీ ఉన్నా లేనట్టు.. ఉత్సవ విగ్రహాలుగానే మిగిలిపోతున్నాయి. ఎవరి రాష్ట్ర ప్రయోజనాలను వాళ్లు ఏకరూవు పెట్టుకుంటూ.. వాళ్ల వాళ్ల రాష్ట్రాల్లో ఓటు బ్యాంకులు సడలిపోకుండా అతి జాగ్రత్తపడుతూ.. చివరాఖరికి సమస్యను సమస్యగానే ఉంచేశారు. తెలంగాణ గడ్డ మీద నీటి కటకట తీవ్రస్థాయిలో ఉంది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్నారు. సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా అనేక జిల్లాల్లో తాగునీటి అవసరాలు తీరనేలేదు. దీంతో సహజంగానే కృష్ణా నదీజలాల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పుడే కాదు.. ఖరీఫ్, రబీ సీజన్లు మొదలయ్యే వేసవికాలం వస్తుందంటే చాలు ఏటా ఇవే టెన్షన్లు. కెఆర్ఎంబీ దగ్గర పంచాయతీలతో రెండు రాష్ట్రాల మధ్య అగాధం పెరుగుతూనే ఉంది.. ఎందుకు? ఒక్కో 'వాటర్ ఇయర్'లో 66:34 నిష్పత్తితో 512-299 టీఎంసీల చొప్పున క్రిష్ణనీళ్లను ఏపీ-తెలంగాణ రాష్ట్రాలు పంచుకోవాలి. ఇదీ విభజన తర్వాత జనాభా ప్రాతిపదికన 2015లో కుదిరిన ఒప్పందం. కాకపోతే.. ఈ డీల్ మాకు ఓకే కాదంటూ తెలంగాణ రాష్ట్రం పేచీ పెడుతూ రావడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అప్పట్లో ఒక్క సంవత్సరం కోసం రాసుకున్న తాత్కాలిక డీల్ అది.. నిజానికి 71:29 దామాషాలో నీటి వాటాలు కేటాయించాలని వాదిస్తోంది తెలంగాణ. కనీసం ఫిఫ్టీ-ఫిఫ్టీ నిష్పత్తిలో క్రిష్ణమ్మ నీళ్లను పంచాల్సిందే అని మొండికేస్తోంది తెలంగాణ.ఇటీవల నెలరోజుల గ్యాప్‌లో నాలుగుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసి సంప్రదింపులు జరిపినా.. పంపకాల సమస్య కొలిక్కిరాలేదు. పైగా.. కొత్త సమస్యలు ఎదురవ్వడంతో మీరూ మీరూ కూర్చుని మాట్లాడుకోండి.. న్యాయబద్ధంగా వాటాలు పంచుకోండి అంటూ చేతులెత్తేసింది. నీటివాటాలే కాదు.. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల భద్రత.. ఏపీలో ఏర్పాటు కాబోయే కార్యాలయం.. ఇలా వేటికవే ఎడతెగని సమస్యలు. అఖిలపక్షం వేసుకుందాం.. ఢిల్లీకి బండి కట్టుకుందాం.. కేఆర్ఎంబీతో కొట్లాడదాం.. అవసరమైతే మోదీ ఇంటి దగ్గరే సిట్టింగేద్దాం.. అని అపోజిషన్ పార్టీ ఎక్కితొక్కేస్తుంటే ఉక్కిరిబిక్కిరవుతోంది రేవంత్ సర్కార్. అటు.. ఏపీ చాటుమాటుగా లెక్కకు మించి నీళ్లను వాడుకుంటోందనేది తెలంగాణ మోపుతున్న మరో అభియోగం. చంద్రబాబు ప్రభుత్వం నీళ్లను తరలించుకుపోతుంటే రేవంత్‌రెడ్డి ఫిడేల్ వాయిస్తున్నారంటూ సెటైర్ల తాకిడిని పెంచింది గులాబీ దండు.కృష్ణానదిలో నీళ్ల వాడకం లెక్క పక్కాగా తేలాలంటే టెలిమెట్రీ పరికరాలు అమర్చాలన్న డిమాండ్లు కూడా వినిపించాయి. అయినా.. తమ వాదనలను కేఆర్ఎంబీ పెడచెవిన పెడుతోందని.. ఏపీకి వత్తాసు పలుకుతోందని, పైనుంచి కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని తెలంగాణ సర్కార్ ఆరోపిస్తోంది. ఈ విధంగా బీజేపీ కూడా కార్నర్ అవుతోంది. కానీ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి నాటకాలాడుతున్నాయని, క్రిష్ణమ్మ నీళ్లను అప్పనంగా ఏపీకి సమర్పించారని రివర్స్‌లో కొడుతోంది కమలం పార్టీ. మీ రాజకీయాల్లోకి మమ్మల్ని లాగొద్దు మేస్తారూ.. అంటూ వ్యూహాత్మక మౌనం పాటిస్తోంది ఏపీ సర్కార్.రెండు రాష్ట్రాల మధ్య ఇలా నీళ్ల లొల్లి పీక్స్‌కి చేరుకున్నా.. కృష్ణా రివర్ బోర్డు పెద్దలు దిక్కులు చూస్తున్నారు. ప్రతి 15 రోజులకొకసారి సమావేశమై నీటి వినియోగాన్ని సమీక్షించుకుందామంటూ.. వీళ్లను దేవుడే కాపాడాలి.. అని సణుక్కుంటూ.. ఇప్పటికింతే అని సమావేశాన్ని వాయిదా వేసి చక్కా వెళ్లిపోయారు ఛైర్మన్‌సారు. వీళ్లిద్దరి నీళ్ల కొట్లాటతో ఆయన తలబొప్పి కట్టడం ఇది పద్నాలుగోసారనుకుంటా..!విభజన చట్టం ప్రకారం.. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ నేతృత్వంలో.. ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసి.. దానికి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అని పేరు పెట్టి.. మార్గదర్శకాలు రాసిచ్చి కూర్చుని మాట్లాడుకోండయ్యా అంటే.. ఇక్కడ ఎవరికి వారే యమునా తీరే. దీంతో.. ఏ ఏటికాయేడు కృష్ణానదీ జలాల పంపకం సంక్లిష్టంగానే మారుతూనే ఉంది. దశాబ్దం గడిచినా.. ముఖ్యమంత్రులు మారినా చిక్కుముళ్లు వీడింది లేదు.తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయిందే నీళ్ల నిధులు నియామకాల కాన్సెప్ట్ మీద. ఇందులో మొదటిది నీళ్లు. విభజన జరిగితే నీటి యుద్ధాలు ఖాయమని, మనతో మనమే కొట్లాడుకుంటామని అప్పట్లో అసెంబ్లీ వేదికగా సీఎం హోదాలో కిరణ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు.. ఏటా వేసవి సీజన్ రాగానే రెండు రాష్ట్ర ప్రభుత్వాల చెవుల్ని ఇప్పటికీ తూట్లు పొడుస్తున్నాయి.శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లపై పట్టు కోసం రెండు రాష్ట్రాలూ ఇప్పటికీ కయ్యమాడుతూనే ఉన్నాయి. 2023 డిసెంబర్ ఫస్ట్‌వీక్‌లో సాగర్ డ్యామ్‌పై హైపర్ టెన్షన్ సీన్లు మర్చిపోదామన్నా మర్చిపోలేం. అట్నుంచి వెయ్యిమంది, ఇట్నుంచి వెయ్యమంది పోలీసుల్నేసుకుని.. ఇరిగేషన్ అధికారులు బాహాబాహీ తలబడ్డ యాక్షన్ సీక్వెన్స్ అది. నీళ్ల వాటా విషయంలో కేసీఆర్, చంద్రబాబు, జగన్, ఇప్పుడు రేవంత్.. ఒక్కోసారి వైఎస్ఆర్‌ని కూడా సీన్లోకి తీసుకొచ్చి కృష్ణా జలాల వివాదాన్ని జఠిలం చేస్తూనే ఉన్నాయి పొలిటికల్ పార్టీలు. ఎన్నికలొచ్చిన ప్రతీసారీ ఇదొక ప్రచారాస్త్రంగా కూడా మారుతోంది. రాయలసీమ ఎత్తిపోతలకు తెలంగాణ ససేమిరా అంటే.. పాలమూరు, డిండి ప్రాజెక్టుల మీద ఏపీ సర్కార్ చెయ్యడ్డం పెట్టడంతో.. గతంలో కూడా కేఆర్ఎంబీ మీటింగులు హీటెక్కాయి. ఏటా వేసవిలో నీటివాటాలపై జగన్, కేసీఆర్ ప్రభుత్వాధినేతలుగా ఉన్నప్పుడూ రాజీ కుదిరింది లేదు,2021లో కూడా కృష్ణా జలాల పంపకాలపై రెండు రాష్ట్రాల మధ్య లేఖల యుద్ధం జరిగింది. కృష్ణా జలాలను చెరి సగం పంచాలని తెలంగాణ, రెండో ట్రిబ్యునల్ ఆదేశాల మేరకే పంపకాలు జరగాలని ఏపీ.. గట్టిగా వాదించాయి. ఉమ్మడి ప్రాజెక్టుల్లో కూడా నీటి వాటాలు ప్రాజెక్టుల వారీగా జరగలేదని కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లింది ఏపీ సర్కార్. శ్రీశైలం నుంచి చెన్నైకు, సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి కోసం మాత్రమే నీళ్లను తీసుకునేందుకు వెసులుబాటు ఉందని, మిగతాదంతా పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరింది ఏపీ. నాలుగేళ్లు గడిచినా.. తెలంగాణ కోరుతున్న ఫిఫ్టీ-ఫిఫ్టీ డిమాండ్ ముందుకు జరగడం లేదు.మహారాష్ట్రలో పుట్టి తూర్పు దిశగా పయనించి కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలిసే కృష్ణానది.. నాలుగు రాష్ట్రాల నీటి అవసరాలకు ఆసరానిస్తోంది. ఆ మేరకు వివాదాలకూ తావిచ్చింది. 70 ఏళ్లకిందట 2060 టీఎంసీలున్న కృష్ణా జలాల పంపకం దగ్గర నాలుగు రాష్ట్రాల మధ్య లడాయి ముదిరింది. పరిష్కారం కోసం రెండు సార్లు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. ట్రిబ్యునళ్లను దాటి సుప్రీంకోర్టు దాకా వెళ్లింది కృష్ణా జలాల వివాదం. అది గతం.2014లో ఆంధ్రప్రదేశ్ విడిపోయి.. కొత్తగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జల జగడం 2.0 మొదలైంది. మా రాష్ట్రం సంగతేంటి అని తెలంగాణ నిలదియ్యడంతో.. కొత్తగా గైడ్‌లైన్స్ రాసుకోవాల్సి వచ్చింది. ప్రాజెక్టుల వారీగా రెండు రాష్ట్రాలకూ నీటి కేటాయింపులు జరగాలని, నీటి విడుదలకూ ప్రొటోకాల్స్ సిద్ధం చేయాలని, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఛైర్మన్‌గా ఒక ఎపెక్స్ కమిటీని వేయాలని ప్రతిపాదించింది విభజన చట్టం.అప్పటి కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఛైర్మన్‌గా ఏర్పాటైన అపెక్స్ కమిటీ అపెక్స్ కమిటీ తొలి సమావేశం 2016లో జరిగింది. నాలుగేళ్ల తర్వాత రెండోసారి సమావేశమైంది. రెండురాష్ట్రాల నదీజలాల చాప్టర్‌లో అది కీలక పరిణామం.ఇలా కొన్ని బలమైన ప్రపోజల్స్ పెట్టారు ఏపీ సీఎం జగన్. వీటన్నిటికంటే ముఖ్యమైనది నీటి వాటాల పంపకం. 2015 జూన్‌లో జరిగిన ఒప్పందం ప్రకారమే నీటి పంపకాలు జరగాలి.. దీన్ని కృష్ణా బోర్డు అమలుచేయాలి.. అని గట్టిగా చెప్పారు జగన్. ఇటు.. తెలంగాణ వైఖరి కూడా అంతే కఠినంగా ఉంది. రాయలసీమ ఎత్తిపోతల, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుల్ని వెంటనే నిలిపెయ్యాలన్నది అప్పట్లో కేసీఆర్ పెట్టిన ప్రధాన డిమాండ్. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను తమకే అప్పగించాలన్నది మరో మెలిక. కృష్ణా బోర్డు ఏపీకి మద్దతుగా, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపించడం ద్వారా.. అప్పట్లోనే కయ్యానికి సై అన్నారు కేసీఆర్.కృష్ణా, గోదారి జలాల విషయంలో రెండు రాష్ట్రాలదీ చెరో దారి. ముఖ్యంగా నీటి పంపిణీ మీద కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీలకు పూర్తి అధికారం ఉంటుందని, బోర్డుల అనుమతి లేకుండా ఎవ్వరూ ఏమీ చెయ్యొద్దని కేంద్రప్రభుత్వం సూచించింది. ఇలా.. నీటి వాటాలపై నాలుగేళ్ల కిందట పడ్డ పీటముడి ఇప్పటికీ విడిపోలేదు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారి.. కొత్త ముఖ్యమంత్రులు వచ్చినా.. కృష్ణానదీ జలాల విషయంలో రాజీ కుదరలేదు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కోరిక మేరకు.. కేఆర్ఎంబీ ప్రత్యేకంగా సమావేశమైనా.. పరిష్కారం దిశగా అడుగులు పడలేదు.నీటివాటాలు తేలకుండా కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత జరిగిందని, ఒక్క సంవత్సరం కోసం చేసుకున్న ఒప్పందాన్ని పదేళ్ల తర్వాత కూడా కాంగ్రెస్ కొనసాగించిందని.. దీంతో సమస్య మరింత క్లిష్టమైందని వాదిస్తోంది బీఆర్ఎస్. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారం లేకపోతే కృష్ణానది నీటివాటాలు తేలడం అసాధ్యమని తేలిపోయింది. కానీ.. నీళ్లను పరిమితికి మించి వాడుకుంటోందని, కేంద్రప్రభుత్వాన్ని మేనేజ్ చేస్తూ కేఆర్ఎంబీని తమకు అనువుగా మలుచుకుంటోందని తెలంగాణ వైపు నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఏపీ వైఖరి ఎలా ఉండబోతోంది అనేది మెగా సస్పెన్స్. రెండురాష్ట్రాల మధ్య ఈ చిక్కుముడి వీడాలంటే ఇటువంటి సమ్మర్ సీజన్లు ఇంకా ఎన్ని పోవాలో మరి..!

## ట్రయాంగిల్ ఫైట్ లో గెలుపు మీదే

**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 1,** కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో గెలుపు ఎవరిది అనే చర్చ ప్రస్తుతం ఈ నాలుగు జిల్లాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఎక్కడ చూసినా, ఇద్దరూ అంతకన్నా ఎక్కువ మంది కలిసినా చోటా ఈ టాపిక్ రావడం లేదంటే ఆశ్చర్యమే. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రుల నమోదు ప్రారంభం నుండి ఇప్పటి వరకు అన్నీ వర్గాల్లో ఈ ఎన్నిక చాలా ముఖ్యమైన అంశం గా నిలిచింది. ఒకవైపు నమోదు చేసుకుంటూ మరోవైపు పార్టీ టికెట్ కోసం ప్రయత్నం చేసుకుంటూ ఒకరు ముందుకు సాగుతుంటే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు చేతులు కట్టుకొని, వచ్చిన తరువాత పార్టీ టికెట్ ప్రయత్నంలో కొంత మంది దృష్టి సారించటం వల్ల సమయానికి ప్రచారం చేయలేక వెనుకబడిపోయారు. ఈ విషయం లో నమోదు ప్రక్రియ, పరిచయ సభలు, ఆత్మీయ సమ్మేళనాలతో పధి అడుగులు ముందున్న ఆల్ఫోర్స్ నరేందర రెడ్డికి ప్రభుత్వంలో ఉన్న పార్టీ టికెట్ ఇవ్వడంతో ఆయన బలం పదింతలయ్యింది. ఆ పార్టీ టికెట్ ఆశించి, బంగపడ్డ మరో అభ్యర్థి కొత్తదారులు వెతుకుతూ, చివరికు బి.ఎస్.పి మద్దతుతో పోటీలో నిలిచాడు.మరోవైపు బి.జె.పి. ఎలాగైనా ఎంఎల్‌సి స్తానాన్ని కైవసం చేసుకోవాలనే ప్రయత్నంలో పోటీలో గట్టిగా నిలిచింధి. బీఆర్ఎస్. పార్టీ మాత్రమే పోటీలో అభ్యర్తులను పెట్టలేదు. ఆ పార్టీ టికెట్ కోసం ప్రయత్నం చేసిన వాళ్ళు పార్టీ టిక్కెట్ రాకపోవడమే వేరే పార్టీ నుంచీ పోటి చేయాల్సిన పరిస్తితి ఏర్పడింది. దీంతో టి.ఆర్.ఎస్. క్యాడర్ ఈ ఎన్నికల్లో ఎవరివైపు ప్రచారం చేయాలో తేల్చుకోలేక అగమ్య గోచారంలో పడ్డారు. కకావికలమైన పార్టీ క్యాడర్ అధిష్టానం నిర్ణయంపై అసంతృప్తికి లోనయ్యరు. ఒకవైపు ఎన్నికల యుద్ధం జరుగుతుండగా చేతులు కట్టుకొని ఇంట్లో కూర్చోవాల్సి వచ్చింది. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అన్నీ అనుకూలంగా మారాయి. బలమైనా అభ్యర్తిగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ అభ్యర్థిని ఈవిధంగా ఎదురుకోవాలో తెలియక సోషల్ మీడియాను వేదికగా చేసుకొని వ్యతిరేకతను కలుగచేసేందుకు చెసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు ఎవరికి వారే క్యాడర్‌లో ఉత్సాహం నింపుతూ ముందుకు సాగడం, వ్యుహాత్మకంగా ప్రత్యర్థుల ను ఎదుర్కోవడంలో వేసిన పాచిక లాతో పూర్థిగా విజయ సూచిక ఒకవైపు తూగింది. దీనికీ తోడు ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావదంతో పార్టీలో జోష్ పెంచింది. పోలింగ్ కు ముందు కూడా ఈవిధంగా వ్యవహారించాలనే విషయం లో పార్టీ క్యాదర్ కు సలహాలు ఇది కూడా చివరి వరకు అప్రమతంగా ఉండెల చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల్లో విజయం ఎవరిని వరిస్తుందనేది తేలిపోనున్నా.. అభ్యర్తులందరూ మాత్రమే గెలుపు మాదే అని గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు

## జగన్ పై కోర్టుకు విజయమ్మ...




హైదరాబాద్, మార్చి 1, వైఎస్ జగన్మోహన్ రెడ్డికిమరో షాక్ తగిలింది. రాజశేఖర్ రెడ్డి కుటుంబ ఆస్తుల వ్యవహారంలో మరో భారీ ట్విస్ట్. పల్నాడు జిల్లాలోని వివాదాస్పద సరస్వతీ పవర్ వాటాలకు సంబంధించి గతంలో వైయస్ జగన్ హైదరాబాదులోని జాతీయ కంపెనీల లా ట్రిబ్యునల్ లో దాఖలు చేసిన పిటిషన్ పై స్పందించిన తల్లి వైయస్ విజయమ్మ తాజాగా షాక్ ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఆయన భార్య భారతికి ఇది ఇబ్బందికరమే. ఈ వివాదంలో షర్మిలకు ఊరట దక్కే విధంగా విజయమ్మ కోర్టులో తన అభిప్రాయాన్ని చెప్పేశారు. షర్మిలకు ఇది ఉపశమనం కలిగించే విషయం.తాజాగా జగన్మోహన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై తన అభిప్రాయాన్ని చెప్పారు విజయమ్మ సరస్వతీ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ వాటాల కొనుగోలు, గిఫ్ట్ డిడ్ ద్వారా వచ్చిన వాటాలన్నీ గతంలో తన పేరు పైనే బదలాయించినట్లు విజయమ్మ కోర్టుకు తెలిపారు. అందుకే సరస్వతీ పవర్ వాటాలపై ఉన్న అన్ని హక్కులు తనకే ఉన్నాయని చెప్పుకొచ్చారు. 99.75% వాటాలు తన పేరుతోనే ఉన్నాయని.. జగన్ తో పాటు భారతీయులకు వాటాలు లేవని తేల్చి చెప్పేశారు. దీంతో ఇది జగన్మోహన్ రెడ్డికి షాప్ ఇచ్చే అంశమే. తన కుమార్తె షర్మిల తో ఉన్న రాజకీయ వివాదాల కారణంగానే అన్యాయంగా తల్లినైన తనను కోర్టులో నిలబెట్టారని విజయమ్మ వాపోయారు. వాటాల బదలాయింపు అక్రమం అంటూ పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే పిటిషన్లు కొట్టేసి.. తప్పుడు మార్గంలో ఆలోచించిన వారికి భారీ పెనాల్టీ విధించాలని కోర్టుకు విజయం కోరడం విశేషం.2021లో సరస్వతీ పవర్ లోని 46.71 లక్షల వాటాలను సండూర్ కంపెనీ, 71.50 లక్షల వాటాలను క్లాసిక్ రియాలిటీ కలిపి మొత్తం.. 1.21 కోట్ల వాటాలను తనకు విక్రయించిన విషయాన్ని గుర్తు చేశారు విజయమ్మ. అలాగే జగన్ 74.26 లక్షల వాటాలు, భారతి 40.50 లక్షల వాటాలు తనకు గిఫ్ట్ డిడ్ కింద బదిలీ చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. దీని ప్రకారం గ తేడాది 14న తనకు వాటాలు బదిలీ అయ్యాయని చెప్పారు. దీనిని సరస్వతి పవర్ బోర్డ్ కూడా ఆమోదించి తనను సభ్యురాలిని చేసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. కాబట్టి కంపెనీలో 99.75% వాటా ఉన్న తనను కుటుంబ కారణాలతో ప్రశ్నించడం కుదరదని కోర్టు ముందు తేల్చి చెప్పారు.కుమారుడు జగన్మోహన్ రెడ్డి విషయంలో విజయమ్మ రాజీ పడినట్లు వార్తలు వచ్చాయి. పిల్లలిద్దరి మధ్య సర్దుబాటు చేసే ప్రయత్నంలో ఉన్నట్లు కూడా ప్రచారం నడిచింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో విజయమ్మ తిరిగి యాక్టివ్ అవుతారని కూడా టాక్ నడిచింది. కానీ ఆమె కోర్టును సంప్రదించడంతో అటువంటిదంతా ప్రచారం అని తేలిపోయింది. కుమార్తె షర్మిల వైపే నని స్పష్టత వచ్చింది.

## జిల్లాల వారీగా నివేదికలు నామినేటెడ్ కసరత్తు...

**అదిలాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 1,** నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. మార్చి 10వ తేదీలోపు నియామకాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో ఈ ప్రకటన చేశారు. దీంతో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మళ్లీ పట్టాలెక్కనుంది.టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి?. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని స్పష్టం చేశారు. ఇది నిరంతర ప్రక్రియ.. ఒకరోజుతో ముగిసేది కాదన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారుపార్టీ జెండా మోసినవారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుంది. పార్టీ కోసం కష్టపడినవారికే నామినేటెడ్ పదవులు ఇచ్చాం. సుదీర్ఘకాలంగా పని చేసినవారికి కొంతమందికి అవకాశాలు రాలేదు. వారినికాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీపై ఉంది. రాబోయే రోజుల్లో వారికి తప్పకుండా ప్రాధాన్యత కల్పిస్తాం. వివిధ జిల్లాల్లో ఖాళీగా ఉన్న కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయాల్సి ఉంది. మార్చి 10 లోగా అన్ని జిల్లాల్లో నియామకాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంచార్జ్ మంత్రులకు ఆదేశాలు ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు.పదవులు వచ్చిన వారూ పార్టీ కోసం కష్టపడాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పనితీరు సరిగా లేని వారికి రిన్యూవల్ ఉండదని క్లారిటీ ఇచ్చారు. "ప్రభుత్వం చేసే మంచిని మైక్ లో చెప్పండి? చెడును చెవిలో చెప్పాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా.మన సక్సెస్ స్టోరీని మనమే చెప్పుకోవాలి. మన ప్రభుత్వం కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. పెద్ద పెద్ద విమర్శకులు కూడా మన ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు.. మన సక్సెస్ స్టోరీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని రేవంత్ రెడ్డి నేతలకు దిశానిర్దేశం చేశారు.రూ.4200 కోట్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కోసం ప్రభుత్వం ఖర్చు చేసింది. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్ అందిస్తున్నాం. రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచడంతోపాటు భూమిలేని పేదల కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తున్నాం.ఇది మన చిత్తశుద్ధికి నిదర్శనం ప్రభుత్వం చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు మనమంతా కసితో పనిచేయాలని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. "మోదీని గద్దె దించే వరకు మనం కష్టపడాలి. రాహుల్ గాంధీ పట్టుదలతోనే కులగణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేయగలిగాం. రాష్ట్రంలో అధికారంలో ఉంటేనే ఇన్ని చేయగలిగితే? దేశంలో కాంగ్రెస్ ని అధికారంలోకి తీసుకొస్తే ఇంకెన్ని చేయొచ్చు. దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ గ్రామగ్రామాన తిరుగుతున్నారు. అలాంటి రాహుల్ గాంధీని ప్రధానిని చేసేవరకు విశ్రమించొద్దు రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ఎజెండాగా పనిచేయాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటన. సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జోగులాంబ జోన్-7 డిఐజి : ఎల్ ఎస్, చౌహాన్



వనపర్తి మార్చి-01: వనపర్తి జిల్లాలో ఆదివారం రోజు తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా శనివారం రోజు జోగులాంబ జూన్-7 డిఐజి ×ఎల్ ఎస్, చౌహాన్ ఐపిఎస్, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ తో కలిసి ముందస్తు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. వనపర్తి జిల్లాలో సీఎం శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ముందుగా పాలిటెక్నిక్ కళాశాల హెలిప్యాడ్ నుండి జెడ్పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల వరకు వరకు రూట్ బందోబస్తుని పరిశీలించారు. విఐపి కాన్వాయ్ వెళ్లే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్ ఓపెనింగ్ పార్టీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. (బహిరంగ సభకు) పబ్లిక్ మీటింగ్ కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పబ్లిక్ మీటింగ్ వచ్చే వారికీ వనపర్తి ఆర్టిసి బస్ డిపోలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని పబ్లిక్ మీటింగ్కు వచ్చే వారు తమకు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేయాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే డయల్100 కి ఫోన్ చేసి పోలీసువారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ, కృష్ణ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మీనాక్షి రూటే... సపరేట్



హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిది మార్చి 1,తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్నారు. ఆమె సింప్లిసిటీ, స్ట్రిక్ట్ గా ఉండే తత్వం గాంధీభవన్ లీడర్లను ఆశ్చర్యపడేలా చేస్తుంది. గతంలో ఎన్నడూ ఇలాంటి నేతను చూడలేదే అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకూ పార్టీ ఇన్ ఛార్జులుగా వ్యవహరించిన వారు విమానాల్లో రాకపోకలు, స్టార్ హోటల్స్ లో బస. వారు హైదరాబాద్ వచ్చారంటే లక్షల్లోనే ఖర్చయ్యేది. రోజుకు కొన్ని లక్షలు పార్టీ ఖర్చు చేయాల్సి వచ్చేది. కానీ మీనాక్షి నటరాజన్ తొలిసారి హైదరాబాద్ కు వచ్చినప్పుడు ఆమె వ్యవహరించిన తీరుతో అందరినీ ఆకట్టుకున్నారు. అలాంటి వారితో మాట్లాడాలన్నా, పైరవీలు చేయాలన్నా, ఫిర్యాదు చేయాలన్నా భయమేననట్లుగా ఆమె వ్యవహరించిన తీరు అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ఉన్నత విద్య చదివి... మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్ లో బయోకెమిస్ట్రీలో పీజీ చేశారు. ఇండోర్ లో చదువుకుంటూనే రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ వైపు చూశారు. రాహుల్ గాంధీ సింప్లిసిటీని చూసి ఆమె కూడా అదే పార్టీని ఎంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి అనుబంధ విభాగమైన ఎన్.ఎస్.యూ.ఐ లో పనిచేశారు. తర్వాత 2008లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2009 ఎన్నికల్లో మందసౌర్ నుంచి పోటీ చేసి మీనాక్షి నటరాజన్ విజయం సాధించారు. గతంలో 2014, 2019 ఎన్నికల్లో ఓటమి పాలయి 2024 లో విజయం సాధించి ఎంపీగా ఎన్నికయ్యారు. రాహుల్ టీం లో ఒక సభ్యురాలిగా చేరారు. రాహుల్ గాంధీకి నమ్మకమైన నేతగా పేరుపొందారు.. ఇక మీనాక్షి నటరాజన్ ఈరోజు హైదరాబాద్ కు రైలులోనే వచ్చారు. తన బ్యాగ్ ను తానే మోసుకుంటూ వచ్చారు. కార్యకర్తలు, నేతలు ఆమె సామగ్రిని తీసుకునే ప్రయత్నం చేసినా సున్నితంగా వారించారు. తనకు స్వాగతం పలకడానికి ఎవరూ రావాల్సిన అవసరం లేదని ఆమె చెప్పడంతో పాటు కాచిగూడ రైల్వే స్టేషన్ లో దిగిన మీనాక్షి నటరాజన్ కు కేవలం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మరోఇద్దరు ముగ్గురు నేతలు మాత్రమే స్వాగతం పలికారు. ఎటువంటి హడావిడి లేకుండా ఆమె స్టార్ హోటల్ లో బస చేయకుండా సింపుల్ గా గెస్ట్ హౌస్ లోనే ఆమె బసచేశారు. తనకు కేటాయించిన వాహనంలోనే ఆమె గాంధీభవన్ కు చేరుకుని టీపీసీసీ విస్తృత సమావేశంలో పాల్గొన్నారు.. తన రాక సందర్భంగా ఎలాంటి హంగు, ఆర్భాటాలు చేయవద్దని మీనాక్షి నటరాజన్ ముందుగానే సూచించారు. తన పేరిట ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని ముందుగానే నేతలను హెచ్చరించారు. అలాంటివి తనకు చిరాకు అని మొహంమీదనే చెప్పిన మీనాక్షి నటరాజన్ అంతే సింపుల్ గా ఆమె గాంధీభవన్ కుచేరుకున్నారు. కాంగ్రెస్ లో ఏమాత్రం బలహీనత కనిపించినా వెంటనే క్యాష్ చేసుకోవడానికి ప్రయత్నించక మానరు. రాహుల్ గాంధీ మీనాక్షి నటరాజన్ మీద నమ్మకంతోనే ఇక్కడు పంపారు. ఇక్కడ పార్టీని సెట్ చేయడానికి, ప్రభుత్వంలో జరుగుతున్న తప్పొప్పులను ఎప్పటికప్పుడు టెన్ జన్ పథ్ కు అందించడానికే మీనాక్షి నటరాజన్ వచ్చినట్లు కనపడుతుంది.అందుకే కాంగ్రెస్ నేతలు మీనాక్షి నటరాజన్ ముందు ఏ మాత్రం తోక జాడించినా వెంటనే కట్ చేస్తారని పార్టీ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి.

# ఎయిర్ పోర్టు పనులు పరుగులు

**వరంగల్(ప్రజాబలం ప్రతినిది మార్చి 1**,వరంగల్ వాసుల ఎయిర్ పోర్టు కల ఫలించబోతోంది. కేంద్రం అధికారికంగా మామునూరు ఎయిర్ పోర్టును పునరుద్ధరించడానికి ఆదేశాలు జారీ చేసింది. రన్ వే నిర్మాణానికి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే చాలు... పనులు ప్రారంభిస్తారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు అవసరమైన నిధులను విడుదల చేసింది. ఇప్పటికే పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ సూచనల మేరకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల కిందటే మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ మేరకు అధికారులు భూసేకరణ ప్రక్రియ కూడా ప్రారంభఇంచారు. మామూనూరులో ప్రస్తుతం ఎయిర్ స్ట్రిప్ ఉంది. తొలి దశలో చిన్న విమానాల రాకపోకలకు వీలుగా 253 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. అదు కోసం రూ. 205 కోట్ల రూపాయల నిధుల్ని కేటాయించారు. తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ లోని అంతర్జాతీయ విమానాశ్రయం ఒక్కటే ఉంది. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా మరో 6 చోట్ల ప్రాంతీయ విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కారు కొన్నేళ్లుగా కసరత్తు చేస్తోంది. ఆ ఆరు ప్రాంతాలను ఏఏఐ అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై సుముఖత వ్యక్తం చేస్తూ.. ఇటీవల ప్రాథమిక నివేదిక ఇచ్చింది. ఈ మేరకు తొలి దశలో వరంగల్ లో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం... ఏఏఐ అధికారులతో కొద్ది నెలలుగా సంప్రదింపులు జరుపుతోంది. తాము సూచించిన అదనపు భూమిని కేటాయిస్తే నిర్మాణ వ్యవహారాలను మొదలు పెడతామని ఇప్పటికే లేఖలు రాశారు. ఇప్పుడు భూసేకరణ చివరి దశకు రావడంతో కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ జిల్లా మామునూరులో హైదరాబాద్ చివరి నిజాం 706 ఎకరాల విస్తీర్ణంలో ఎయిర్ స్ట్రిప్ నిర్మించారు. 1930లో భారత్ - చైనా యుద్ధ సమయంలో ప్రభుత్వ విమానాల హ్యాంగర్ గా దీన్ని వినియోగించారు. అప్పట్లో అతిపెద్ద రన్ వేగా గా కూడా ఈ విమానాశ్రయం గుర్తింపు పొందింది. ప్రస్తుతం దీనికి అదనంగా మరో 253 ఎకరాలు సేకరిసతున్నారు. విమానాశ్రయం నిర్మాణానికి 400 రూపాయల కోట్ల నుంచి 450 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భూమి మినహా మొత్తం కేంద్రమే భరిస్తుంది.శ్రీకాకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు కేంద్ర విమానయాన శాఖా మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరవతా తెలుగు రాష్ట్రాల్లో ఎయిర్ పోర్టుల పనులు జోరందుకుంటున్నాయి. ఈ క్రమంలో .. తెలంగాణలో వయబులిటి ఉన్న ఎయిర్ పోర్టులను వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని నిర్ణయించుకున్నారు. వరంగల్ ఎయిర్ పోర్టుకు మంచి డిమాండ్ ఉంటుందన్న అంచనాకు రావడంతో నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

డిసెంబర్ నాటికి పూర్తి

తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి మాత్రమే విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. పొరుగు రాష్ట్రాల్లో మూడు, నాలుగు చోట్ల విమానాశ్రయాలు అందుబాటులో ఉండగా.. తెలంగాణలో మాత్రం ఒక్కటే విమానాశ్రయం ఉంది. దీంతో తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. వరంగల్, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించాలని ప్రతిపాదించి కేంద్రానికి పంపింది. ఇందులో వరంగల్ మామూనూరు ఎయిర్‌పోర్టుపై కీలక అప్డేట్ వచ్చింది.బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత ఫైల్‌పై కేంద్ర విమానాయనశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం సంతకం చేశారు. మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మొత్తం 949.14 ఎకరాల భూమి అవసరం కాగా.. ఇప్పటికే 696.14 ఎకరాల భూమి సేకరించారు. మరో 253 ఎకరాలు కావాలని ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వా?న్ని కోరింది. ఆ భూమిని సేకరించే ప్రక్రియ ప్రస్తుతం చురుగ్గా సాగుతోంది.మామునూరు బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఈ ఏడాది డిసెంబరులోగా విమానాలు నడిపించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో టెర్మినల్ నిర్మాణానికి ఈ నెలలోనే డిజైన్లు తయారు చేయనున్నారు. అనంతరం టెండర్లు పిలవాలని యోచిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి తొలిదశ పనులు పూర్తిచేసి రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు.. దక్షిణాదిలోని ప్రముఖ ప్రాంతాలకు విమానాలు నడిపించాలని టార్గెట్ పెట్టుకున్నారు.సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఇటీవల జిల్లా ఇంఛార్జ్ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు ఎయిర్‌పోర్టు పనుల పురోగతిపై పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులపైనా ఏఏఐతో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులకు కీలక సూచనలు చేశారు. ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే.. ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం, నల్గొండ ప్రజలకు ఎయిర్ కనెక్టివిటీ సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

## వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

## ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు విమర్శ

నరసరావుపేట, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఏమాత్రం ఊతం ఇచ్చే విధంగా లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ఈ కాలంలో మిర్చి రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఆవేదనకు గురవుతుంటే, వారికి భరోసా కల్పించే విధంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అదేవిధంగా ధరల స్థిరీకరణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ మిర్చి కనీసం 20వేలకు తగ్గకుండా కొనుగోలు చేసి రైతును ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు శనగ, కంది రైతులు కూడా సరైన ధర లేక దిగాలు పడ్డ పరిస్థితుల్లో వారికి ఏమాత్రం స్వాంతన కలిగించే విధంగా ఈ బడ్జెట్ లేకపోవటం రైతుల పట్ల, వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని అన్నారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే 20వేలు ఇస్తుందని చెప్పిన పాలకులు, నేడు కేంద్రంతో కలిపి 20వేలు చెల్లిస్తామనటం రైతులను దగా చేయటమేనని విమర్శించారు. ప్రధానంగా పలనాడు జిల్లాలో 100 గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు సాగునీరు అందించే పల్నాడు వరప్రసాదాయనిగా పిలవబడుతున్న వరికపుడిశల ప్రాజెక్టు శంకుస్థాపనలకే పరిమతమవుతుంది తప్ప, బడ్జెట్లో నిధులకు మాత్రం నోచుకోవటం లేదని, దీన్నిబట్టి వెనకబడిన ప్రాంతాల పట్ల సాగునీటి ప్రాజెక్టుల పట్ల పాలకుల చిత్తశుద్ధిని తెలియజేస్తుందని విమర్శించారు. రైతును రాజును చేస్తామనేటటువంటి ఊక దంపుడు మాటలు మాని, చేతల్లో రైతులకు భరోసా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే రాబోయే కాలంలో రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని గోపాలరావు ప్రభుత్వానికి హెచ్చరించారు.

# రేవంత్ ఢిల్లీ టూర్ పై రాజకీయం



**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిది మార్చి 1,** ప్రధాని మోదీని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ తర్వాత పలు రకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఆరోపణ , ప్రత్యారోపణలు సాగుతున్నాయి. ప్రధాని ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడం కేంద్ర- రాష్ట్ర సంబంధాల్లో భాగమే. సమాఖ్య విధానంలో ఇది సాధారణమే. కాని కేంద్రంలో ఓ పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రధాని, ముఖ్యమంత్రి భేటిని రాజకీయ కోణంలో చూసే పరిస్థితి ఉంటుంది. అయితే ఏ పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి, మోదీని కలిశారు. ప్రధాని మోదీతో భేటి కి ముందు సీఎం రేవంత్ రెడ్డి మోదీ పై విరుచుకుపడిన పరిస్థితి. సాధారణ ఎన్నికల సమయంలోను, ఢిల్లీ శాసన సభ ఎన్నికల సమయంలో అప్పటి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మాత్రమే ఓ రేంజ్ లో మోదీని టార్గెట్ చేసేలా విమర్శలు గుప్పించారు. ఆ తర్వాత అదే రేంజ్ లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని టార్గె చేసేలా గత కొద్ది రోజుల క్రితం మాట్లాడారు. కుల గణన విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ రేవంత్ లక్ష్యంగా టార్గెట్ చేస్తే, రేవంత్ రెడ్డి మాత్రం ఏకంగా ప్రధాని మోదీ లక్ష్యంగా విమర్శలు చేశారు. మోదీ అసలు బీసీనే కాదని, లీగల్లీ కన్వర్టడ్ బీసీ అని వ్యాఖ్యానిస్తూ మోదీని అగ్ర వర్ణ నాయకుడిగా అభివర్ణించారు. ఆయన పుట్టింది అగ్రకులంలోనే అంటూ, తాను 2001లో ముఖ్యమంత్రి అయ్యాక బీసీగా తన కులాన్ని మార్చుకున్నారని దుయ్యబట్టారు.బీసీ సర్టిఫికెట్ ఉన్నా, బీసీల పట్ల మోదీకి తీవ్ర వ్యతిరేకత ఉందని రేవంత్ చెప్పారు. దేశంలో బీసీ లెక్కలు తీయకుండా మోదీనే అడ్డుపడుతున్నట్లు చెప్పుకొచ్చారు సీఎం రేవంత్. అంతే కాదు, రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదని వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఇలా రేవంత్ రెడ్డి మోదీని బీసీల వ్యతిరేకిగా అదే రీతిలో తెలంగాణ ప్రాంతానికి వ్యతిరేకిగా టార్గెట్ చేస్తూ మాట్లాడిన పరిస్థితి. రాష్ట్ర మీడియాతో పాటు, జాతీయ మీడియా కూడా రేవంత్ కామెంట్స్ ను పెద్ద ఎత్తున కవర్ చేయడం విశేషం.6 నెలల్లో ప్రభుత్వం పడిపోతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ గత ఆరేదు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. క్యాబినెట్ లోని టాప్ ఐదుగురు మంత్రులు మాత్రమే సంతోషంగా ఉన్నారని, వారికి మాత్రమే ప్రభుత్వంలో పనులు జరుగుతున్నాయని మిగతా వారంతా అసంతృప్తితో ఉన్నారన్న వ్యాఖ్యలు చేశారు.ఇక చాలా మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని, వారిలో కొద్ది మంది ఫాం హౌస్ లో ఇటీవలే సమావేశమయ్యారని చెప్పడం ఇవన్నీ చూస్తే తెలంగాణలో ఏదో జరుగుతుందన్న అనుమానాలు రెకెత్తించేవే. అదీ కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ నోట ఇలాంటి మాటలు రావడం అంత ఆషా మాషీగా మాట్లాడిన మాటలే కావని, అలాంటి పరిస్థితి ఎంతో కొంత కాంగ్రెస్ సర్కార్ లో ఉండొచ్చన్న చర్చ సాగుతోంది. అయితే ఇది ఓ మంత్రి పై అసంతృప్తితో నలుగురైదుగురు ఎమ్మెల్యేలు సమావేశం అయితే అదేమి పెద్ద విషయం కాదని కాంగ్రెస్ చెబుతున్నా ఇవి ప్రమాద ఘంటికలేనన్నది స్పష్టం. ఇలాంటి సంచలన వ్యాఖ్యల అనంతరం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మోదీని కలవడం కూడా ఓ ప్రాధాన్యత అంశంగా రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.ఆరు నెలల్లో కాంగ్రెస్ సర్కార్ కూలిపోతుందని మాజీ మంత్రి బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయకర్ కూడా ఈ మధ్యనే మాట్లాడటం విశేషం. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య కుమ్ములాటలు జరుగుతున్నాయని, ప్రభుత్వం కుప్పకూలుతుందని ఎర్రబెల్లి వ్యాఖ్యానించారు. ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ ఘోర పరభావం వల్ల పార్టీ నేతల్లో, కార్యకర్తల్లో విశ్వాసం లోపించిందని చెప్పారు. ఎర్రబెల్లి మాత్రమే కాకుండా, పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేతలు హరీశ్ రావు, కవితలు కూడా పలు వేదికలపై ఇదే అంశాన్ని ప్రస్తావించడం విశేషం. ఇక లెటెస్ట్ గా ఎమ్మెల్సీ కవిత విమర్శలు చూస్తే, రాష్ట్రంలో కాంగ్రెస్ ను బీజేపీనే కాపాడుతుందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి స్వతహాగా ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న నాయకుడని, బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఈ కామెంట్స్ ద్వారా బీజేపీకి రేవంత్ రెడ్డి సన్నిహితంగా ఉంటున్నారన్న అర్థం వచ్చేలా ఉంది. విపక్షాలతో రాజకీయం ఇలా ఉంటే ఈ మధ్య కాలంలో అంతర్గతంగా కొంత అసంతృప్తి కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తోంది. ముఖ్యంగా బీసీ కులగణన తర్వాత ఆ పార్టీలోని బీసీ నేతలు కొందరు బాహటంగానే రేవంత్ సర్కార్ పై నిప్పులు చెరగడం, పార్టీలో సీనియర్ నేతలయిన జీవన్ రెడ్డి, చిన్నారెడ్డి, మధుయాష్కీ, అంజన్ కుమార్ యాదవ్ వంటి వారి అసంతృప్త రాగాలు హస్తం పార్టీలో వినిపించాయి. ఎస్సీ వర్గీకరణపై మంద కృష్ణ మాదిగ రేవంత్ సర్కార్ పై తమ రిజర్వేషన్ల శాతం తగ్గించాయన్న వ్యాఖ్యలు పార్టీలో చర్చకు దారి తీశాయి. మరో వైపు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన గులాబీ ఎమ్మెల్యేలు అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి , కోనేరు కోనప్ప, దానం నాగేందర్ వంటి వాళు ప్రభుత్వ తీరును , హస్తం పార్టీ నేతల తీరును బహిరంగంగానే తప్పుపట్టిన పరిస్థితి. మరో వైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల కేసు సుప్రింకోర్టులో ఉంది. ఈ పరిస్థితుల్లో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు చేజారితే అప్పుడు ప్రతిపక్ష పార్టీలయిన బీజేపీ, బీఆర్ఎస్ లకు కాంగ్రెస్ సర్కార్ ను కూల్చడం అంత పెద్ద విషయం కాదు. నలుగురైదుగురు అసంతృప్త హస్తం ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తే కాంగ్రెస్ సర్కార్ కూలడం ఖాయం. అయితే ఇప్పటికిప్పుడు బీఆర్ఎస్ అంత సాహసం చేసే పరిస్థితుల్లో లేదు. మరో వైపు కాంగ్రెస్ కు ప్రధాన శత్రువయిన బీజేపీ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసిన చరిత్ర బీజేపీకి ఉంది. తెలంగాణలోఆ పరిస్థిత రాదన్న గ్యారంటీ ఏం లేదు. అయితే ఇలాంటి రాజకీయ పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కలవడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. మోదీని ప్రసన్నం చేసుకునేందుకే రేవంత్ ఢిల్లీ పర్యటన సాగిందని ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు ప్రచారం ప్రారంభించారు.ప్రధాని మోదీని కలిసేందుకు మరో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు, అధికార బృందం వెళ్లినా సీఎం రేవంత్ రెడ్డితో ముఖాముఖి చర్చ జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఒంటరిగా ఏం మాట్లాడుకున్నారన్న చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో సాగుతోంది. సహజంగా రాష్ట్ర సమస్యలపైనే అయితే మరో మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్, ఇతర అధికారులు కూడా సమావేశంలో ఉంటారని, కాని సీఎం ఒక్కడే కలవడం ఏంటన్న ప్రశ్నలు వేస్తున్నాయి ప్రతిపక్ష పార్టీ నేతలు. ఇది కేవలం రాజకీయ సమావేశమేనని, మోదీని కలిసి రాజకీయ విషయాలు చర్చించడానికే రాష్ట్ర సమస్యలను సాకుగా తీసుకుని కలిశారన్న అనుమానాలను అటు బీఆర్ఎస్ ముఖ్య నేతలు లేవదీస్తున్నారు.ప్రధాని మోదీ డైరెక్షన్ లోనే రేవంత్ సర్కార్ సాగుతుందని ఆ పార్టీ సీనియర్ నేత కవిత సైతం కామెంట్ చేయడం విశేషం. రాజకీయాల్లో ప్రతీ పరిణామం కీలకమే. కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ నేతలు కాకతాళీయంగా రేవంత్ సర్కార్ ను డిఫెన్స్ లోకి నెట్టడానికే ఆరు నెలల్లో కూలిపోతుందని చెప్పారా... లేక అలాంటి రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయా అంటే మరి కొంత కాలం వేచి చూడాల్సిందే.

# బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం..

## కృష్ణకుమారి...

## బాలికలు సైకిల్ తో ర్యాలీ...



డుంబ్రిగుడ బాలికలకు చట్టాలపై అవగాహన అవసరమని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కృష్ణకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం లో భాగంగా మండల ఐసిడిఎస్ సిడిపిఓ నీలిమ ఆధ్వర్యంలో శనివారం ఈనెల 1న భేటీ బచావో బేటి పడావో లో భాగంగా బాలికలకు సైకిల్ ర్యాలీ, సంస్కృతిక కార్యక్రమాలైన ధింసా నృత్యాలతో అరకు పాడేరు ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ దేశంలో మహిళల పట్ల ఎన్నో అరాచకాలు జరుగుతున్నాయని చెప్పారు. వీటి నిరోధానికి ప్రభుత్వం అనేక చట్టాలు అమలు చేస్తుందని చెప్పారు. ఈ చట్టాలను ప్రతి ఒక్క మహిళ, బాలికలు వినియోగించుకోవాలని ఆమె చెప్పారు. చట్టాలు, బాలికల, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలు వివరించడమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే సహాయ హెల్ప్ లైన్ నెంబర్లను కూడా ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు, డిప్యూటీ తాసిల్దార్ ముజీబ్ విద్యార్థినిలు, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి కాంగ్రెస్ వర్సెస్ బీసీ కాంగ్రెస్

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిది మార్చి 1,**తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాటలు, ఆధిపత్య పోరు, వర్గ విభేదాలు, సీనియర్స్ వర్సెస్ జూనియర్స్ వార్ ఇలాంటివన్నీ సర్వసాధారణమే. ఇవి లేకపోతే తెలంగాణ కాంగ్రెస్ పాలిటిక్స్ ఊహించలేం. ప్రతిపక్షంలో ఉన్నా , అధికారం చేతికొచ్చినా తీరు మాత్రం సేమ్ టూ సేమ్. తాజాగా గ్రూపు రాజకీయాలు కాస్త ప్రక్కకు జరిగి ఇప్పుడు బిసి వర్సెస్ రెడ్డి సమాజిక వర్గం పేరుతో విమర్శల దాడి పెరిగింది. ఏదో? అలవోకగా వచ్చిన మాటలంటే కాదు , కాంగ్రెస్ లో జమానా కాలం నుండి ఉండికూ?డా వాళ్లు మాట్లుతున్న మాటలు వింటుంటే ఇందేందిరా భయై కాంగ్రెస్ లొల్లి అనకతప్పడంలేదు. ఎందుకిలా ఒక్కరి తరువాత ఒకరు అన్నట్లు బిసి నేతలు కాంగ్రెస్ లో రెడ్డి సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తున్నారనేది కోటి డాలర్ల ప్రశ్నగా మిగిలింది. నిన్నగాక మొన్న తీన్మార్ మల్లన్న బిసి బహిరంగ సభలో రెడ్డి సామాజికవర్గంపై అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి చివరి రెడ్డి సిఎం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే 2028 ఎన్నికల్లో తెలంగాణకు బిసి ముఖ్యమంత్రి కాబోతున్నాడంటూ , బిప్ సౌండ్స్ వేయాల్సిన పదజాలంతో రెడ్డిసామాజిక వర్గంపై రెచ్చిపోయారు. కులగణన పేరుతో 42లక్షల మంది బిసిలను చంపేస్తారా, లెక్కలోనే లేకుండా చేస్తారా అంటూనే 16లక్షల మంది ఓసీ జనాభా ఎలా పెరిగారంటూ ప్రశ్నించారు.కులాల మధ్య చిచ్చురేపుతున్న నోటిదూల వెనుక వ్యూహం ఇదేనారేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించిన కులగణన సర్వేనే తగులబెట్టి, అది ఓ చెత్త సర్వే అంటూ రెచ్చిపోయారు. ఇలా బిసిలను ఐక్యం కావాలంటూనే రెడ్డి సామాజిక వర్గంపై చెలరేగిపోయారు కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్ మార్ మల్లన్న. బిఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అదేపనిగా ప్రభుత్వతీరును ఎండగడుతూ, కాంగ్రెస్ పార్టీ మనసు దోచుకున్న మల్ల, రేవంత్ రెడ్డి సహకారంతో పార్టీలోకి ఎంట్రీ ఇవ్వడం, ఎమ్మెల్సీగా గెలవడం జరిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే మల్లన్న రాజకీయ భవిష్యత్ కు మార్గం చూపింది కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రోత్సాహం. మరి ఇప్పుడు ఎందుకిలా రెడ్డి సమాజికవర్గంపై కత్తులు నూరుతున్నాడనేది అంతుచిక్కడంలేదు.ఒకవేళ రేవంత్ వ్యూహంలో మల్లన్న దూకుడు భాగమైతే అది రెడ్డి వర్గాన్నె ఎందుకు టార్గెట్ చేస్తారు. అలా చేయడం ద్వారా బిసిలు కాంగ్రెస్ కు మరింత దగ్గరవుతారని ఇలా సొంత ఇంట్లో కులం మంట పెట్టి చలికాచుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దశాబ్దాలుగా రెడ్డి పాలన ,పెత్తనం ఇక చాలు, బిసిల ఓట్లు ఎలాగో ఎక్కువ , మనం అధికారం రావడానికి? ఏం తక్కువ అనుకుని ముందుకు దూసుకుపోతున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. ఇలా సొంత పార్టీలో మల్లన్న రేపిన కులం కుంపటి ఎంతరకూ కాంగ్రెస్ కు మేలు చేస్తుందో చూడాలి. ఇదిలా ఉంటే తాజాగా మరో బిసి సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ సైతం, కాంగ్రెస్ పార్టీలో కొందరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు తన రాజకీయ భవిష్యత్ కు దెబ్బకొట్టారని తీవ్ర ఆరోపణలు చేసారు.ఏకంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, జానా రెడ్డి అంటూ పేర్లు ప్రస్తావించి మరీ రెడ్డి సామాజిక వర్గంపై సంచలన వ్యాఖ్యలు చేసారు.యాదవులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వరా అంటూ నిలదీశారు.రాహుల్ గాంధీ గట్టిగా చెబితేనే కులగణనకు ఈ రెడ్డి నేతలు ఒప్పుకున్నారని, లేదా కులగణన కూడా జరిగేదికాదంటూ మరో అడుగు ముందుకేసి సొంత పార్టీలో రెడ్డినేతలను రచ్చకీడ్చారు. సాధారణంగా వివాదాలకు ఆమడదూరంలో ఉండే అంజన్ కుమార్ యాదవ్ , ఒక్కసారిగా రెడ్డినేతలపై కత్తులు దూయడం వెనుక కారణాలేంటి..? ఈ ఇద్దరు నేతల మాటల తూటలచాటున దాదిన రాజకీయ వ్యూహంపై సర్వత్రా చర్చనడుస్తోంది. అంజన్ కుమార్ యాదవ్ దాదాపు రాజకీయాలకు దూరమైపోయారు అనుకున్న సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అవునన్నా, కాదన్నా రేవంత్ నాయకత్వంలో తన కుమారుడు అనిల్ కుమార్ యాదవ్ కు రాజ్యసభ ఎంపీగా ప్రాధాన్యత దక్కింది. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కూడా రేవంత్ కు అత్యతంత సన్నిహితుల్లో ఒకరు, తాను నమ్మిన కోర్ టీమ్ లో ఒకడు . మల్లన్న సైతం రేవంత్ తో సన్నిహితంగానే మెలుగుతున్నారు. బిఆర్ ఎస్ పై ప్రజావ్యతిరేకత కలగడంలో కీలకంగా వ్యవహరించారు. రేవంత్ సపోర్టుతో ఎమ్మెల్సీ అయ్యారు. ఇలా రెడ్డివర్గంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్న ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతలూ రేవంత్ కు సన్నిహితులే. మరెందుకు ఇలా ఆ సామాజివర్గాన్నే రెచ్చగొడుతున్నారనేది వెనుక పెద్ద వ్యూహమే ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.బిసి కాంగ్రెస్,వర్సెస్ రెడ్డి కాంగ్రెస్ గా వేరుచేయడంతో మొదలై బిసిలకు ప్రాధ్యాన్యత ఇచ్చేలా చేస్తూ, తమ కాంగ్రెస్ సాధించిన ఘనతగా తిరిగి కాంగ్రెస్ కు బిసిలను ఫిక్స్ ఓగ్ బ్యాంక్ గా మార్చాలనేది రేవంత్ వ్యూహం లో భా?గమంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇలా బిఆర్ ఎస్ కు బిసిలు మరలకుండా కాంగ్రెస్ తో ఉండేలా , రేవంత్ అండతోనే ఇలా బీసి నేతలు రెడ్లపై రెచ్చిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# మళ్లీ మట్టిపాత్రలలో వంటకాలు...

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిది మార్చి 1,** మట్టి పాత్రలు అంటే మన పూర్వీకుల కాలంలో వాడేవాళ్లు. ఇంకా చెప్పాలంటే రెండు తరాల కిందటి వరకు వాటిని బాగానే వినియోగించారు. మంచినీళ్లు తాగే కుండల నుండి వంట పాత్రల వరకూ అన్ని మట్టితో చేసినవే ఉండేవి. వాటిని వాడితేనే ఆరోగ్యం. అందుకే పెద్దలు మట్టి పాత్రలలో చేసే వంటలను ఇష్టంగా తినేవారు. తరువాత రోజుల్లో పరిస్థితులు మారిపోయాయి. కాలక్రమంలో మట్టి పాత్రలు కనుమరుగైయ్యాయి. ఎంతలా అంటే అప్పట్లో ఉండేవి ఇవి అనేలా పరిస్థితులు వచ్చాయి.కానీ నేటి రోజుల్లో సీన్ రివర్స్ అయ్యింది.మనం మట్టి నుండే వచ్చాం.. ఆ మట్టి నుండే మనుగడ నేర్చుకున్నాం.. దాన్ని మరిచినా భేషుగ్గా బ్రతకగలం అనుకున్నాం. కానీ కాలం గిర్రున తిరిగి మళ్లీ మట్టిని మన వంటింటికి చేర్చింది. విద్యుత్ కుక్కర్లు, నాన్‌స్టిక్ ప్యాన్‌లు, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు ..ఇలా ఆర్టిఫిషియల్ రోజులకి గుడ్‌బై చెబుతూ... మట్టి పాత్రల్లో వంట చేసుకొని ఆహా ఏమి రుచి అనే రోజులొచ్చాసాయి. మన తాతల కాలమంతా మట్టి చుట్టే తిరిగింది. పంటల నుంచి వంటల దాకా...అంతా అప్పట్లో మట్టిని నమ్ముకునే జీవనం సాగించారు. అయితే కాలక్రమంలో మనిషి కొత్త 'పాత్ర'ల్లోకి మళ్లాడు. దాదాపుగా మట్టి పాత్రల్లో వంట అనేది మరిచిపోయాడు.కానీ ఇప్పుడు పరిస్థితుల్లో ఊహించని మార్పులొచ్చాయి. కోవిడ్ తరువాత ఆరోగ్యంపై పెరిగిన అవగాహన, సోషల్ మీడియా ప్రభావం పుణ్యమా అని మళ్లీ మట్టికి జీవం వచ్చింది. సహజమైన జీవన విధానం ద్వారా కలిగే లాభాలు అర్థం చేసుకున్న కొందరు మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నారు. మట్టి పాత్రలనగానే కుండలు తప్ప మరేం గుర్తుకు రావు. కానీ మారుతున్న ఆలోచనా ధోరణులకు అనుగుణంగా మట్టితో చేసిన అన్ని రకాల వంట పాత్రలు ఇప్పుడు హైదరాబాద్ వంటి హైటెక్ నగరాలలో సైతం దొరుకుతున్నాయి. మట్టితో తయారు చేసిన కుక్కర్లు, కడాయిలు, ప్యాన్‌లు, జగ్గులు, గ్లాసులు, కప్‌లు.. ఇలా ఒకటేమిటి వంటింటి సామాన్లన్నీ ఇప్పుడు ఈజీగా దొరుకుతున్నాయి. ఆన్‌లైన్‌లోనూ ఈ పాత్రల అమ్మకాలు జోరుగా సాగుతుండం కూడా మరో హైలెట్ గా చెప్పవచ్చు.సిటీలో సహజ పద్ధతులంటే ఖర్చుతో కూడిన వ్యవహారమనే ఆలోచన ముందుగా కలుగుతుంది. కానీ మట్టి పాత్రల విషయంలో అలా కాదు. అదుబాటు ధరలలోనే మట్టి పాత్రలు దొరికేస్తున్నాయి. ఈ పాత్రలతో కాలుష్యం ఉత్పన్నం కాదు. మెటల్‌తో పోలిస్తే వీటిలో ఆహారం మెల్లిగా, సమంగా ఉడుకుతుంది. మట్టికి సహజంగా హీలింగ్ ఎనర్జీ ఉంటుంది. మన మూడ్‌ని దానంతట అదే మార్చే గుణం మట్టికి ఉందని మరోవైపు పరిశోధనల్లో తేలింది. మనం డిప్రెస్‌డ్‌గా ఉన్నప్పుడు మట్టికి దగ్గరగా చేసే ఏ పనైనా మూడ్‌ని ఇట్టే మార్చేయటం గమనించొచ్చు. అంతెందుకు ఇప్పుడు ప్రకృతి వైద్య విధానాల్లోనూ మట్టి వినియోగం ప్రాధాన్యత తెలిసిందే. మట్టి పాత్రల్లో వంటే కాదు.. అందులో ఆహారం తినడం, కాఫీ తాగడం కూడా రుచిగా, కొత్తగా ఉంటుంది అంటున్నారు ఈ పాత్రలు అలవాటైన వాళ్లు.ఇప్పుడు మార్కెట్లో నల్ల, టెర్రకోట మట్టి పాత్రలు లభిస్తున్నాయి. వీటిలో క్షార గుణం ఉండటం వల్ల ఆహారానికి కొత్త, ఇంపైన రుచి వస్తుంది. బొమ్మిడాయిల కూర రాత్రి మట్టి పాత్రలో వండి మరుసటి రోజూ తింటే ఆ రుచి అద్భుతంగా ఉంటుందని నాన్ ప్రియులు చెబుతున్నారు. మట్టి పాత్రల్లో పులుసు, పప్పు, మాంసాహారం ఇలా ఏది వండినా రుచి, వాసన రెట్టింపవుతుంది. పైగా నూనె ఎక్కువ వేయాల్సిన అవసరం లేదు. వీటి వాడకంలో కొంత జాగ్రత్త అవసరం. అలాగే ఈ పాత్రలను శుభ్రం చేయడానికి డిటర్జెంట్‌లు వాడకూడదు. నిమ్మకాయ, చింతపండు, వేడి నీళ్లు, కొబ్బరి పీచులతో క్లీన్ చేయాలి. పాత్రలు వేడిగా ఉన్నప్పుడు శుభ్రం చేసినా, ఆదరాబాదరాగా వాడిన పగిలి పోయే ప్రమాదం ఉంది. ఇలా జాగ్రత్తగా వాడితే మట్టిన మంచిన ఆరోగ్యం లేదు.అందుకే నెమ్మదిగా మట్టి పాత్రలకు అలవాటు పడుతున్నారు ప్రజలు. అవగాహనా పెరగడంతో రోజురోజుకూ వీటి వాడకం పెరుగుతోంది.

## కృష్ణాపురం సందర్శించిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ బృందం

## పాఠశాలలో పిల్లల హాజరు శాతాన్ని పెంచుదాం



తల్లాడ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ బృందం శనివారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కృష్ణాపురం గ్రామానికి సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను బృందం సందర్శించి పిల్లల హాజరు శాతాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అతి తక్కువ మంది పిల్లలు ఉండటంతో హాజరు శాతం పెంచుటకు గ్రామ పెద్దల సహకారం తో గ్రామంలో ర్యాలీ చేద్దాము అని అన్నారు. ఆరోగ్య కేంద్రంలో చిన్న పిల్లలకు వేసే వ్యాక్సిన్ కేంద్రం పరిశీలించారు. పంచాయతీ ఆఫీస్ కి వెళ్లి సామాజిక వన మొక్కలను పరిశీలించినారు. ఈ కార్యక్రమం లో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్, ఫౌండర్ డాక్టర్ బొడ్డపాటి దాసు, ఖమ్మం జిల్లా ఇంచార్జి మంగతాయరు, జిల్లా కన్వీనర్ నరసింహారావు, జిల్లా కోఆర్డినేటర్ శీలం లక్ష్మీ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విడుదలయ్యే సినిమాలకు బెనిఫిట్ షోలకు హైకోర్టు నో

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిదిమార్చి 1** తెలంగాణలో విడుదలయ్యే సినిమాలకు బెనిఫిట్ షో, స్పెషల్ షో, ప్రీమియర్ షోలకు హైకోర్టు అనుమతిని నిరాకరించింది. అంతేకాక.. 16 సంవత్సరాల లోపు పిల్లల్ని అన్నీ షోలకు ఉత్తర్వుల్లో పేర్కొంది. ముందుగా పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది టికెట్ ధరల పెంపును కోర్టు దృష్టికి తీసుకువెళ్లగా.. ప్రభుత్వ తరుపు న్యాయవాది ధరల పెంపును రద్దు చేసినట్లు తెలిపారు. వాదోపవాదాలు విన్న న్యాయస్థానం ప్రేక్షకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బెనిఫిట్ షో, స్పెషల్ షో, ప్రీమియర్ షోలకు అనుమతిని నిరాకరిస్తూ.. తదుపరి విచారణను మార్చి 17వ తేదీకి వాయిదా వేసింది. అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగిన ఓ మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ఏ సినిమాకి కూడా బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతి ఇవ్వమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కానీ, రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమాకు మాత్రం టికెట్ ధరల పెంపునకు అనుమతి లభించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

# గోల్నాక లో వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు విదేశియులు అరెస్టు



**హైదరాబాద్..ప్రజాబలం ప్రతినిది** అంబర్ పేట్ గోల్నాక జిందాతిలిస్మాత్ వీధిలో ఓ వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు చేసారు. నలుగురు మహిళలను రెస్క్యూ హోం కు తరలించారు. అందులో ముగ్గురు ఉగాండా, ఒకరు కెన్యా చెందిన వారిగా గుర్తించారు. వ్యభిచారగృహం నిర్వాహకుడు లైబీరియా దేశానికి చెందిన వ్యక్తి తో పాటు ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు.

# మహాశివరాత్రి సందర్భంగా హుండీ లెక్కింపు

పటాన్ చేరు బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి హుండీలను శనివారం ఉత్సవాల కార్యనిర్వహణ అధికారిని అన్నపూర్ణ,ఆలయ ఈవో శశిధర్ గుప్తా దేవాలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో లెక్కింపు చేపట్టారు. నాలుగు రోజుల ఉత్సవాల హుండీలను సేవ టికెట్ల ద్వారా టెండర్ల ద్వారా ఆదాయం లెక్కించగా 47,99,283 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం 10,10,982 రూపాయల ఆదాయం అదనంగా వచ్చిందని తెలిపారు ఈ ఉత్సవాలకు సహకరించిన వివిధ శాఖల అధికారులకు భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు చంద్రశేఖర్, లక్ష్మికాంతరావు,మల్లేష్,మహిపాల్ రెడ్డి,దీపక్ గౌడ్,మహేష్ కుమార్,ఎల్లయ్య,శ్రీనివాస్,నిర్మల,అరుణదేవి ,ప్రహ్లాద్,ప్రధాన అర్చకులు,బిరాంగూడ శివాలయ సేవాసమితి ఆనంద్,రామకోటేశ్వర్ రావు,చలపతి రాజు తదితరులు పాల్గొన్నారు

# ఓయూలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిది**ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 57 లో ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం అమరులైన కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా అయితే ఆదుకున్నదో, అమరులకు విలువనివ్వడానికి అమరవీరుల స్తూపం ఏర్పాటు చేశారో అదేవిధంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అసువులు బాసిన అమరులైన మాదిగ అమరుల కుటుంబాలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మందకృష్ణ మాదిగ కోరారు. అమరవీరులను స్మరించుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్తూపంతో పాటు మ్యూజియంను ఏర్పాటు చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం అనేది న్యాయమైన పోరాటం కాబట్టే అన్ని రాజకీయ వర్గాలు సమర్థించాయని తెలిపారు. గతంలో నియమించబడ్డ కమిషన్లు అన్ని వర్గీకరణకు మద్దతుగా నిలబడ్డాయని అన్నారు అన్ని రాజకీయ పక్షాలతో పాటు దళితుల్లో 59 కులాల్లో 58 కులాలు వర్గీకరణ కోరుకుంటున్నాయని పేర్కొన్నారు. సమాజంలో ఉండే అన్ని వర్గాలు వర్గీకరణ ఉద్యమాన్ని

# క్షేత్ర పర్యటనతో ప్రయోగాత్మక విజ్ఞానం



## మహిళ డిగ్రి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ

## మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల క్షేత్ర పర్యటన

**జగిత్యాలప్రజాబలం ప్రతినిది మార్చి 01:** విద్యార్థుల క్షేత్ర పర్యటనల ద్వారా ప్రయోగాత్మక విజ్ఞానం పెంపొందితోందని జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అన్నారు.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల తెలుగు విభాగం, ఆంగ్ల విభాగం జంతు శాస్త్ర విభాగం, చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం పొలాస పరిశోధన స్థానంలో క్షేత్ర పర్యటనను నిర్వహించారు.ఈ క్షేత్ర పర్యటనలో భాగంగా పొలాసలో చారిత్రిక ప్రదేశమైన పౌలస్త్య బ్రహ్మేశ్వర దేవాలయాన్ని చేరుకొని ఆ దేవాలయానికి సంబంధించిన శాసనం, శిల్పాలు వాటిని పరిశీలించారు.దేవాలయానికి సంబంధించిన చారిత్రక పౌరాణిక ప్రాశస్త్యాన్ని గూర్చి దేవాలయ వ్యవస్థాపక నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ద్వారా తెలుసుకున్నారు.అనంతరం సమీపంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల లోని ఎంటమాలజీ విభాగాన్ని సందర్శించారు.పంటకు మేలు చేసే మిత్ర పురుగులు హాని కలిగించే పురుగులను గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. అలాగే కీటకాలను సేకరించే వివిధ రకాల పరికరాలు, వాటిని నిల్వ ఉంచిన విధానం, కీటకాలతో తయారు చేసిన చిత్రపటం విద్యార్థులను ఆకట్టుకుంది. వర్మీ కంపోస్టింగ్ యూనిట్ ను సందర్శించి వానపాముల ద్వారా కంపోస్టు తయారీని ప్రయోగాత్మకంగా తెలుసుకున్నారు.కృత్రిమ ఎరువులు వాడకుండా పంట దిగుబడి పెంచడంలో వర్మీ కంపోస్ట్ పాత్ర కీలకమని కళాశాల నిపుణులు తెలిపారు. ఆదాయ వనరుగా వెర్మికంపోస్ట్ ను ఏ విధంగా మలచుకోవచ్చో విద్యార్థులు తెలుసుకున్నారు.జంతు శాస్త్ర విభాగం అధ్యాపకులు నీరజ, లక్ష్మణ్, తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రమోద్ కుమార్, జి శ్రీలత, చరిత్ర విభాగం అధ్యాపకులు ఎస్ మల్లికార్జున్, ఆంగ్ల విభాగం అధ్యాపకులు డి సునీత, వై వెంకట సాయి, పర్యవేక్షణలో దాదాపు 100 మంది విద్యార్థినులు ఈ క్షేత్రాన్ని పర్యటించి వైజ్ఞానికపరమైన, చారిత్రికపరమైన, సాంస్కృతికపరమైన విషయాలను తెలుసుకొని వాటి గురించి అవగాహనతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. ఇలాంటి క్షేత్ర పర్యటనల వల్ల విజ్ఞానతో పాటు మానసిక వికాసం కూడా కలుగుతోందని విద్యార్థులు పేర్కొన్నారు.

# గల్ఫ్ ఎక్స్ గ్రేషియా నిధుల విడుదలకు సీఎం ఆదేశం



**జగిత్యాల ప్రజాబలం ప్రతినిదిమార్చి 01::**గల్ఫ్ లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్గ్రేషియా చెల్లించింది. 113 బాధిత కుటుంబాలకు వెంటనే నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామక్రిష్ణా రావును ఆదేశించినట్లు తెలంగాణ ఖనిజాభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి ఒక ప్రకటనలో తెలిపారు.


శనివారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఖనిజాభివృద్ధి శాఖ సమీక్ష సందర్భంగా అనిల్ ఈరవత్రి గల్ఫ్ ఎక్స్ గ్రేషియా విషయాన్ని సీఎం దృష్టికి తీసికెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి నిధుల విడుదలకు ఆదేశాలిచ్చారు.

శనివారం సాయంత్రం అందిన సమాచారం ప్రకారం జగిత్యాల జిల్లాలో 31, నిజామాబాద్ లో 28, రాజన్న సిరిసిల్ల లో 8, నిర్మల్ లో 5, కామారెడ్డి, సిద్దిపేట నాలుగు చొప్పున, కరీంనగర్, మంచిర్యాల మూడు చొప్పున, మెదక్ లో రెండు, వరంగల్, హన్మకొండ, పెద్దపల్లి, నల్గొండ, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాలలో ఒకటి చొప్పున మొత్తం 94 మంది ఖాతాలలో రూ.5 లక్షల చొప్పున సొమ్ము జమ అయినది.గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకునేలా రూ.5 లక్షల పరిహారం నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు బి. మహేష్ గౌడ్, అనిల్ ఈరవత్రి, ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు డా. ఆర్.భూపతి రెడ్డి, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మేడిపల్లి సత్యం తో పాటు సహకరించిన నాయకులు, గల్ఫ్ కార్మిక నాయకులకు టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# తూప్రాన్ వీరాంజనేయ స్వామి ఆలయంలో 41 రోజుల హనుమాన్ దీక్షా ప్రారంభం.

## భక్తులకు హనుమాన్ మాలలు వేసిన గురుస్వామి సలాక ఆత్రేయ శర్మ.

## హనుమాన్ నామస్మరణతో మారుమ్రోగిన పెద్ద చెరువు కట్ట అంజన్న దేవాలయం.





తూప్రాన్(ప్రజాబలం ప్రతినిధి మార్చి, 1. ప్రజాబలం ప్రతినిధి.మెదక్ జిల్లా తూప్రాన్ చెరువు కట్ట అంజన్న దేవాలయం వద్ద 41 రోజుల హనుమాన్ దీక్షా ను మాలలు వేసి ఆలయ ప్రధాన అర్చకులు సలక ఆత్రేయ శర్మ ప్రారంభించారు. భక్తులకు హనుమాన్ మాలలు వేసి దీక్షా నియమాలు పాటించాలి అని సలాక ఆత్రేయ శర్మ తెలిపారు. మాల ధారణ సమయంలో హనుమాన్ నామస్మరణతో పెద్ద చెరువు కట్ట అంజన్న దేవాలయం మారుమ్రోగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణంలో శ్రీ వీరంజనేయ స్వామి ఆలయంలో శ్రీ ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులకు హనుమాన్ మండల దీక్షమాలధారణ చేపట్టారు. గత 40 సంవత్సర లుగా ఇక్కడ మలధారణ తో పాటు ఈ ఆలయం వద్దనే మాల విరమణ కార్యక్రమం జరుగుతుంది అని తెలిపారు. భక్తులు కోరిన కోరికలు తీర్చు హనుమాన్ ఆలయం గా ప్రఖ్యాత గాంచినా ఆలయం ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో మాల విరమణ రోజు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు లక్ష పూలు ఆకు లతో అభిషేకం వేలది భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పీఠాధిపతులు ప్రజా ప్రతినిధులు చుట్టుపక్కల మండల ప్రజలు భారీ సంఖ్యలో హాజరవుతారు. ఆలయ ప్రాంగణం శోభాయ మానంగా కాషాయ రంగు తో వెలుగొందుతోంది.

# ఇటీవల మరణించిన వారి దశదిన కర్మ కార్యక్రమాలకు హాజరైన డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



ఇల్లందు ప్రతినిధి మార్చి01(ప్రజాబలం) ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోత్ నక్కులాయి భర్త టాకిర్యా మరణించడంతో వారి భౌతికకాయాన్ని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ సందర్శించడం జరిగింది. టాకిర్య మరణం గ్రామ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు గుత్త వెంకటేశ్వరరావు తండ్రిగారైన గుత్త అనంతరామయ్య మరియు కామేపల్లి మండలం



ఊట్కూరు గ్రామానికి చెందిన కొనకంచి శంకర్ మాతృమూర్తి కొనకంచి కనకమ్మ గారి దశదిన కర్మ కార్యక్రమాల్లో పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫతే మహమ్మద్ గుత్తా వెంకటేశ్వర రావు, కొనకంచి శంకర్, బ్రావజ్, రామచంద్రు, భానోత్ నరసింహ నాయక్ మేకపోతుల మహేష్ శీలం పుల్లయ్య, బండి లక్ష్మీనర్సు బండి ఉపేందర్, మొగిలి శ్రీను ముత్తే బోయిన రామ్మూర్తి తాటిపల్లి నరసింహారావు, నల్లమోతు లక్ష్మయ్య తుమ్మలపల్లి ప్రభాకర్, అజ్మీర రాందాస్ అజ్మీర అర్జున్, వడియాల కృష్ణారెడ్డి కొర్ర రాములు భూక్య సీతారాములు మరియు తదితరులు పాల్గొన్నారు

# మాదిగ అమర వీరులకు ఘన నివాళి... ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన అమరులకు నివాళులు



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 01(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా/మాదిగ హక్కుల ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమ అమరులను స్మరిస్తూ ఘన నివాళి అర్పించిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు,మండల కేంద్రమైన సదాశివపేటలో శనివారం నాడు ఎమ్ఆర్పిఎస్ మండల అధ్యక్షులు కోలకుంద మోహన్ ఆధ్వర్యంలో స్థానిక బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద అమరుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించిన ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు పెద్ద గీత మాదిగ,ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు, బుచ్చంద్ర మాదిగ,ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షులు ఉపాధ్యక్షులు కాశీపురం ఆంజనేయులు,అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ పోరులో భాగంగా అసువులు బాసిన అమరుల త్యాగాలు మరువలేనివి అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్ఐఎమ్ టౌన్ ప్రెసిడెంట్ గౌస్, జన్ను బాయ్, వసీం, జనార్ధన్ మాదిగ, రమేష్ మాదిగ, ప్రసాద్ మాదిగ, నరసింహులు మాదిగ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 01: మంచిర్యాల జిల్లాలోని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్లో వివిధ శాఖల జిల్లా అధికారులు,సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...నిరుద్యోగ యువతకు నైపుణ్యతపై శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం క్రింద 18 రకాల ట్రేడ్లలో (మేషన్, టైలరింగ్,కార్పెంటర్ రంగాలను మినహా) శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ పథకం క్రింద అందిన దరఖాస్తులలో ఎల్-1 స్థాయిలో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న వాటిని నిబంధనల మేరకు పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. యువతకు భవన నిర్మాణ రంగం, పెయింటింగ్, ఎలక్ట్రీషియన్,కార్పెంటర్, ప్లంబింగ్,మోటార్ సైకిల్ మరమ్మత్తు వంటి వాటిపై శిక్షణ అందించాలని తెలిపారు.జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా వ్యవసాయ రంగానికి సంబంధించి సేంద్రియ ఎరువుల తయారీ, ఉద్యానవన పంటలు ఇతర అంశాలపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. యువత ప్రస్తుత సమాజంలో డిమాండ్ ఉన్న రంగాలను ఎంచుకొని శిక్షణ పొంది జీవితంలో స్థిరపడే అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు.జిల్లాలో మరిన్ని జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం నాయక్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి,మంచిర్యాల ప్రభుత్వ ఐ.టి.ఐ.కళాశాల ప్రిన్సిపల్ వై.రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచేలా రుణాలు



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 01:ఈరోజు మన జిల్లాలోని ముడిచింతలపల్లి గ్రామంలో రైతు వేదిక నందు కేంద్ర బడ్జెట్ 2025-26 ప్రకటనల అమలు మరియు వ్యవసాయ వృద్ధి మరియు ఉత్పాదకత కార్యక్రమాన్ని జిల్లా లీడ్ మేనేజర్ సి శివ ప్రసాద్ మరియు వారి సిబ్బందితో పాటు డి ఎ ఓ, డి వి ఎ హెచ్ ఓ, డి ఎఫ్ ఓ మరియు వారి సహకారంతో ముడిచింతలపల్లిలోని ఎ ఓ లు, వెటర్నరీ డాక్టర్లు మరియు వారి సిబ్బంది మరియు అనేక మంది స్థానిక రైతులు పాల్గొన్నారు.

రైతులకు సరసమైన మరియు సులభమైన రుణాన్ని అందించడానికి ప్రభుత్వం యొక్క కొత్త చొరవ: సవరించిన వడ్డీ రాయితీ పథకం కింద రుణ పరిమితిని పెంచడం - 3 లక్షల నుండి 5 లక్షలకు"

కేంద్ర బడ్జెట్ 2025-26 భారతదేశ అన్నదాతపై తగిన దృష్టిని కేంద్రీకరించింది, వ్యవసాయ వృద్ధి మరియు ఉత్పాదకతను ప్రోత్సహించడానికి ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించింది. అభివృద్ధి జోక్యం కోసం పది కీలక దృష్టి రంగాలలో ఒకటిగా గుర్తించబడిన వ్యవసాయం భారతదేశ ఆర్థిక పురోగతిని నడిపించే శక్తివంతమైన ఇంజిన్గా ఉంది.

కేంద్ర బడ్జెట్ 2025-26 ప్రకటనల అమలు గురించి చర్చించడానికి మార్చి 01, 2025న "వ్యవసాయం %ఆ% గ్రామీణ శ్రేయస్సుపై బడ్జెట్ అనంతర వెబినార్" జరిగింది. ప్రారంభ వ్యాఖ్యలను గౌరవనీయ ప్రధానమంత్రి అందించారు మరియు వ్యవసాయం %ఆ% రైతు సంక్షేమ శాఖ నుండి వివిధ విభాగాల కార్యదర్శులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డి ఓ ఎ మరియు ఎఫ్ డబ్ల్యు నుండి వివిధ ప్రతినిధులు, ఆర్ బి ఐ, నాబార్డ్, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, రాష్ట్ర సహకార సంస్థలు మరియు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీలు, కృషి వికాస్ కేంద్రాలు,మరియు దేశంలోని మూల మూలల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు ఆన్లైన్ లో పాల్గొన్నారు.

ఆర్థిక సర్వే 2024లో కూడా పేర్కొన్నట్లుగా, 31.3.2024 నాటికి, 7.75 కోట్ల ఆపరేషనల్ కిసాన్ క్రెడిట్ కార్డ్ ఖాతాలు ఉన్నాయి. స్వల్పకాలిక క్రెడిట్ అవసరాలను తీర్చడం ద్వారా, కె సి సి పథకం వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో మరియు రైతుల ఆదాయాలను పెంచడంలో కీలక పాత్ర పోషించింది.కె సి సి-సవరించిన వడ్డీ రాయితీ పథకం రైతులకు 4 శాతం వడ్డీ రేటుతో సమర్థవంతమైన సబ్సిడీ రేటుతో రుణాలను అందిస్తోంది.

సరసమైన రుణాన్ని సులభంగా పొందేలా చేయడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూచీకత్తు లేని కె సి సి రుణాలను ?1.6 లక్షల నుండి ?2 లక్షలకు పెంచింది. ఒక పెద్ద ముందడుగుగా, 2025-26 కేంద్ర బడ్జెట్ సవరించిన వడ్డీ రాయితీ పథకం కింద రుణ పరిమితిని ?3 లక్షల నుండి ?5 లక్షలకు పెంచింది. ఈ చర్య వ్యవసాయంలో ఎక్కువ పెట్టుబడిని ప్రోత్సహిస్తూ చిన్న మరియు సన్నకారు రైతులపై ఆర్థిక ఒత్తిడిని తగ్గిస్తుందని భావిస్తున్నారు. పంట ఉత్పత్తి, ఉద్యానవనం, పశు సంవర్ధకం మరియు మత్స్య సంపద కోసం రైతుల పెరిగిన పని మూలధన అవసరాలను తీర్చడంలో ఇది గణనీయంగా సహాయపడుతుంది.

గత దశాబ్దంలో ఎం ఐ ఎస్ ఎస్ ద్వారా రైతులకు ప్రభుత్వం రూ. 1.44 లక్షల కోట్లు అందించింది. ఈ చొరవల ద్వారా, 2023-24లో రూ. 9.81 లక్షల కోట్ల నుండి 2029-30 నాటికి రూ. 20 లక్షల కోట్లకు వ్యవసాయ స్వల్పకాలిక రుణాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ చర్యల ద్వారా, ప్రభుత్వం గ్రామీణ రుణ సౌలభ్యాన్ని పెంచడమే కాకుండా, రైతులకు ఆర్థిక స్వాతంత్ర్యంతో సాధికారత కల్పిస్తోంది. ఈ చొరవ దేశవ్యాప్తంగా అమలులోకి వస్తున్నందున, భారతదేశంలో వ్యవసాయ రుణాన్ని పునర్నిర్వచించగల సామర్థ్యం దీనికి ఉంది, సకాలంలో మరియు సరసమైన క్రెడిట్ అత్యంత అవసరమైన వారికి చేరేలా చేస్తుంది అని మన దేశ ప్రధానమంత్రి విశ్లేషించారు.

# నాచారం లో ఘనంగా శ్రీపాదరావు జయంతి



ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గం మార్చ్01: శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలు నాచారం లో ఘనంగా నిర్వహించారు. నాచారం లాయన్స్ క్లబ్ ఎలైట్ మరియు ఎస్ఎస్ఎస్ యువసేన, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో సాధన మానసిక దివ్యాంగుల కేంద్రం లో దివ్యాంగుల మధ్య శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం దివ్యాంగులకు ఆహారం, పండ్లను అందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ సర్పంచ్ స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి, శాసనసభ్యుడిగా, శాసనసభాధిపతిగా పదవి చేపట్టి పదవికే వన్నె తెచ్చారని అన్నారు. రాష్ట్రానికి ఎనలేని సేవచేశారని గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరుగాంచిన శ్రీపాద రావు ఆశయ సాధనకోసం ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాచారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుంటుక కృష్ణా రెడ్డి, మామిడాల రాజారెడ్డి. కార్యకర్తలు జావీద్, నరేష్, ఎస్ఎస్ఎస్ యువసేన సభ్యులు కిషోర్ రెడ్డి, విజయ్ సింగ్,సాయి చంద్, ఆరెల్లి శ్రీధర్, అక్షంత్ పదాల,సెబాస్టియన్,ఆండ్రూ, ఆకుల రాకేష్ ,జోషిద్ యాదవ్ తదితరులు హాజరయ్యారు

## స్థానిక సంస్థలలో వికలాంగుల నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టం చేయాలి....... ఎన్‌పీఆర్‌డీ డిమాండ్

### పి శశికళ గౌరవ అధ్యక్షులు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక హైదరాబాద్ సౌత్ కమిటీ



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గ్రామపంచాయతీ,మున్సిపాలిటీ,మండల పరిషత్, జిల్లా పరిషత్లలో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో నేడు జియాగూడలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

రాష్ట్రంలో 2024 డిసెంబర్ నాటికి 12769 గ్రామ పంచాయతీలు, 130 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్స్, 540 మండల పరిషత్లు, 32 జిల్లా పరిషత్లు ఉన్నవి. ఇప్పటికే రాజస్థాన్, చత్తీస్ గడ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున పంచాయతీ రాజ్ చట్టానికి మరియు మున్సిపల్ చట్టానికి సవరణలు చేసి, ఇద్దరు వికలాంగులను నామినేట్ చేసేందుకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018,తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019లలో సవరణలు చేసి, ప్రత్యేక చట్టం చేసి వికలాంగులకు అవకాశాలు కల్పించాలని కోరుతున్నాము. స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేస్తే గ్రామ పంచాయతీలలో 25,538 మందికి, మున్సిపాలిటీలలో 260 మందికి, మున్సిపల్ కార్పొరేషన్లలో 26 మందికి, మండల ప్రజా పరిషత్ లలో 1080మందికి, జిల్లా పరిషత్లలో 64 మందికి రాజకీయ అవకాశాలు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 26,968 మందిని నామినేటెడ్ చేయడానికి అవకాశం ఉంది. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల్లో వికలాంగులకు(నామినేట్ ) ప్రతినిత్యం కల్పిస్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేసి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

సంతకాల సేకరణ కార్యక్రమంలో హైదరాబాద్ నగర ఉపాధ్యక్షులు ఎస్ రాజు, సహాయ కార్యదర్శి నర్సింగ్, నాయకులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 01(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్,విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు.సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం సమీపంలోని శివాజీ నగర్ లో ఉన్న షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా వసతి గృహంలో కిచెన్ షెడ్డును, డైనింగ్ హాల్ను, స్టోర్ రూమ్ లో నిత్యవసర వస్తువులను పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున చదువుపై విద్యార్థులు దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు,ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## జగిత్యాలలో నలంద హై స్కూల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు



**(ప్రజాబలం జగిత్యాల జిల్లా: ప్రతినిధి మార్చి 1)** జగిత్యాల జిల్లా వాణి నగర్ లోని నలంద హై స్కూల్లో శనివారంనాడు ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్ని జంతు శాస్త్రం మరియు వృక్షశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు సైన్సు గురించిఆలవాట్లు మరియు విజ్ఞానాన్ని ప్రేరేపించడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఈ వేడుకలు చేపట్టబడ్డాయి.

ఈ కార్యక్రమంలో నాన్-సైన్స్ విభాగం విద్యార్థులకు ల్యాబ్‌లలోని స్పెసిమెన్‌లు, వివిధ మోడల్స్, ల్యాబ్ ఆపరేటర్లు ప్రదర్శించి, సైన్స్ సూత్రాలను అర్థం చేసుకోవడానికి సహాయపడింది. అలాగే, కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో క్విజ్ పోటీ కూడా నిర్వహించి, విజేతలను అభినందించారు.తదుపరి సమావేశంలో, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి సిని పాల్ వావోలిల్ మరియు తామస్ గారు రామన్ ఎఫెక్ట్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. వారు సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించుకోవాలని, అలాగే ప్రస్తుతకాలంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సైన్సు విషయాలను అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## తూప్రాన్ లో ఆదివారం నుంచి శ్రీ కృష్ణ అష్టాంగ యోగ సెకండ్ బ్యాచ్ ప్రారంభం.



**తూప్రాన్, ఫిబ్రవరి,28 ప్రాజబలం ప్రతినిధి:-**మెదక్ జిల్ల తూప్రాన్ పట్టణంలోని ఆరోగ్య అభిమానులు కోరికపై అందరికీ ఆరోగ్యం, ఆనందం, మానసిక ప్రశాంతత అందించాలనే ఉద్దేశ్యంతో 11 రోజుల శిబిరాన్ని ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీ శివ శివాని పంక్షన్ హాల్ లో పరిచయ కార్యక్రమం తో ప్రారంభిస్తున్నట్లు యోగా నిష్ణాతులైన పూజ్య శ్రీ ఆచార్యులు శ్రీకోటి కళింగరాజు గురిజి తెలిపారు. అష్టాంగ యోగ శిబిరం ద్వార సంపూర్ణ ఆరోగ్యం అందించిన సుధీర్ఘ అనుభవం తో దేవో దేవాలయ ప్రోక్తూహ జీవో దేవో సనాతన ధర్మంలో జబ్బులు తగ్గించడమే ఆరోగ్యం కాదు, జబ్బులు రాకుండా చేయడమే ఆరోగ్యం గురించి గురు ముఖంగా సాధన చేయండి సంపూర్ణ ఆరోగ్యం ఆయుష్షు పొందాలని పిలుపునిచ్చారు. ఈ యోగ సాధన ద్వార వ్యాధి నిరోధక శక్తి, సంకల్ప శక్తి, సహణ శక్తి, జ్ఞాపక శక్తి, ప్రతి కణానికి శక్తి, విశ్వ శక్తి, ప్రాణ శక్తి, ప్రకృతి జీవన విధానం, అందం, యవ్వనం, ముఖంలో తేజస్సు, శరీర అవయ శుద్ధి, పాజిటివ్ థింకింగ్, అక్యుప్రెజర్, లాఫింగ్ థెరపీ, ధ్యానం, పిజికల్ ఎక్సర్ సైజులు, శక్తి నిచ్చే ప్రాణాయామం, శరీర పోషకాహారం, ప్రత్యేక ఆసనాలు, సూర్య నమస్కారాలు,శంఖు ప్రక్షాళన, ఆధ్యాత్మికంగా ఎదుగుదల, నేను ఎవరు? భగవంతుడు ఎవరు? నే పలు ఆసక్తికర విషయాలు శాస్త్రీయంగా విశ్లేషించి యధార్థ విషయాలను అరటి పండు వలిచి పెట్టినట్లు యోగా లోని రహస్యాలు తెలుసుకుంటూ గురుముఖంగా యోగ సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మంచి ఉత్తమ ఫలితం తప్పనిసరిగా వస్తుందని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి జబ్బులు రాకుండా ఉన్న జబ్బులు తొలగించుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే సంకల్పం ఉన్న ప్రతి ఒక్కరూ యోగాలో పాల్గొనండి అని అన్నారు. ఎన్ని రకాలుగా మందులు వాడినా తగ్గని దీర్ఘ కాలిక అనారోగ్య సమస్యలకు ఈ శిక్షణలో చక్కని యోగ సాధనతో పాటు అన్ని రకాల విటమిన్లు, ప్రోటీన్లు, మినరల్స్ తో కుడిన పోషక అమృత ఆహారం ప్రతి రోజు అందించబడునని తెలిపారు. మాంసా హారం తినేవారు, టీ, కాఫీ, మద్యం సేవించే వారు కూడా ఈ శిక్షణలో పాల్గొనవచ్చు నని తెలిపారు. ఇంకా ఇతర వివరాలకు జీ. రవినాథ్ ఫోన్ నెంబర్ 8465852134, లేదా గురిజీ సేల్ ఫోన్ నెంబర్ 9396267660 లో సంప్రదించవచ్చు అని తెలిపారు.



## శ్రీ వైష్ణవి ఒలింపియాడ్ స్కూల్ లో ఘనంగా ఆర్ట్ మరియు సైన్స్ ఎక్షిబిషన్



**సంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:**సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం బీరంగూడలోని శ్రీ వైష్ణవి ఒలింపియాడ్ స్కూల్ లొ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారము ఆర్ట్ మరియు సైన్స్ ఎక్షిబిషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి శ్రీ వైష్ణవి ఒలింపియాడ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సుశీల్ వర్మ విచ్చేసి ఆర్ట్ %ం% సైన్స్ ఎక్షిబిషన్ ను ప్రారంబించారు. విద్యార్ధులు రూపొందించిన పలు ఆవిష్కరణలను ను వీక్షించి అభినందించారు. విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసి అద్భుతమైన ప్రాజెక్టులను రూపొందించారని అన్నారు. ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరి పెంపొందించడం కోసం పాఠశాలలో సైన్స్ ఫేర్ నిర్వహించడం జరిగిందని విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫేర్‌లు ఎంతో దోహదపడతాయని ప్రిన్సిపాల్ సోనుకుమార్ యాదవ్ తెలిపారు. విద్యార్థులు రూపొందించిన దాదాపు 170 కి పైగా వర్కింగ్ మోడల్స్ చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సుశీల్ వర్మ , ప్రిన్సిపాల్ సోను కుమార్ యాదవ్ , ఇంచార్జ్ మేగన ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 1** మార్చి 2025 భారత రాష్ట్ర సమితి పార్టీ డైనమిక్ యూత్ లీడర్ పట్లోల్ల కార్తీక్ రెడ్డి పుట్టిన రోజు శుభ సందర్భముగా మార్చి 1 శనివారం రోజున కే.సి.ఆర్ క్రికెట్ ట్రోఫీ ఫైనల్ ఆట సమయాన పార్టీ తరపున కేక్ కటింగ్ రాజేంద్రనగర్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని పెద్ద మంగళారంలో గల హాట్ స్పాట్ క్రికెట్ గ్రౌండ్ లో సామూహికంగా అతి ఉత్సాహంతో నిర్వహించడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఏర్పుల శ్రీకాంత్, ఉపేందర్ రెడ్డి, సంఘం శ్రీకాంత్, రామ్ సుబ్బరెడ్డి, బుద్దోలు బాబు, రాజేంద్ర ప్రసాద్, విజయలక్ష్మి, సుమనళిని, భాను చందర్, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, రేఖ, శ్రీనివాస చారి, బాలాజీ, భాస్కర్ గౌడ్, రమణ మూర్తి, కేశవ రెడ్డి, ప్రవీణ్, బిట్లుగు రాజు,

తిరుపతి, హుసన్, శివ తది తర నాయకులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారని తదనంతరం శాద్నగర్ లో గల రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం వద్ద భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ కార్యకర్తలు సామూహికంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని కార్తీక్ రెడ్డిని ఆయూర్ ఆరోగ్యాలతో విరాజిల్లుతూ రాబోయే తరంలో ప్రజా ప్రతినిధిగా శాసన సభలో అడుగిడుతూ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు బడుతూ శాసన సభ్యునిగా పేరుగాంచాలని హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియ చేయడం జరిగినది.

## ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు కొరకు దరఖాస్తు స్వీకరణ జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 01 :** మంచిర్యాల జిల్లాలోని ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ సంచాలకులు / కార్యదర్శి ఆదేశాల ప్రకారం 2023 సంవత్సరానికి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు కొరకు జిల్లాలోని ఆశావహులైన ఉపాధ్యాయులు ఈ నెల 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 20,2025న జారీ చేయబడిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు ఫారం తగు నిబంధనలు, షరతులతో జతచేయబడిందని, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మొదటి అంతస్తు ఎఫ్-5లో గల మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించి ఉచితంగా దరఖాస్తు ఫారం పొందవచ్చని, ఇతర వివరములకు 8555841417 నంబర్లో సంప్రదించవచ్చని తెలిపారు.

# అప్రమత్తత, అవగాహన ద్వారా సైబర్ నేరాలను అరికట్టవచ్చు.

## భయమే పెట్టుబడిగా సాగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి సైబర్ నెరలపై అవగాహన పెంచుకోండి. సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోయారా? మీ డబ్బును పోగొట్టుకున్నారా? అయితే వెంటనే డయల్ 1930 కు కాల్ చేయండి. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**రాజన్న సిరిసిల్ల జిల్లా , మార్చి- 01 (ప్రజాబలం ప్రతినిధి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భయమే పెట్టుబడిగా సాగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి సైబర్ నెరలపై అవగాహన పెంచుకోవలని , అప్రమత్తత, అవగాహన ద్వారానే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని,సైబర్ నేరం జరిగిన మొదటి గంటలోనే(గోల్డెన్ అవర్) ఫిర్యాదు చేయడం ద్వారా స్కామర్ అకౌంట్ ను ఫ్రీజ్ చేసి పోయిన డబ్బు రికవరీ సులభతరమవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోయారా? మీ డబ్బును పోగొట్టుకున్నారా? అయితే వెంటనే డయల్ 1930 కు కాల్ చేయాలని సైబర్ క్రైమ్ సైట్ లో ఫిర్యాదును నమోదు చేయండం ద్వారా మీ డబ్బును తిరిగి పొందే ఆస్కారం ఉంటుందన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ఈ వారం రోజుల వ్యవధిలో జరిగిన కొన్ని సైబర్ నేరాలు..

(1).చందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులు ఒక వాట్సాప్ లో వచ్చిన పార్ట్ టైం జాబ్ అనే ప్రకటన చూసి వాళ్లతో కాంటాక్ట్ కావడం జరిగింది. దానిలో భాగంగా మోసాగల్లు టాస్క్ ల పేరుతో తన వద్దనుండి ఇన్వెస్ట్మెంట్ రూపంలో వారు అమౌంట్ పెట్టుబడి పెట్టించడం జరిగింది ఆ విధంగా బాధితులు 65,000/- రూపాయలు నష్టపోయారు.

(2).సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టి ఇస్తామని చెప్పి వాట్సప్ లో చాట్ చేయాగా , అందులో ఇన్వెస్ట్మెంట్ రూపంలో బాదితులు వద్ద నుండి 50,000/- వేల రూపాయలను మోసగించడం జరిగింది.

(3).కొనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడు మొబైల్ పోగొట్టుకోవడం జరుగుతుంది. తర్వాత ఆ మొబైల్ ఫోన్ పే నుండి మొబైల్ దొ%శీ%గిలించిన సస్పెక్ట్ 2,15,000/- రూపాయలను వేరే అకౌంట్ లోకి సెండ్ చేసుకోవడం జరుగుతుంది కావున పిన్ నెంబర్ ఈజీ గా ఉంచుకోరాదు.సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.

1). లోన్ యాప్ లకు దూరంగా ఉండాలి.
2).కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్ లో అస్సలు వెతకవద్దు. ఆయా సంస్థల అధికారిక వెబ్ సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నంబర్లను పొందాలి.
3).అపరిచిత నంబర్ల నుంచి ఫేస్ బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్ కు స్పందించవద్దు.
4). లాటరీ ఆఫర్లంటూ వచ్చే మెసేజ్ లను నమ్మవద్దు.
5).అన్ వెరిఫైడ్ యాప్స్, వెబ్ సైట్స్ అందించే ప్రకటనలు నమ్మవద్దు. వారిచ్చే మోసపూరిత ఆఫర్లకు స్పందించి మోసపోవద్దు.
6).%యాశ, 99ఖఎతీవం, మీఖస్త్రఅఎఎతీఅఎం% లాంటా యాప్స్ లలో ఆర్మీ సోల్జర్లం, ఆఫీసర్లం అంటూ ఎవరైన సంప్రదిస్తే నమ్మి మోసపోవద్దు.
7). ఈజీ రిటర్న్స్, కమిషన్ బేస్డ్ సైట్లలో పెట్టుబడి పెట్టవద్దు.
8). పాస్వర్డ్, ఓటీపీ, పిన్ లాంటి వివరాలను ఎట్టిపరిస్థితుల్లో ఎవరికీ షేర్ చేయవద్దు.
9).మీకు లాటరీ తగిలిందంటూ ఎవరైనా మెసేజ్ చేసినా, మెయిల్ పంపించినా స్పందించవద్దు.

సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేయాలి. లేదా సైబర్ క్రైమ్ వెబ్ సైట్లో రిపోర్ట్ చేయాలి.

# సంయుక్త ఇంటర్నేషనల్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి మార్చ్ 01(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/కొండపూర్ మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని సంయుక్త ఇంటర్నేషనల్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించారు,విద్యార్థులు ఆనేక రకాల సైన్స్ పరికరాల ఉపయోగాలు పర్యావరణ అనుకూల ఆవిష్కరణలు శాస్త్రీయ ప్రమాణాలతో తయారు చేసిన ప్రయోగాల గురించి క్లుప్తంగా వివరించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ పాల్గొన్నారు,సైన్స్ ఎగ్జిబిషన్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు,విద్యార్థులకు ఉత్సాహాన్ని కలిగించేలా సూచనలు అందించారు,అనంతరం నిర్వాహకులు టీచర్లు సాయినాథ్ ని శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.సాయినాథ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజ్ఞానాన్ని పొందారు.

# యుపిఎస్ పై యుద్ధభేరి పోస్టర్ ను ఆవిష్కరించిన డిప్యూటీ ఎమ్మార్వో వీరేశం



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి మార్చ్ 01(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/ సదాశివపేట/మార్చి 2 ధర్నా చౌక్ ఇంద్ర పార్క్ వద్ద నిర్వహించే యుపిఎస్ పై యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం సదాశివపేట పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో డిప్యూటీ ఎమ్మార్వో వీరేశం చేతులమీదుగా యుద్ధభేరి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్నా చౌక్ ఇంద్ర పార్క్ వద్ద జరగబోతున్న యుపిఎస్ పై యుద్ధభేరి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అనంతయ్య, ఉద్యోగులు లింగం,సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు యూ.డి.ఐ.డి నెంబర్ జనరేట్ చేయాలి:: సేర్ప్ సీ.ఈ.వో. దివ్య దేవరాజన్

## నూతన దివ్యాంగులకు మీ సేవా ద్వారా యూ.డి.ఐ.డి కార్డు దరఖాస్తు
## సదెరం సర్టిఫికెట్ ఉన్న ప్రతి దివ్యాంగులకు డి.ఆర్.డి.ఓ లు యూ.డి.ఐ.డి జనరెట్ చేయాలి
## మార్చి 01 నుంచి సదెరం సర్టిఫికెట్ విధానానికి స్వస్తి...
## నూతనంగా యూ.డి.ఐ.డి కార్డుల జారీ
## యూ.డి.ఐ.డి కార్డుల దివ్యాంగులకు ఇతర రాష్ట్రాల్లో కూడా ఉపయోగపడుతాయి
## సోలార్ విద్యుత్ ప్లాంట్ల డిపిఆర్ లను తయారు చేయాలి
## యూనిక్ డిసేబులిటీ ఐ.డి జారీ, సోలార్ పవర్ ప్లాంట్ ల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సేర్ప్ సీఈవో దివ్య దేవరాజన్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి- 01(ప్రజాబలం ప్రతినిధి)**ప్రతి దివ్యాంగులకు యూ.డి.ఐ.డి నెంబర్ జనరెట్ చేయాలని పంచాయతీరాజ్ కార్యదర్శి దివ్య అన్నారు.శనివారం సేర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ సదరం సర్టిఫికెట్ల నుంచి యూనిక్ డిసేబులిటీ ఐడి జారీ, సోలార్ పవర్ ప్లాంట్ ల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.సేర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ బదలు యూనిక్ డిసేబులిటీ ఐడి జారీ చేయాల్సి ఉంటుందని, సదరన్ సర్టిఫికెట్ నుంచి ఈ కార్డు జారీ కు బదిలీ చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని అన్నారు.దివ్యాంగులకు వైద్యులచే ధృవీకరించిన వైకల్య శాతంతో కూడిన సదరన్ సర్టిఫికెట్ ను యూ.డి.ఐ.డి పోర్టల్ లో నమోదు చేయాలని, దివ్యాంగులకు సంబంధించి ఇతర వివరాలు సంపూర్ణంగా నమోదు చేయాలని అన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి కార్డు స్పీడ్ పోస్ట్ ద్వారా నేరుగా ఇంటి అడ్రస్ కు అందుతుందని ఆమె తెలిపారు.

అందులకు విజన్, కుష్టి వ్యాధి గ్రస్తులు, వినికిడి సమస్య గలవారు, అంగవైకల్యం గలవారు, మానసిక వైకల్యం గల వారికి వైకల్య శాతాన్ని పరిశీలించి యూ.డి.ఐ.డి కార్డులు జారీ చేయాల్సి ఉంటుందని అన్నారు. నూతనంగా యూ.డి.ఐ.డి కార్డుల కోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, సదరం సర్టిఫికెట్ ఉన్నవారికి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ద్వారా యూడిఐడి జనరేట్ చేయడం జరుగుతుందని తెలిపారు.ఫిబ్రవరి 28,2025 వరకు జారీ చేసిన సదరన్ సర్టిఫికెట్లతో చేయుట పెన్షన్,ఇతర సదుపాయాలను మన రాష్ట్రంలో దివ్యాంగులు పొందవచ్చని, ఇతర రాష్ట్రాల్లో ఏదైనా సౌకర్యం పొందాలంటే దివ్యాంగులకు యూ.డి.ఐ.డి కార్డు తప్పనిసరి అని అన్నారు. మార్చ్ ఒకటి నుంచి దివ్యాంగులకు యూ.డి.ఐ.డి జారీ చేయడం జరుగుతుందని, వీటి ద్వారానే పెన్షన్ ఇతర సౌకర్యాలు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.జిల్లాలో ఉన్న మీసేవ కేంద్రాల నిర్వహకులకు, పంచాయతీ కార్యదర్శులకు, విఓఏలకు , సీసీలకు ఎంపీడీవోలకు, ఏడిఎంలకు యూ.డి.ఐ.డి దరఖాస్తుల నమోదు పై అవగాహన శిక్షణ అందించాలని అన్నారు. ఆసుపత్రిలో యూ.డి.ఐ.డీ నిర్ధారణ కోసం అవసరమైన వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలని, క్యాంపు అప్పుడు దివ్యాంగులకు కుర్చీలు త్రాగు నీరు ఇటువంటి వస్తువులు కల్పించాలని అన్నారు.జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ తో సమన్వయం చేస్తూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి నూతనంగా కావాల్సిన వస్తువుల ప్రతిపాదనలు అందజేయాలని ఆమె కలెక్టర్లకు సూచించారు. నూతనంగా యూ.డి.ఐ.డి కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆసుపత్రి లో స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలని, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత యూ.డి.ఐ.డి కార్డు జనరెట్ చేయాలని అన్నారు. ప్రధానమంత్రి కుసుం పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాలలో స్థలాలను గుర్తించడం జరిగిందని, అక్కడ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేసే విధంగా డిపిఆర్లను తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శి సూచించారు. వ్యవసాయ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధులు, ప్రధానమంత్రి కుసం పథకం వినియోగించుకొని రైతులు మహిళా సంఘాల ద్వారా నడిపేలా చిన్న చిన్న సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని కలెక్టర్లకు సూచించారు.ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఓ.శేషాద్రి, డి.డబ్ల్యూ.ఓ.లక్ష్మీరాజం, అడిషనల్.డి.ఆర్.డి.ఓ.శ్రీనివాస్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలి
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 01 :** మంచిర్యాల జిల్లాలో ఈ నెల 5 నుండి 25 వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య లతో కలిసి ముఖ్య పర్యవేక్షకులు, సంబంధిత అధికారులతో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 4 వేల 965 మంది జనరల్, 935 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 5 వేల 625 మంది, 1 వేయి 15 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు.పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్,త్రాగునీరు,ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థుల పరీక్ష కేంద్రంలోనికి వెళ్ళే సమయంలో తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థినులను తనిఖీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని,పరీక్షా కేంద్రంలోని మొబైల్,ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని, తనిఖీ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రశ్నా పత్రాలు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి అవసరమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని,ప్రశ్నా పత్రాలు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు,ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో సమయానుసారంగా బస్సులు నడిపించాలని తెలిపారు.పరీక్ష ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలను బందోబస్తు మధ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ముఖ్య పర్యవేక్షకులు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వింత వ్యాధితో కొర్విచెల్మ గ్రామంలో పశువులు చనిపోవడం



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 01 :** మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామంలోని పోరళ్ళ చంద్రమౌళి అనే వారి యొక్క పశువుల వింత వ్యాధి తో చనిపోయిడం జరిగిందని రైతు తెలుపడం జరిగింది,ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ...ఎంతో కష్టపడి ఉపాధి కోసం పశువులను కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించుకుంటూ ఉండే తన పశువులు వింత రోగంతో చనిపోవడం చాలా బాధాకరమని తెలిపారు,ఈ వ్యాధి రావడంతో అందుబాటులో వున్నా పశు సంరక్షక గ్రామ,మండల అధికారులతో చికిత్స చేయించిన,వాటి ఆరోగ్యం కాలేక చనిపోవడం మాకు ఎంతో నష్టమని రైతు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ... ఇలాంటి రోగం ఎప్పుడు రాలేదని మాఊర్లో ఉన్న పశువులకు ఇంకా ఎన్ని చనిపోతాయని,ఆందోళనతో వ్యక్తం చేశారు.సంబంధిత జిల్లా,అధికారులు,చొరవతో మా గ్రామంలోని పశువులను కాపాడాలని గ్రామంలో ప్రజలు తెలిపారు.

## ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 01 :** లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్.-2020 లో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో నీటిపారుదల శాఖ ఎ.ఈ.లు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎల్.ఆర్.ఎస్.దరఖాస్తుల పరిశీలన, ఆస్తి పన్ను వసూలు,పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పరిరక్షణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పనులను వేగవంతం చేయాలని తెలిపారు.ఎల్.ఆర్.ఎస్. -2020 ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ ఆదేశాల మేరకు నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని,ప్రత్యేక శ్రద్ధ వహించి దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు రెవెన్యూ రికార్డులను సరి చూసుకోవాలని,అర్హత గల వారికి ఎలాంటి నష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలని,ప్రభుత్వ భూములను కాపాడాలని తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు.నీటిపారుదల శాఖ పరిధిలో తనిఖీల సమయంలో భూములు నీటి వనరులు, బఫర్ జోన్,ఎఫ్.టి.ఏ.లలో ఉండకుండా చూడాలని, లే-అవుట్ క్రమబద్ధీకరణ సమయంలో నిబంధనలు తప్పనిసరి పాటించాలని, అప్రోచ్ రోడ్,ప్లాట్ల మధ్య రోడ్లు సరిగా ఉండేలా పరిశీలన చేయాలని,నిషేధిత భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ముందుగా పెండింగ్ దరఖాస్తుల లొకేషన్ను గుర్తించాలని,అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల పరిధిలోని ఆస్తి పన్ను బకాయిలను 100 శాతం వసూలు చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంతర్గత రహదారులు,మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి కాలం అయినందున గ్రామాలలోని ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి త్రాగునీటి సమస్య లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. వేసవిలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సకాలంలో నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పంచాయతీ శాఖకు సంబంధించిన డైరీ-2025ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమర వీరుల స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమం

ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు అవునూరి ప్రసాద్
అంబేద్కర్ విగ్రహం వద్ద అమరవీరులకు ఘన నివాళి



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 01:** అమర వీరుల స్ఫూర్తితో హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు అవునూరి ప్రసాద్ పేర్కొన్నారు.శనివారం ఎంఆర్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమరవీరుల చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఎ సందర్భంగా అయన మాట్లాడుతూ...ఎస్సీ లలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలని, అన్ని కులాలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి చెందినప్పుడే సమానత్వం వస్తుందని తెలిపారు.రాబోయే రోజుల్లో జరగబోయే ఉద్యమాలకు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మురళి కృష్ణ, సీనియర్ నాయకులు అవునూరి లచ్చన్న, చిప్పకుర్తి నారాయణ,ముల్కల్ల రాందాస్, ఎంఆర్పీఎస్ గౌరవ అధ్యక్షుడు తోటపల్లి మహేందర్,పట్టణ అధ్యక్షులు కల్లేపల్లి విక్రమ్,ప్రధాన కార్యదర్శి అడ్లూరి శివకుమార్, అల్లంపల్లి రమేష్,ఆకెనపల్లి శిల్పతి,దర్శనాల నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## అల్మాయిపేట పెద్ద చెరువుకు పూడిక తీయాలని తాసిల్దార్ కు వినతిపత్రం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 01( ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా. ఆందోల్ నియోజకవర్గం లోని అందోల్ మండల పరిధిలోగల అల్మాయపేట గ్రామస్తులు సంగుపేట గ్రామం పైన ఉన్న పెద్ద చెరువు కాలువ పూడికను తీసి వ్యవసాయానికి సాగునీరు అందించాలని. ఈరోజు అందోల్ మండల తాసిల్దార్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. వివరాలలోకి వెళ్తే. అల్మాయిపేట పెద్ద చెరువు నుండి వ్యవసాయానికి సాగునీరు వస్తుంటే. సంగుపేట గ్రామస్తులు. మార్గమధ్యలో కాలువను ధ్వంసం చేసి. అల్మాయిపేటకు సాగునీరు రాకుండా చేస్తున్నారని. స్థానిక తాసిల్దారు గారికి చాలాసార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని సింగూరు నీళ్లు రాకపోవడంతో. వ్యవసాయం చేస్తున్న రైతులందరూ. తమ పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి రావడంతో బోర్ల నీళ్లు కూడా ఎండిపోయిన పరిస్థితి. కనిపించింది. ఈ విషయం మీద స్థానిక ఇరిగేషన్ అధికారులను సంప్రదించగా. ఈరోజు గ్రామపంచాయతీలో రైతులతో సభ ఏర్పాటు చేయడం జరిగింది. సోమవారం నుండి కాలువ పూడికతీత ప్రారంభిస్తామని ఇరిగేషన్ .ఏ ఈ. మజార్ గారు తెలిపారు. అలాగే ఎన్నికల కోడ్ అనంతరం. అల్మాయపేట. చందంపేట్. సంగుపేట్ ఈ మూడు గ్రామ పంచాయతీల ప్రజలను చెరువు కట్టపై సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని అన్నారు వర్షాకాలం వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని తాసిల్దారు గారు. మరియు మజార్ గారు. హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మొగులయ్య.దుర్గయ్య. అనిల్. దుర్గాప్రసాద్. చందంపేట నర్సింలు.. రాములు. దుర్గయ్య బేకరీ దావీదు.కోలకాని ఆంజనేయులు. పన్యాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు

## ఎల్.ఆర్.ఎస్.అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి::కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### అనధికార లే ఔట్ల క్రమబద్దికరణకు అవకాశం
### ఈ నెల 31వ తేదీలోగా చేసుకుంటే 25 శాతం రాయితీ
### కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు
### సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 01 (ప్రజాబలం ప్రతినిధి)**అనధికార లే ఔట్ల క్రమబద్దికరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 31వ తేదీలోగా చేసుకుంటే 25 శాతం రాయితీ ఇస్తుంది. జిల్లాలోని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపినారు.ఎల్.ఆర్.ఎస్ - 2020 క్రింద రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గత సెప్టెంబర్ 2024 లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ అయింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుంది. ఎల్ఆర్ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. లక్షా 90 వేల వరకు ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల ఆమోదించే వాటికి మార్చి 31వ తేదీ వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25% మినహాయింపు ఉంటుంది. సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణయిత నమూనాలో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరిస్తారు.42వేలకు పైగా దరఖాస్తులు.. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలి. ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలి. జిల్లాలో 42,942 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. అందులో 27,170 దరఖాస్తులు ప్రాసెస్ చేయబడినవి. ఇంకా 15,772 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి.

**పరిశీలన ప్రారంభం**

2020 సంవత్సరంలో రూ 1000/- కట్టి ఎల్ఆర్ఎస్ లో దరఖాస్తు చేసుకున్న వారి అర్జీల పరిశీలన ప్రారంభమైంది. తమ ప్లాటు రెగ్యులరైజ్ చేసుకునే వారికి ప్లాటు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటి వాల్యుయేషన్ ప్రకారం ఎల్ఆర్ఎస్లో దరఖాస్తు ఫీజు వేస్తారు. దీంతో ఎల్ఆర్ఎస్లో దరఖాస్తు చేసుకున్న వారికి లాభం జరుగుతుంది. 2020 సంవత్సరంలో అప్లికేషన్ చేసుకున్నవారు తమ తమ పురపాలక, సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించి తమ ప్లాటును రెగ్యులైజ్ చేసుకోగలరు.

ఇబ్బందులు, అనుమానాలు నివృత్తి చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్.అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణలో ఏమైనా ఇబ్బందులు, అనుమానాలు నివృత్తి చేసేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో 18002331495 టోల్ ఫ్రీ నెంబర్ ను అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు సేవలు అందిస్తారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏమైనా అనుమానాలు, ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలి. జిల్లాలోని అర్హులైన వారందరూ గడువులోగా తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలి.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి- డాక్టర్ సుజాత
## మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు

పత్తికొండ లోని బండిగేరి దగ్గర ముస్లిం వీధి నందు ఆనంద్ కుమార్తె కృష్ణ సునంద అనే 8 ఏండ్ల అమ్మాయికి డెంగ్యూ జ్వరము నమోదు కావడం వలన ఆ వీధి నందు ఇంటింటికీ తిరిగి లార్వాలను గుర్తించి నీటిని తొలగించడమైనదీ.ఈ సందర్భముగా డాక్టర్ సుజాత గారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.సమాజ భాగస్వామ్యముతోనే డెంగ్యూవ్యాధిని, చికెన్ గున్యా, మలేరియానివారించవచ్చుని ,దోమలు పుట్టకూడదు దోమలు కుట్టకూడదు అనే నినాదంతో ,ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని,ఆడ ఎడిస్ ఈజిప్ట్ జాతికి చెందిన టైగర్ దోమ ద్వారా డెంగ్యూ జ్వరము , చికెన్ గున్యా జ్వరం వచ్చునని కావున వెంటనే రక్త పరీక్ష చేపించు కొని మందులు వాడాలని, దోమలు పెరగకుండా నీటి నిల్వలు లేకుండా చూడాలని,ఇంటి పరిసరాలలో రోళ్ళు, టైర్లు, కొబ్బరి బొండాలు, టెంకాయచిప్పలు, ప్లాస్టిక్ వస్తువులు లేకుండా చూడాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలని, సాయంత్ర పూట వేపాకుపొగ వేసుకొనవలెనని మరియు తినేటు వంటి ఆహారము, త్రాగే నీరు కలుషితం కావడము వలన వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉందని కావున ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రాగే నీరు వేడి చేసి చల్లారిన తర్వాత త్రాగాలని అవగాహన కలిగించడమైనది.ఆ వీధి నందు దోమల నివారణ మందు పిచికారీ చేయించడమైనది.ఈ కార్యక్రమము నందు ఆరోగ్య పర్యవేక్షకులు ప్రకాష్, వరలక్ష్మి ,యం ఎల్ హెచ్ పీ కరుణ, ఆరోగ్యకర్య కర్త కళావతి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com